అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 31-08-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 193 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

సింగరేణిలో 2364 మంది బదిలీ వర్కర్ల క్రమబద్ధీకరణ

వారిలో 243 మంది మహిళలు : సీఎండీ ఎన్ బలరామ్

11లో





పారాలో పతక మోత

అవని లేఖర పసిడి గురి

మనీశ్ నర్వాల్‌కు సిల్వర్

వివరాలు 12లో

హైడ్రాను ఆహ్వానిస్తున్నాం

భావితరాల కోసం చెరువులు, నాలాల పరిరక్షణ అవసరమే

ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇండ్లు కూల్చొద్దు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

వివరాలు 3లో..



అసమానతలు లేని రాజ్యం కోసం పోరాడాలి

ప్రభుత్వాలు విద్య, వైద్యం ఉచితంగా అందించాలి

ఎక్కడ ప్రభుత్వ భూములున్నా రక్షించి పేదలకు పంచాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

పిలాయిపల్లిలో కళ్లెం వీరారెడ్డి స్మారక భవనం ప్రారంభం

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

కమ్యూనిస్టు కార్యాలయాలు రైతుల, వ్యవసాయ కూలీల, కార్మికుల, పేదల బతుకుల మార్పు కోసం, వారి హక్కుల కోసం పోరాడే కేంద్రాలుగా పనిచేస్తాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. దేశంలో, రాష్ట్రంలో సామాజిక అసమానతలు, దాడులు, దౌర్జన్యాలు కొనసాగుతున్నాయన్నారు. అసమానతలు లేని రాజ్యం కోసం మనమందరం పాటుపడాలని పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం ...11లో

ఉమ్మడి నల్లగొండ సస్యశ్యామలమే నా ధ్యేయం

నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్



భవిష్యత్‌లో ఉత్తమ్ సీఎం : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేయడమనే తన ధ్యేయమని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరిలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నీటి వనరులు, సాగునీటి లభ్యత, నీటిపారుదల శాఖపై ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖ ప్రాజెక్టులు, చిన్ననీటి కాలువలు, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై చర్చించారు. ప్రాజెక్టులన్నింటికీ నిధులు కేటాయించి పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఈ సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటూ సంబోధించారు. ముఖ్యమంత్రి అనే పదాన్ని వాడుతూ.. కాబోయే ముఖ్యమంత్రి అంటూ ...11లో

పర్యాటకంలో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయంచేస్తాం

సీఎం రేవంత్‌రెడ్డి హామీ

వివరాలు 10లో

ఆ మేరకు నూతన విధానాలు

హైదరాబాద్‌లో మరో జూ పార్క్

అనంతగిరిలో నేచర్ వెల్‌నెస్ సెంటర్

ఫోర్త్ సిటీలో వెయ్యి ఎకరాల్లో హెల్త్ హబ్

టీటీడీ తరహాలో యాదగిరి గుట్ట ఆలయ బోర్డు

రామప్పగుడి ఆకృతిలో కీసరగుట్ట పునర్ నిర్మాణం

హెల్త్, ఎకో, టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి :

'స్పీడ్'పై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్

వివరాలు 3లో



స్పీడ్‌పై సమీక్షలో అధికారులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

న్యాయవ్యవస్థపై అత్యంత విశ్వాసం

నా వ్యాఖ్యలను కొంత మంది వక్రీకరించారు : సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో ట్వీట్ 11లో..

మరో బుల్డోజర్‌రాజ్ కానీయొద్దు

పేదల ఇండ్లను కూల్చటమే మీ న్యాయమా..?

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు కేటీఆర్ సూటి ప్రశ్న



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణను మరో బుల్డోజర్‌రాజ్ కానీయొద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్... కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. ఆ మేరకు ఇక్కడి రేవంత్ ప్రభుత్వానికి సూచించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు న్యాయాన్ని, చట్టాన్ని ఉల్లంఘిస్తూ పేదలకు గూడు లేకుండా చేస్తోందని వాపోయారు. 'ఒకరి ఇంటిని కూల్చివేసి వారి కుటుంబాన్ని నిరాశ్రయులుగా మార్చటం అమానవీయం, అన్యాయమంటూ గతంలో మీరే వ్యాఖ్యానించారు. ఇప్పుడు తెలంగాణలో అదే జరుగుతోంది. దీనికి మీ సమాధానమేంటి?' అని ఖర్గేను ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌లోని 75 మంది పేదల ఇండ్లను తెల్లవారుజామున 3 గంటలకు ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చివేసిన సంఘటనను కేటీఆర్ ట్విట్టర్ ద్వారా ఆయన దష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి చర్యలను ఆపాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించాలంటూ విజ్ఞప్తి చేశారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

- 20 తులాల బంగారం, పది తులాల వెండి అపహరణ
- వికారాబాద్ జిల్లాలో భారీ చోరీ



నవతెలంగాణ-పెద్దేముల్

తాళం వేసిన ఇంటికి దొంగలు కన్నం వేసిన ఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం రుద్రారం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సుమారు 20 తులాల బంగారం, 10తులాల వెండిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఇంటి యజమాని దైవదర్శనానికి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రారం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 28న ఉదయం యాదగిరిగుట్టకి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటి ప్రధాన ద్వారం చిలుకుని తొలగించేందుకు ప్రయత్నించగా.. సాధ్యం కాకపోవడంతో తాళాన్ని విరగొట్టారు. అనంతరం లోపలి నుంచి తలుపు పెట్టుకున్నారు. ఇంటి పై అంతస్తులో ఉండే గదిలోకి వెళ్లి బీరువా పగలగొట్టి బంగారం, వెండి వస్తువులు దొంగలించారు. గురువారం రాత్రి 12 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చిన గోపాల్ రెడ్డి దంపతులు ప్రధాన ద్వారానికి తాళం లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. తలుపు తెరిచేందుకు ప్రయత్నం చేసినా తలుపు రాలేదు. దాంతో వారి కారు డ్రైవర్ నరసింహులును మెట్లపై నుంచి వెళ్లి చూడమని చెప్పడంతో అతడు పైకి వెళ్లి చూడగా తలుపులు తెరిచి పెట్టి ఉన్నాయి. దాంతో ఇది దొంగల పనేనని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ గిరి పోలీస్ సిబ్బందితో అదే రాత్రి ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. ఉదయం తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తాండూర్ రూరల్ సీఐ అశోక్‌కుమార్, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి విచారణ జరిపారు. బాధితుల నుంచి వివరాలను సేకరించారు. సుమారు 20 తులాల బంగారం, 10 తులాల వెండి చోరీ జరిగినట్టు గోపాల్‌రెడ్డి దంపతులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పురుగుల అన్నం పెడుతుండ్రు

- జాతీయ రహదారిపై పాలమాకుల కేజీబీవీ విద్యార్థినుల ఆందోళన
- సీఎం స్పందించి పరిష్కరించాలని నినాదాలు
- వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తాం : డీఈఓ
- వెంటనే పరిష్కారించాలి : ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రణయ్

నవతెలంగాణ- శంషాబాద్



పురుగుల అన్నం పెడుతున్నారని, తాగునీటి సౌకర్యం కల్పించడం లేదని ఆరోపిస్తూ శుక్రవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని పాలమాకుల కేజీబీవీ విద్యార్థినులు జాతీయ రహదారిపై బైటాయించి ధర్నా నిర్వహించారు. సీఎం రావాలి-న్యాయం చేయాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హాస్టల్‌లో నిర్వహణ లేక దారుణ పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ.. పురుగుల అన్నం పెడుతున్నారని, అడిగిన వారిపై కారంతో దాడి చేస్తున్నారని, టీచర్ల వేధింపులు తట్టుకోలేకపోతున్నామని తెలిపారు. మినరల్ వాటర్‌కు బదులు బోరు వాటర్ ఇస్తున్నారన్నారు. విషయం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా డీఈఓ సుషీందర్ రావు, శంషాబాద్ ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థులను సముదాయించే ప్రయత్నం చేశారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల్లో సమస్యలు తీరుస్తామని డీఈవో సుశింధర్ రావు హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవై ప్రణయ్

కేజీబీవోలో విద్యార్థుల ధర్నా గురించి తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు కేవై ప్రణయ్.. అక్కడికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో నెలకొన్న పరిస్థితుల గురించి విద్యార్థులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కస్తూర్బా బాలికల వసతి గృహంలో విద్యార్థినులు సమస్యలతో సతమతమవుతున్నారని, ఉద్దేశపూర్వకంగానే టీచర్లు విద్యార్థినులను వేధిస్తున్నారని అన్నారు. కేజీబీవీలో టీచర్ల మధ్య ఆధిపత్య పోరు సమస్యలకు కారణమని, పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో సమస్య ముదిరి విద్యార్థుల ప్రాణాల మీదికి వస్తున్నదన్నారు. కుల వివక్ష పాటిస్తున్నట్టు విద్యార్థినులు తమతో చెప్పారని, సమస్యలు అడిగితే బూతులు తిడుతున్నారని తెలిపారు. తల్లిదండ్రులను, కుటుంబాన్ని వదిలి టీచర్లే తల్లిదండ్రులుగా భావించి ఉంటున్న విద్యార్థినులను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సెప్టెంబర్ 1న సామ్రాజ్యవాద వ్యతిరేక నిరసనలు

- కార్మికులంతా జయప్రదం చేయండి : కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉక్రెయిన్, పాలస్తీనాపై అమెరికా సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న అమానుష దమనకాండను, యుద్ధోన్మాద వైఖరిని నిరసిస్తూ సెప్టెంబర్ ఒకటో తేదీన దేశవ్యాప్తంగా అంతర్జాతీయ యాక్షన్ డేను నిర్వహిస్తున్నట్టు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు ప్రకటించారు. శుక్రవారం ఈ మేరకు ఈ మేరకు ఆర్‌డీ చంద్రశేఖర్(ఐఎన్‌టీయూసీ), ఎన్.బాలరాజు(ఏఐటీయూసీ), పాలడుగు భాస్కర్(సీఐటీయూ), రెబ్బారామారావు(హెచ్ఎంఎస్), కె.సూర్యం(ఐఎఫ్‌టీయూ), ఎంకే.బోస్(టీఎన్‌టీయూసీ),ఎం.శ్రీనివాస్(ఐఎఫ్‌టీయూ), జి.రాంబాబు యాదవ (బీఆర్‌టీయూ), భరత్(ఏఐయూటీయూసీ), ఆర్.జనార్ధన్(ఐఎఫ్‌టీయూ) సంయుక్త ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లోని నారాయణగూడ చౌరస్తా లో ఒకటో తేదీ ఉదయం 11 గంటలకు నిరసన కార్యక్రమం ఉంటుందని తెలిపా రు. ఈ పిలుపులో కార్మికులు అత్యధికంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఇంటర్ ప్రవేశాల గడువు 7 వరకు పొడిగింపు

- ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల గడువును వచ్చేనెల ఏడో తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 31 వరకు ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు గడువున్నది. దాన్ని వచ్చేనెల ఏడో తేదీ వరకు పొడిగించామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలను పొందాలని విద్యార్థులకు సూచించారు. అనుబంధ గుర్తింపు ఉన్న జూనియర్ కాలేజీల్లోనే చేరాలని విద్యార్థులు, తల్లిదండ్రులను కోరారు. ఆ కాలేజీల జాబితాను acadt-gbie.cgg.gov.in , tgbie.cgg.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని వివరించారు. గుర్తింపు లేని కాలేజీల్లో చేరొద్దని సూచించారు. విద్యార్థులకు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో వచ్చేనెల ఏడో తేదీ వరకు ప్రవేశాలను కల్పించాలని కాలేజీల ప్రిన్సిపాళ్లను ఆమె ఆదేశించారు.

సీపీఎస్, యూపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

- 1న పెన్షన్ విద్రోహ దినం కార్యక్రమాలకు టాప్ర మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్), ఏకీకృత పెన్షన్ స్కీం (యూపీఎస్)ను రద్దు చేయాలనీ, పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్లు, రిటైర్డ్ పర్సన్ల సంఘం (టాప్ర) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సీపీఎస్‌లో కొన్ని మార్పులు చేసిందనీ, దానివల్ల ఉద్యోగులకు ఒరిగేదేమీ లేదని విమర్శించారు. వచ్చేనెల ఒకటిన తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో జరిగే పెన్షన్ విద్రోహ దినం కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే కార్యక్రమాల్లో తాము పాల్గొంటామనీ, హైదరాబాద్‌లోని అమర వీరుల స్థూపం వద్ద నిరసనలో భాగస్వామ్యం అవుతామని తెలిపారు.

హెచ్‌ఏఎల్‌లో బీఎంఎస్‌పై హెచ్‌ఏడబ్ల్యూ కూటమి గెలుపు

- అభినందనలు తెలిపిన సీఐటీయూ రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హెచ్‌ఏఎల్(హిందూస్తాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్)లో జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో బీఎంఎస్‌పై హెచ్‌ఏడబ్ల్యూయూ కూటమి 17 ఓట్ల మెజారిటీతో గెలవడం పట్ల సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ హర్షం వ్యక్తం చేశారు. కూటమి గెలుపునకు సహకరించిన కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్‌ఏఎల్‌లో మూడేండ్లుగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేయడం, సంస్థ పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు నిర్వహించడం వల్లనే హెచ్‌ఏడబ్ల్యూయూ కూటమి విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. హెచ్ఏఎల్ కార్మికుల్ని ఏకతాటిపై నడిపించి హక్కుల సాధన కోసం యాజమాన్యంపై ఐక్యపోరాటాలు నిర్వహించాలని హెచ్‌ఏడబ్ల్యూయూకు సూచించారు.

వ్యవసాయ మహిళా డిగ్రీలో చేరేందుకు గడువు పొడిగింపు

- బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి : సైదులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీ గురుకుల వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకునే గడువును వచ్చే నెల 15 వరకు పొడిగించి నట్టు మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సైదులు తెలి పారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 31వ తేదీ వరకు ఫైన్ ఆర్ట్స్‌లో చేరొచ్చని తెలిపారు. వ్యవసాయ కోర్సులో చేరే వారు ఇఏపిసెట్-2024 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థినీలు దరఖాస్తు చేసుకోవా లని సూచిం చారు. ఇంటర్ పూర్తి చేసిన వారు బీ.ఏ (యానిమే షన్ అండ్ వీఎఫ్ఎక్స్) కోర్సును మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో అందుబాటు లో ఉందని తెలిపా రు.మరిన్ని వివరాలకు 9032644463, 9063242329 ఫోన్ నెంబర్లలోలో సంప్రదించాలని ఆయన సూచించారు.

మందులపై కానరాని బ్రెయిలీ లిపి

దృష్టి లోప బాధితుల ఇబ్బందులు | చికిత్సలో సమస్యలు | ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి



న్యూఢిల్లీ : 2011లో సేకరించిన జనగణన ప్రకారం దేశంలో 2.28 కోట్ల మంది వివిధ వైకల్యాలతో బాధపడుతున్నారు. వీరిలో 77 లక్షల మందికి దృష్టి లోపం ఉంది. వీరికి అవసరమైన మందుల ఉత్పత్తిలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల భాగస్వామ్యం తగ్గిపోతోంది. ముఖ్యంగా మందులపై బ్రెయిలీ లిపితో కూడిన అక్షరాలు లేకపోవడంతో దృష్టి లోపం కలిగిన వారు వైద్య సాయం కోసం ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. అంధులు, దృష్టి లోపం కలిగిన వారు బ్రెయిలీ లిపి సాయంతో చదవగలుగుతారు. మందుల ప్యాకేజీలపై ఆ లిపిని ముద్రించకపోవడంతో సరైన వైద్య చికిత్స పొందడం వారికి సవాలుగా మారింది.

దేశంలోని ఔషధ ఉత్పత్తి సంస్థలు ఇప్పటికీ మందులపై బ్రెయిలీ లిపిని ముద్రించడం లేదు. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ బిఆర్. అలమేలు కనీసం 40 శాతం దృష్టి లోపంతో ఇబ్బంది పడుతున్నారు. మందులు కొనుగోలు చేయడం, వాటిని వాడడం తనకు చాలా సమస్యగా ఉన్నదని ఆమె వాపోయారు. మందులు కొనుగోలు చేసేటప్పుడు ఆమె దుకాణం యజమాని చెప్పిన సమాచారం పైనే ఆధారపడాల్సి వస్తోంది. మందుల ప్యాకేజీపై బ్రెయిలీ లిపి లేకపోవడమే దీనికి కారణం.

ప్రత్యామ్నాయం లేదు

ప్రభుత్వ ఉద్యోగి అయిన ధీరూ రాజోసర 2008లో పూర్తిగా కంటి చూపు కోల్పోయారు. ఇతర విషయాలలో చురుకుగానే ఉంటున్నప్పటికీ తన మందుల కోసం ఆయన ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. అమెరికా, యూరప్‌లో మందులపై బ్రెయిలీ లిపి ఉంటుందని, ఇక్కడ అది లేదని ఆయన వాపోయారు. బ్రెయిలీ ప్యాకేజింగ్‌పై ఔషధ కంపెనీలు పెద్దగా దృష్టి సారించడం లేదని ఫిర్యాదు చేశారు. అత్యవసర సందర్భాలలో సాయం చేసేందుకు పక్కన ఎవరూ ఉండరు. అలాంటప్పుడు సమస్యలు మరీ ఎక్కువగా ఉంటాయి.కోవిడ్ సమయంలో విధించిన లాక్‌డౌన్ కారణంగా చాలా ఇబ్బందులు పడ్డామని అలమేలు గుర్తు చేసుకున్నారు. మందులపై బ్రెయిలీ ప్యాకేజింగ్ అవసరమని అంటూ దృష్టి దోషంతో బాధపడే వారిలో అనేక మంది ఒంటరిగానే ఉంటారని, సమయానికి మందులు ఇస్తూ సాయం చేసే వారు ఎవరూ ఉండరని ఆవేదనతో చెప్పారు. ఎవరికైనా ఫోన్ చేద్దామని అనుకున్నా అది కూడా కష్టంగానే ఉంటుందని అన్నారు. బ్రెయిలీ లిపికి ప్రత్యామ్నాయమే లేదని ఆమె స్పష్టం చేశారు.

టెక్నాలజీ సాయంతో...

జర్నలిజంలో మాస్టర్స్ డిగ్రీ చేస్తున్న జుహైబ్ ఖాన్ పూర్తి అంధుడు. మందుల ప్యాకేజీలపై బ్రెయిలీ లిపి లేకపోవడంతో టెక్నాలజీని ఆశ్రయించాల్సి వస్తోందని ఆయన తెలిపారు. టెక్ ఫ్రీడమ్, టెక్ బ్యాక్ వంటి యాప్స్‌ను ఉపయోగిస్తూ మందుల పేర్లతో పాటు వాటి తయారీలో వాడిన రసాయనాలను గురించి కూడా తెలుసుకుం టున్నారు. అయితే బ్రెయిలీ ప్యాకేజింగ్‌కు కృత్రిమ మేథ ప్రత్యామ్నాయం కాబోదని, మందును స్కానింగ్ చేసి ఆడియో నోట్‌ను వినడానికి ఎక్కువ సమయం పడుతుందని ఆయన చెప్పారు. పైగా టెక్నాలజీని ఉపయోగించడం అందరికీ తెలియదని, యాప్‌ల వాడకంలో ఇబ్బంది పడతాయని తెలిపారు. సిరప్ బాటిల్స్ అన్నీ ఒకేలా ఉంటాయని, అలాంటప్పుడు షాపులోని సిబ్బందిపై ఆధారపడాల్సి వస్తుందని ఓ హాస్టల్‌లో ఉంటున్న యువకుడు చెప్పాడు.

ఎగుమతులకే పరిమితం

కొన్ని కంపెనీలు విదేశాలకు మందులు ఎగుమతి చేసేటప్పుడు ప్యాకేజీలపై విధిగా బ్రెయిలీ లిపిని ముద్రిస్తున్నాయి. ఉదాహరణకు యామిర్ ప్యాకేజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ మందులను ప్యాక్ చేస్తుంది. యూరప్‌లో మందులపై తప్పనిసరిగా బ్రెయిలీ లిపిని ముద్రించాలి కాబట్టి అక్కడికి పంపే మందులపై ఆ లిపిని ముద్రిస్తుంది. కానీ మన దేశంలో అలాంటి నిబంధనలేవీ లేవు. ముందుగా బ్రెయిలీ ముద్రణాలయాలను నెలకొల్పి, ఆ తర్వాత వాటిని ఔషధ కంపెనీలకు సరఫరా చేయా లని కేంద్రం భావించింది. అయితే ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. 1940వ సంవత్సరపు డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ చట్టం దిగుమతులు, తయారీ, పంపిణీ, విక్రయానికి సంబంధించి నిబంధనలు నిర్దేశించింది. కానీ బ్రెయిలీ లిపి ముద్రణను తప్పనిసరి చేయలేదు.

న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చినా...

మందులపై బ్రెయిలీ లిపి ముద్రణకు సంబంధించి సుప్రీంకోర్టు సహా పలు న్యాయస్థానాలు స్పష్టమైన తీర్పులు ఇచ్చినప్పటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ కూడా ప్రభుత్వం తరఫున న్యాయస్థానానికి తన స్పందనను తెలియజేయలేదు. సీసాలు సహా మందుల ప్యాకేజీలపై విధిగా బ్రెయిలీ లిపిని ముద్రించేలా సంబంధిత మంత్రిత్వ శాఖలు చర్యలు చేపట్టాలని ఢిల్లీ హైకోర్టు న్యాయవాది పీయుష్ కుమార్ కోరారు. ఔషధ తయారీ కంపెనీల్లో తరచుగా తనిఖీలు చేయాలని, నిబంధనలు పాటించని సంస్థలపై జరిమానాలు విధించాలని సూచించారు.



హైడ్రాను ఆహ్వానిస్తున్నాం

భావితరాల కోసం చెరువులు, నాలాల పరిరక్షణ అవసరమే

- ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇండ్లు కూల్చొద్దు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైడ్రా పేరుతో చెరువులు, నాలాలలో ఉన్న నిర్మాణాలను తొలగిస్తున్న సందర్భంగా పేదలు, మధ్యతరగతి ప్రజానీకం దీనికి సమిధలు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చెరువులు, నాలాలు, జలవనరుల సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా వ్యవస్థ ఆహ్వానించదగ్గదేనని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. అయినప్పటికీ చెరువులు, నాలాల పక్కన ఏండ్లుగా నివసిస్తున్న పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా వారి ఇండ్లను కూల్చొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 12 ఏండ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 78 మంది వికలాంగులకు ఇండ్లపట్టాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ ఇండ్లను ఆక్రమణల పేరుతో గురువారం తెల్లవారుజామున బుల్డోజర్లతో కూల్చివేశారని తెలిపారు. ఏండ్ల తరబడి అక్కడే నివాసముంటూ కాయకష్టం చేసుకుంటూ బతుకుతున్న పేదలు బజారున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. వారిని తక్షణం ఆదుకోవాలని కోరారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లోని హస్మత్‌పేట్, అల్వాల్ తదితర బస్తీల్లో కూడా పేదల ఇండ్లను నేలమట్టం చేశారని పేర్కొన్నారు. చెరువులు, నాలాల పక్కన ఆక్రమణలు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల పేరుతో ప్రత్యామ్నాయం చూపకుండా పేదలు, మధ్యతరగతి వారిని బజారుపాలు చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు.

పర్యాటకంలో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో నూతన విధానాలను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి టూరిజంలో ముందంజలో ఉన్న ఇతర రాష్ట్రాల విధానాలపై అధ్యయనం చేయాలని ఆయన వారికి సూచించారు. ఆయా పాలసీల్లో మెరుగైనవి, మన రాష్ట్రానికి అనువుగా ఉన్న వాటిని అనుసరించాలని కోరారు. స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ)పై సమీక్షలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్... టూరిజం అభివృద్ధి ప్రాజెక్టులపై అధికారులతో సమావేశమయ్యారు.

టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హెల్త్ టూరిజం అభివృద్ధి కోసం విడివిడిగా పాలసీలను రూపొందించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. తెలంగాణలో ఉన్న ప్రాచీన ఆలయాలు, చారిత్రక స్థలాలతోపాటు అటవీ ప్రాంతాలు, వైద్య సదుపాయాలన్నింటినీ పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. రవాణాతోపాటు వసతి, పర్యాటకులకు అవసరమైన అన్ని సదుపాయలు ఉండేలా కొత్త టూరిజం ప్యాకేజీలను రూపొందించాలని సూచించారు. కవ్వాల్, ఆమ్రాబాద్ అటవీ ప్రాంతాల్లో సఫారీలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. రాత్రి విడిది చేసేందుకు వీలుగా కొన్ని చోట్ల కాటేజీలను నిర్మించాలని చెప్పారు. పర్యాటకానికి అనువైన ప్రాంతాలన్నింటినీ గుర్తించటంతోపాటు వాటిలో ఏయే ప్రాంతాలను ముందుగా అభివృద్ధి చేయాలనే విషయమై టూరిజం, దేవాదాయ, అటవీ శాఖ అధికారులు చర్చించి, నిర్ణయించాలని ఆదేశించారు.

కేవలం మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి, హరిత హోటళ్లు, వసతి గృహాలను నిర్మించి వదిలేస్తే సరిపోదని సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. వాటి నిర్వహణను నిరంతరం పర్యవేక్షించి, మెరుగ్గా ఉండేట్టు చూడాలని అన్నారు. అప్పుడే అవి పర్యాటకులను ఆకర్షిస్తాయని తెలిపారు. అందుకే కొత్తగా చేపట్టబోయే ప్రాజెక్టులన్నింటినీ ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంలో చేపట్టాలని సూచించారు. తద్వారా ఉద్యోగాల కల్పనతోపాటు రాష్ట్రాభివృద్ధికి ఉపయోగపడేలా టూరిజాన్ని అభివృద్ధి పరచాలని కోరారు.

హైదరాబాద్ బయట దాదాపు వెయ్యెకరాల విస్తీర్ణంలో కొత్త జూ పార్క్‌ను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి జంతువులు, పక్షులను తీసుకొచ్చి కొత్త జూ పార్క్‌లో ఉంచాలని సీఎం సూచించారు. దీంతోపాటు అర్బన్ ఫారెస్ట్‌ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. జామ్‌నగర్‌లో అనంత్ అంబానీ మూడువేల ఎకరాల్లో వనతార వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని నెలకొల్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. అలా ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు, సంస్థలను కూడా ఆహ్వానించాలని ముఖ్యమంత్రి సూచించారు.

అనంతగిరి ప్రాంతంలో అద్భుతమైన ప్రకృతి అటవీ సంపద ఉందని సీఎం తెలిపారు. అక్కడున్న 200 ఎకరాల ప్రభుత్వ భూములను హెల్త్ టూరిజం అభివృద్ధికి వినియోగించాలని ఆయన నిర్ణయించారు. బెంగళూరులోని జిందాల్ నేచర్ క్యూర్ ఇన్‌స్టిట్యూట్ తరహాలో అనంతగిరిలో నేచర్ వెల్‌నెస్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ సెంటర్ ఏర్పాటుకు జిందాల్ ప్రతినిధులు ఆసక్తిగా ఉంటే సంప్రదింపులు జరపాలని అన్నారు. ప్రకృతి వైద్య రంగంలో పేరొందిన ప్రముఖ సంస్థలను ఆహ్వానించాలని అధికారులకు సూచించారు.

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డును ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. అచ్చంగా టీటీడీ అనుసరించిన తరహాలోనే బోర్డుకు స్వయం ప్రతిపత్తి, విధి విధానాలు ఉండేలా అవసరమైతే చట్ట సవరణ చేయాలని ఆదేశించారు. యాదగిరిగుట్ట ఆలయ రాజ గోపురానికి బంగారు తాపడం పనులను కూడా ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. ఆ ఆలయ అభివృద్ధి పనులు చాలావరకు అర్ధంతరంగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. అవి అలా ఆగిపోవడానికి వీల్లేదన్నారు. ఇప్పటివరకు ఏయే పనులు జరిగాయి, ఇంకా ఏయే పనులు అసంపూర్తిగా ఉన్నాయనే వివరాలతో వారం రోజుల్లో సమగ్ర నివేదికను సమర్పించాలంటూ ఆదేశించారు. అక్కడికి వచ్చే భక్తుల సౌకర్యాలు, విడిది చేసేందుకు కాటేజీలు, వాటి నిర్మాణాలకు దాతలు, కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు.

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అద్భుతంగా యాదగిరిగుట్టను తీర్చిదిద్దాలని చెప్పారు. ప్రస్తుతం కీసర గుట్టపై ఉన్న రామలింగేశ్వర ఆలయాన్ని అద్భుతంగా పునర్ నిర్మించేందుకు ముఖ్యమంత్రి నిర్ణయించారు. ములుగు జిల్లాలోని రామప్ప ఆలయానికి ప్రతిరూపంగా.. అచ్చం అదే నమూనాతో కీసరగుట్ట ఆలయాన్ని నిర్మించాలని చెప్పారు. అక్కడ ఉపయోగించిన శ్యాండ్ బాక్స్ టెక్నాలజీ జోలికి పోవద్దనీ, ఇప్పుడున్న అధునాతన టెక్నాలజీతో రామప్ప ఆలయ ఆకృతిలో యథాతథంగా కీసర ఆలయ పునర్ నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు.

హైదరాబాద్ ఫోర్త్ సిటీలో వెయ్యెకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న హెల్త్ సిటీలో హెల్త్ టూరిజాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇక్కడ తమ తమ సెంటర్లను నెలకొల్పేందుకు ముందుకొచ్చే సంస్థలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు ఇచ్చేలా కొత్త పాలసీ తయారు చేయాలని చెప్పారు. వివిధ దేశాల నుంచి వచ్చే వారికి వైద్య సేవలందించే 'వన్ స్టాప్ సొల్యూషన్ ప్యాకేజీ'లను రూపొందించాలని చెప్పారు. ఆన్‌లైన్‌లోనే అన్ని సేవల వివరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎయిర్ పోర్ట్ నుంచి నేరుగా హాస్పిటల్‌కు వెళ్లి, డాక్టర్ల అపాయింట్‌మెంట్, ట్రీట్మెంట్ తీసుకునేలా సదుపాయాలన్నీ ఉండాలని సూచించారు. దేశంలోనే అందరి దృష్టిని ఆకర్షించేలా హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని దిశా నిర్దేశం చేశారు. సమీక్షా సమావేశంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, ఆ శాఖ కమిషనర్ హనుమంతరావు, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిష్టియానా, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియల్‌తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారతీయుల్లో సూక్ష్మపోషకాల లోపం

స్త్రీ, పురుషులు.. ఇద్దరిలోనూ ఇదే పరిస్థితి

- మహిళలు అయొడిన్‌ను.. మగవారు జింక్, మెగ్నీషియంలను సరిపడా తీసుకోవటంలేదు
- లాన్సెట్ అధ్యయనం వెల్లడి



న్యూఢిల్లీ : భారతీయుల్లో సూక్ష్మపోషకాల లోపంపై లాన్సెట్ అధ్యయనం హెచ్చరిస్తున్నది. భారత్‌లోని స్త్రీ, పురుషుల్లో అన్ని వయసులవారు ఆరోగ్యానికి ముఖ్యమైన ఐరన్, కాల్షియం, ఫొలేట్ వంటి సూక్ష్మపోషకాలను సరిపడా తీసుకోవటంలేదని అంచనా వేసింది. 'ది లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జర్నల్‌'లో ఈ అధ్యయనాన్ని ప్రచురించింది.

ఈ అధ్యయనం ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 70 శాతం(500 కోట్ల మందికి పైగా) మంది ప్రజలు సరిపడా అయొడిన్, విటమిన్ ఈ, కాల్షియంలను తీసుకోవటంలేదు. ముఖ్యంగా, ఒక దేశంలో, ఒకే వయసువారిలో మహిళలు అయొడిన్, విటమిన్ బీ12, ఐరన్‌ను మగవారితో పోలిస్తే తగినంతగా తీసుకోవటంలేదని పరిశోధకులు గుర్తించారు. ఇక పురుషులు.. మహిళలతో పోలిస్తే మెగ్నీషియం, విటమిన్ బీ6, జింక్, విటమిన్ సీ లను తగిన మొత్తంలో తీసుకోవటం లేదు. భారత్‌లోనూ చాలా మంది మహిళలు పురుషులతో పోలిస్తే తగినంత మొత్తంలో అయోడిన్‌ను పొందటంలేదు. ఇక మహిళలతో పోలిస్తే పురుషులు సరిపోని మొత్తంలో జింక్, మెగ్నీషియంలను తీసుకుంటున్నారు. 10 నుంచి 30 ఏండ్ల వయసు మధ్య ఉన్న పురుషులు, మహిళల్లో చాలా మంది తక్కువ స్థాయిలో కాల్షియం తీసుకుంటున్న అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా, దక్షిణాసియా, ఈశాన్య ఆసియా, ఉప సహారా ఆఫ్రికాలో ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని పరిశోధన బృందం తెలిపింది.

పాక్‌తో చర్చల శకం ముగిసినట్లే !

విదేశాంగ మంత్రి జై శంకర్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : పాకిస్తాన్‌తో చర్చలు జరిపే శకం ఇక ముగిసి పోయిందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వ్యాఖ్యానించారు. రాయబారి రాజీవ్ సిక్రి రాసిన కొత్త పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పాక్‌తో భారత్ సంబంధాలపై ఆయన వివరంగా మాట్లాడారు. "పాక్‌తో నిరంతరంగా చర్చలు జరిపే శకం ముగిసినట్లేనని నేను భావిస్తున్నా. చర్యల వల్ల పర్యవసానాలు వుంటాయి. జమ్మూ కాశ్మీర్‌కు సంబంధించినంతవరకు, చేయాల్సింది 370వ అధికరణ చేసిందనుకుంటున్నాను. ఇక పాకిస్తాన్‌తో ఎటువంటి సంబంధాలు పెట్టుకోవాలని మనం ఆలోచిస్తాం. ప్రస్తుతమున్న సంబంధాలతో భారత్ సంతృప్తిగా వుండి వుంటుందని రాజీవ్ సిక్రి తన పుస్తకంలో పేర్కొన్నారు. అది నిజమో కాదో...మేం నిష్క్రియాపరులం కాదు, సానుకూల దిశలో లేదా ప్రతికూల దిశలో ఏ సంఘటనలు చోటు చేసుకున్నా కచ్చితంగా మేం స్పందిస్తాం." అని జై శంకర్ పేర్కొన్నారు. ఆఫ్ఘనిస్తాన్, భారత్ ప్రజల మధ్య పటిష్టమైన సంబంధాలున్నాయని చెప్పారు. ఆఫ్ఘనిస్తాన్ గురించి ఆందోళనలు వున్నా, ప్రజల మధ్య సంబంధాలు బలంగా వున్నాయి. ఆఫ్ఘన్ సమాజంలో భారత్ పట్ల సుహృద్భావన వుంది. అమెరికా బలగాలు వున్న ఆఫ్ఘనిస్తాన్‌కు, అమెరికా ఉనికే లేని ఆఫ్ఘనిస్తాన్‌కు చాలా తేడా వుందని చెప్పారు. బంగ్లాదేశ్‌తో పరస్పర ప్రయోజనాలను కనుగొనాల్సి వుందని అన్నారు. బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి భారత్‌తో సంబంధాలు ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. అయితే అది సహజమేనని అన్నారు. అక్కడ జరుగుతున్న రాజకీయ మార్పులను మనం గుర్తించాల్సి వుందని, పరస్పర ప్రయోజనాలను చూసుకోవాల్సి వుందని అన్నారు.

సంకట స్థితిలో కేంద్రం

ఎస్సీ-ఎస్టీ వర్గీకరణ విషయంలో అనిశ్చితి

- సుప్రీంతీర్పుపై ఎటూ తేల్చుకోలేక సతమతం
- రాష్ట్రాలకు అధికారాన్ని కట్టబెట్టే విషయమై స్పందించని బీజేపీ
- కాషాయపార్టీలోనూ అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు
- ఎన్డీఏ కూటమిలోనూ అదే తీరు.. ఒక్కోపార్టీది ఒక్కో వైఖరి
- టీడీపీ, జేడీ(యూ) సై.. ఎల్జేపీ(పాశ్వాన్) నై
- సర్వోన్నత న్యాయస్థానం తీర్పును వ్యతిరేకిస్తున్న పలు దళిత సంఘాలు
- ఇటీవలే దేశవ్యాప్త ఆందోళనలు
- తీర్పును మోడీ సర్కారు వ్యతిరేకించాలంటూ డిమాండ్



న్యూఢిల్లీ : ఎస్సీ-ఎస్టీ ఉప వర్గీకరణ అధికారాన్ని రాష్ట్రాలకు కట్టబెడుతూ ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పు కేంద్రాన్ని, బీజేపీని సందిగ్ధంలో పడేసింది. ఈ తీర్పును సమర్థించాలా లేక వ్యతిరేకించాలా అన్న స్పష్టత లేని అయోమయ స్థితిలో ఇప్పుడు కాషాయ నేతృత్వంలోని సర్కారు ఉన్నది. కేంద్రంతో పాటు పలు రాష్ట్రాల్లో బీజేపీ, దాని నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. అయితే, ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణ విషయంలో రాష్ట్రాలకు అధికారాన్ని కట్టబెట్టే విషయంలో ఆ పార్టీ ఇప్పటి వరకూ మాట్లాడలేదు. దీంతో ఈ విషయంలో తొందరపడొద్దనీ, ఆచితూచి వ్యవహరించాలనే విధానంలో బీజేపీ ఉన్నట్టు కనిపిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై ప్రభుత్వం సంబంధిత వ్యక్తులు, సంస్థలతో మాట్లాడుతున్నదనీ, తగిన సమయంలో దీనిపై స్పందిస్తుందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, దళిత నాయకుడు గురు ప్రకాశ్ పాశ్వాన్ అన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు చెందిన క్రిమీలేయర్‌ను గుర్తించి మినహాయించేందుకు రాష్ట్రాలు ఒక విధానాన్ని రూపొందించాలని సుప్రీంకోర్టు తన తీర్పులో చెప్పింది. అయితే, ఎన్డీఏలోని జేడీ(యూ), టీడీపీ వంటి పలు కీలక మిత్రపక్షాల నుంచి వచ్చిన ఒత్తిడితో క్రిమీలేయర్ విషయంలో కేంద్రం వెనకడుగు వేసింది. క్రిమీలేయర్‌ను అమలు చేయబోమని స్పష్టతనిచ్చింది.

ఎన్డీఏలోనే లేని ఏకాభిప్రాయం

ఎస్సీ, ఎస్టీల ఉపవర్గీకరణ విషయంలో రాష్ట్రాలకు అధికారాన్ని కట్టబెట్టే విషయంపై కేంద్రం ఇప్పటి వరకూ తన వైఖరిని తెలియజేయలేదు. అయితే, ఈ విషయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమిలోని పార్టీలు మాత్రం భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పును టీడీపీ, జేడీ(యూ)లు సమర్థించగా.. ఎల్జేపీ(పాశ్వాన్) పార్టీ మాత్రం దానిని వ్యతిరేకిస్తున్నది. ఇటు మోడీ 2.ఓ సర్కారు కూడా ఎస్సీలలో అసమానతల విషయమై క్యాబినెట్ సెక్రెటరీ నేతృత్వంలో ఒక ఉన్నతస్థాయి కమిటీని ఈ ఏడాది జనవరిలో ఏర్పాటు చేసింది. అయితే, తెలంగాణతో పాటు ఏపీలో గణనీయమైన సంఖ్యలో ఉన్న మాదిగ ఓటు బ్యాంకును ప్రసన్నం చేసుకోవటానికే బీజేపీ ఈ ఎత్తుగడను వేసిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఇటు బీజేపీలోనే ఏకాభిప్రాయం లేదనీ, పలువురు నేతలు భిన్నాభిప్రాయాలు వెల్లడిస్తున్నారని విశ్వసనీయంగా తెలుస్తున్నది.

రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభావం

హర్యానా, జమ్మూకాశ్మీర్‌లలో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాదిలోనే మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం జరగాల్సి ఉన్నాయి. హర్యానా రాష్ట్ర జనాభాలో 20 శాతం దళిత జనాభానే ఉన్నది. ఇటు మహారాష్ట్ర, జార్ఖండ్‌లలోనూ గణనీయమైన సంఖ్యలో దళితులు, ఆదివాసీలు ఉన్నారు. దీంతో సుప్రీంతీర్పుపై ఎటూ తేల్చుకోలేని సంకట స్థితి బీజేపీకి నెలకొన్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

దళిత సంఘాల ఆగ్రహం

సుప్రీంకోర్టు తీర్పుపై దేశవ్యాప్తంగా పలు దళిత సంఘాలు ఆగ్రహంతో ఉన్నాయి. తీర్పును పున:పరిశీలించాలంటూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాలనే ఆలోచనలు సదరు సంఘాలు చేస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పును కేంద్రం తప్పక తిరస్కరించాలనీ జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మెన్ డిమాండ్ అశోక్ భారతి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని అన్నారు. "హర్యానా, ఇతర రాష్ట్రాల్లో బీజేపీకి ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తగులుతాయి. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)కు మెమోరాండంను అందించాం. త్వరలోనే మేము సుప్రీంకోర్టును ఆశ్రయించి రివ్యూ పిటిషన్ వేస్తాం" అని ఆయన అన్నారు. కాగా, ఇటీవల దళిత, ఆదివాసీ సంస్థలు పిలుపునిచ్చిన దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్, ఆర్జేడీ, బీఎస్పీ, ఎన్డీఏ మిత్రపక్షం ఎజేపీ(ఆర్‌వీ) వంటి ప్రతిపక్షాలు, పార్టీలు మద్దతునిచ్చాయి.

నవతెలంగాణ

ఎంత ఉపయోగించినా తరగని, అరగని
ఉత్పత్తి సాధనం విజ్ఞానం ఒక్కటే - జె.ఎం.క్లార్క్

శనివారం 31 ఆగస్టు 2024
www.navatelangana.com

సంపాదకీయం

కేరళ ముందడుగు



మలయాళ చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపులపై జస్టిస్ హేమా కమిటీ ఇచ్చిన నివేదిక నేపథ్యంలో- సినిమా రంగంలోని మహిళలకు గౌరవమూ, రక్షణ చేకూర్చే చర్యలపై మరొకసారి చర్చ జరుగుతోంది. అవకాశాల కోసం పోటీపడే ఈ రంగంలో ఆ అభిలాషనే ఆసరాగా తీసుకొని కాస్టింగ్ కౌచ్‌కు పాల్పడుతున్న సంఘటనలపై చాలాకాలంగా నిరసన వ్యక్తమవుతోంది. 2006లో బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్.. ఇలా అన్ని చోట్లా పెద్దఎత్తున మీటూ ఉద్యమం జరిగింది. తమకు ఎదురైన లైంగిక వేధింపులపై ఎందరో బాధిత మహిళలు గొంతెత్తారు. ఆ తరువాత, అంతర్గత ఫిర్యాదుల కమిటీల ఏర్పాటు వంటివి తప్ప దాదాపుగా ఏ పరిశ్రమలోనూ విచారణ జరప లేదు, ఎలాంటి నిర్దిష్ట చర్యలూ చేపట్టలేదు.

కేరళలో 2017 ఫిబ్రవరిలో భావన అనే నటిపై కారులోనే కొందరు లైంగిక దాడికి ప్రయత్నించటం, ఆమె తప్పించుకొని రెండోరోజు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిన నేపథ్యంలో- చిత్ర పరిశ్రమలో జరుగుతున్న లైంగిక వేధింపులపై పలువురు స్పందించారు. విమెన్ వింగ్ ఇన్ సినిమా కలెక్టివ్ (డబ్ల్యుసిసి) ఏర్పడి, ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు వినతిపత్రం ఇచ్చారు. వామపక్ష ప్రభుత్వం వెంటనే స్పందించి, హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ కె.హేమ నేతృత్వాన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ముందుకు నేరుగా వచ్చి మాట్లాడటానికి కొంతమంది వెనకాడుతున్నారని తెలిశాక- ఫిర్యాదుదారుల వివరాలు, విషయాలూ ఎట్టి పరిస్థితుల్లోనూ బయటపెట్టబోమని, ఏ రూపంలోనైనా తమకు వాంగ్మూలాలు అందజేయవచ్చునని జస్టిస్ హేమా కమిటీ ప్రకటించింది. ఎక్కువమందిని కలవటానికి, వారి ఫిర్యాదులు నమోదు చేయటానికి ప్రాధాన్యం ఇచ్చింది. రెండేళ్ల పాటు విచారణ జరిపి, 2019 డిసెంబరు 31న రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఆ నివేదికను బయటపెట్టమని కొందరు డిమాండు చేయగా- అంశాల్లోని సున్నితత్వం, ఫిర్యాదుదారుల గోప్యత తదితర కారణాల వల్ల నివేదిక బహిరంగ వెల్లడికి జస్టిస్ హేమ కమిటీ ఒప్పుకోలేదు. సున్నిత అంశాలను మినహాయించి, మిగతా అంశాలను వెల్లడించాల్సిందిగా ఇటీవల హైకోర్టు ఆదేశించటంతో ఆగస్టు 17న ఈ నివేదిక బహిర్గతమైంది.

జస్టిస్ హేమా కమిటీ ఈ నివేదికలో అనేక అంశాలను ప్రస్తావించింది. మలయాళ సినిమా పరిశ్రమలో కొంతమంది మగ దర్శకుల, నటుల పెత్తనం సాగుతోందనిబీ పశ్నించేవారిపై అనధికార నిషేధం కొనసాగుతోందనిబీ మహిళా నటులపై లైంగిక వేధింపులు సాగుతున్నాయనిబీ సర్దుకుపోవడం, రాజీపడడం అనేది ఒక సూత్రంగా అమలు చేయబడుతోందని వివరించింది. జూనియర్ నటుల పట్ల తీవ్రమైన వివక్ష ఉందని, పని ప్రదేశాల్లో బట్టలు మార్చుకోవటానికి కానీ, కాలకృత్యాలు తీర్చుకోవటానికి కానీ తగిన ఏర్పాట్లు ఉండడం లేదని పేర్కొంది.

చిన్న నటులతో రాతపూర్వక ఒప్పందాలు ఉండడం లేదని, ఎక్కువ పని చేయించుకొని తక్కువ వేతనాలు ఇస్తున్నారని తెలిపింది. ఈ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించింది. నాలుగేళ్ల క్రితం నివేదిక తనకు అందిన నాటి నుంచి సినీ పరిశ్రమలో మహిళలకు రక్షణ చర్యలను ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చేపట్టింది. నిర్మాతల మండలితో, దర్శకులతో సంప్రదింపులు జరిపి, షూటింగ్ ప్రదేశాల్లో మహిళలకు తగు సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకొంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టడమే ప్రధాన ఉద్దేశంగా ఉన్న కొన్ని శక్తులు ఈ నివేదికలోని సున్నితాంశాలపై రచ్చ చేస్తున్నాయి. పరిస్థితిని చక్కదిద్దటానికి, మహిళల ఆత్మగౌరవం కాపాడ్డానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే కమిటీ వేసి విచారణ జరిపించామని ముఖ్యమంత్రి పినరన్ విజయన్ మరోసారి స్పష్టం చేశారు.

కేరళ సమాజంలో నెలకొని ఉన్న చైతన్యపూరిత వాతావరణం సినీ పరిశ్రమలోనూ ప్రతిబింబిస్తూ ఉంటుంది. హక్కుల పట్ల, ఆత్మగౌరవం పట్ల తగినంత ఎరుకను అక్కడి నటీనటులు ప్రదర్శిస్తారు. మీటూ ఉద్యమం జరిగినా దేశవ్యాప్తంగా ఎక్కడా ఏ ప్రభుత్వమూ ఎలాంటి కమిటీలను వేసి, విచారణ జరపలేదు. కేరళలో మాత్రమే అలాంటి ప్రయత్నం జరిగింది. జస్టిస్ హేమా కమిటీ నివేదికలో పేర్కొన్న పరిస్థితులు అన్ని సినీ పరిశ్రమల్లోనూ నెలకొని ఉన్నాయి. నటీనటులకు సమాన గౌరవం, జూనియర్ నటులకు తగు సదుపాయాల కల్పన, పారితోషికాల్లో తీవ్ర వ్యత్యాసాల నివారణ వంటివి ప్రయత్నపూర్వకంగా అన్ని సినీ పరిశ్రమల్లోనూ కల్పించాల్సి ఉంది. కేరళ వలె ప్రభుత్వాలు అన్నిచోట్లా విచారణ, అధ్యయనం జరిపించి, తగు చర్యలు తీసుకోవాలి.

> **కేరళ సమాజంలో నెలకొని ఉన్న చైతన్యపూరిత వాతావరణం సినీ పరిశ్రమలోనూ ప్రతిబింబిస్తూ ఉంటుంది. హక్కుల పట్ల, ఆత్మగౌరవం పట్ల తగినంత ఎరుకను అక్కడి నటీనటులు ప్రదర్శిస్తారు. మీటూ ఉద్యమం జరిగినా దేశవ్యాప్తంగా ఎక్కడా ఏ ప్రభుత్వమూ ఎలాంటి కమిటీలను వేసి, విచారణ జరపలేదు. కేరళలో మాత్రమే అలాంటి ప్రయత్నం జరిగింది. జస్టిస్ హేమా కమిటీ నివేదికలో పేర్కొన్న పరిస్థితులు అన్ని సినీ పరిశ్రమల్లోనూ నెలకొని ఉన్నాయి. నటీనటులకు సమాన గౌరవం, జూనియర్ నటులకు తగు సదుపాయాల కల్పన, పారితోషికాల్లో తీవ్ర వ్యత్యాసాల నివారణ వంటివి ప్రయత్నపూర్వకంగా అన్ని సినీ పరిశ్రమల్లోనూ కల్పించాల్సి ఉంది.**

సాహిత్యా'రుద్రుడు'

భాగవతుల సదాశివ శంకర శాస్త్రి అంటే చాలామందికి తెలియదు. ఆరుద్ర అనగానే 'ఆహా' అనుకుంటారు. అవును. వారే వీరు. ఆ (రుద్ర) మూర్తి 'ముద్ర' తెలుగు సాహిత్యంలో తిరుగులేనిది, చెరపలేనిదీనూ! ఆరుద్ర ఒక సంచలనం. ఆయన కవి, గేయకర్త, నాటకకర్త, నటుడు, సినిమా రచయిత, నవలాకారుడు, కథకుడు, అనువాదకుడు, పరిశోధకుడు. ఇలా ఆయన సాహిత్య కృషి ఒక చిత్ర వర్ణ పట్టకం.

'త్వమేవాహమ్' నిజాం నిరంకుశ పరిపాలనపై ధిక్కార స్వరానికి నగారా! అందులో ఆరుద్ర వాడిన ప్రతీకలు, పదబంధాలు, నూతన అభివ్యక్తి... కవిత్వ ప్రియుల్ని విశేషంగా ఆకర్షించాయి. ఆ కవిత్వానికి వ్యాఖ్యనాలూ, భాష్యాలు చాలానే వచ్చినై. ఆరుద్ర శ్రీమతి కె రామలక్ష్మిగారు 1999లో త్వమేవాహమ్ స్వర్ణోత్సవ ముద్రణకు ముందు మాట రాస్తూ 'ఈనాటికీ నేను 'త్వమేవాహమ్' ఆవాహన చదువుతుంటే ఆ వాక్యాల్లోని తాత్వికత - చెప్పిన విధానంలోని తూగు, లయ, ఊపు, ఉద్వేగం - బుర్రని



గిరికీలు కొట్టిస్తాయి. కాలం గురించి అందులో వచ్చే దంతా కవిత్వంలో ఒక 'మాష్టర్ పీస్' దాన్ని గురించి చెప్పి చెప్పి, అంటారు.

"కాలం ఒక తేలని ప్రశ్న, కాలం ఒక తీరని తృష్ణ, విరామం లేదు, విజ్ఞానానికి సందేహం తీరదు వేదాంతికి..."అని.

సినారె విశ్లేషణలో ఒక్క మాటంటారు "ఇలియట్ ప్రభావంతో ప్రతీకలను వాడుట నేర్చుకొని, స్వోపజ్ఞతతో ఛందస్సు చేత చాకిరీ చేయించుకొని తెలుగు కవితలో అపూర్వ సంవిధానమునకు బాటలు తీసిన అతి నవ్యుడు ఆరుద్ర" అని. 'త్వమేవాహమ్' మన మేధో పరిధిని విస్తృతం చేసే కవిత్వ వృత్తలేఖిని!

ఆరుద్ర కథలు వ్రాయటం ఎలాగో చెప్పాడు. చదరంగం ఆడటమెలాగో నేర్పాడు. డిటెక్టివ్ నవల ఎలా ఉండాలో రాసి చూపాడు. పదబంధాలు కూర్చాడు. తెలుగు సాహిత్యంలో ఎవ్వరూ ఊహించలేని సాహం - సమగ్ర ఆంధ్ర సాహిత్యం. సంపుటాల ఆరుద్ర దీక్షకే గాదు, నిబద్ధతకీ, దక్షతకీ కూడా శాశ్వత నిదర్శనం.

సినీ పాటల రచయితగా ఆరుద్ర పోకడ దానికదే సాటి. ఆ మెరుపూ ఝళిపింపూ దేనికదే సాటి. 'గాంధీ పుట్టిన దేశమా?' ఇపుడు వినండి. సార్వకాలీనమైన సత్యదర్శనం కనిపిస్తుంది. 'ఇండియాకు రాజధాని ఢిల్లీ. నా హృదయంలో ప్రేమరాణి లిల్లీ' వంటి గమ్మత్తులూ, చెమక్కులూ కోకొల్లలు. 'చుట్టూ చెంగావిచీరె' పల్లవి పాడుతుంటే ఆ నులివెచ్చని భావన రసహృదయాల్ని తడితడిగా తాకుతుంది. 'నేనొక ప్రేమ పిపాసిని' అని ఎత్తుకోగానే నిజంగానే మానసాకాశం మీద 'ఇంద్రధనుస్సు' విరుస్తుంది (అదే సినిమా పేరు). శ్రీరస్తు శుభమస్తు అనుకోగానే పెళ్లి పుస్తకం తెరుచుకుంటుంది. ఇక పాటల్లో ఇంగ్లీష్ పదాల ప్రయోగం సరేసరి. ఆయన ముద్ర, కొత్త ఒరవడి 'పడుచుదనపు రైలు బండిపోతున్నది' 'రాయినైనా కాపోతిని' 'ఊహలు గుసగుసలాడే' 'వేదంలా ఘోషించే గోదావరి' వంటి పాటల్లో చిరస్థాయిగా ఉంటాయి. 'నీలీల పాడెదు దేవా' వంటి డబ్బింగ్ పాటలు ఎంత ప్రాచుర్యాన్ని పొందాయో మనందరికీ తెలుసు.

...ఇన్ని ఇన్ని విశేషల వ్యక్తిత్వం కలిగి సాహిత్య గరివృక్షం వంటి ఆరుద్రని ఎన్నుకుంటే 'ఏరిన ముత్యాలు' ఉన్నాయి. జలజలా రాలుతాయి. అయితే 'మానవుడే మహనీయుడు' ఒక్కదాన్ని ఇపుడు స్మరిద్దాం. వర్తమానత, సామాజికత, అభ్యుదయాకాంక్ష, 'మనిషి' మనిషే. తిరుగులేదు వాడికి అదే ప్రబోధం - ఇవాళ ఏ.ఐలు, ఎంఎల్‌లు, రోబోటెక్స్ విస్తరిస్తున్నా కూడా ఎంతటి సంభావ్యత, ప్రాసంగికత ఉన్న సందేశమో తలుచుకుంటే - ఆరుద్ర ఎంత గొప్ప ద్రష్టో అర్థమవుతుంది. ఆరుద్ర అంటే - సంతకం లేకున్నా వాఙ్మయాన్ని తరచి, గెలిచి, తలెత్తి నిలిచిన వ్యాసమూర్తి కండ్ల ముందు ప్రత్యక్షమవుతాడు.

(నేడు ఆరుద్ర 99వ జయంతి)

-విహారి

దక్షిణాసియాలో నిశ్శబ్ద ప్రజాస్వామిక ప్రతిఘటన



ఫర్హాన్ హనీఫ్ సిద్ధిఖీ   అజయ్ గుడవర్తి

ఇటీవలి బంగ్లాదేశ్ పరిణామాలు, అంతకుముందు శ్రీలంక, పాకిస్థాన్‌లో జరిగిన సంఘటనలతో పాటుగా తాజాగా భారతదేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు, దక్షిణాసియాలో నిశ్శబ్ద ప్రజాస్వామిక ప్రతిఘటనను స్పష్టంగా తెలియ జేస్తున్నాయి. వలసపాలన అనంతర ప్రజాస్వామ్య దేశాలలో భిన్నమైన చారిత్రక ప్రక్షేపమార్గాలు ఉంటుండగా,భారతదేశ ప్రస్తుత పరిస్థితిని పాకిస్థాన్‌తో పోల్చడం ద్వారా ఈ ప్రతిఘటనను మనం అర్థం చేసుకుంటాం.

రెండు దేశాలు ఒకే విధమైన వలస వారసత్వాన్ని కలిగి ఉన్నప్పటికీ పాకిస్థాన్, హద్దులు దాటి నిరంకుశత్వం వైపు పయ నించగా భారతదేశంలో సుదీర్ఘ కాలంపాటు ప్రజాస్వామ్యం ఎందుకు కొనసాగిందనే కారణాలపై వలసపాలన అనంతర కాలాల్లోని భారతదేశం, పాకిస్థాన్‌లోని రాజకీయ వ్యవస్థల మధ్య పోలికలు ప్రధానంగా కేంద్రీకరించాయి. అనేకమంది మేధావులు, పాకిస్థాన్‌తో పోల్చితే భారతదేశంలో ప్రజాస్వామ్యానికి దోహదం చేసిన కారణాలను వివరించారు. ఈ కారణాలు భారతదేశంలో ప్రజాపునాది గల రాజకీయ పార్టీ వ్యవస్థకు ఎదురుగా సంస్థాగతంగా బలహీనంగా ఉన్న ముస్లింలీగ్‌ల ఉనికి దగ్గర్నుండి కాంగ్రెస్‌ను స్థాపించిన నిర్దిష్టమైన (మధ్య తరగతి) సామాజిక వర్గాలు, ముస్లింలీగ్‌ల ఆధిపత్యం వరకూ ఉన్నాయి.

అలాంటి వివరణల విలువ స్పష్టంగా ఉంది. అది భారతదేశం, పాకిస్థాన్‌ల రాజకీయ ప్రక్షేపమార్గల గురించి మన అవగాహనను పెంచుతుండగా, సాంప్రదాయమైన పోలిక అదే రీతిలో పాకిస్థాన్‌లోని ప్రజాస్వామిక స్థలాన్ని అవగాహన చేసుకోవడానికి చేసిన ప్రయత్నాలను బలహీనపరిచింది. ఇది, ప్రజాస్వామిక ఆధారాలు ఉన్నప్పటికీ భారతదేశ రాజకీయ వ్యవస్థలోని నిరంకుశ ధోరణి విశ్లేషణను మసక బరిచింది. ఈ నిర్దిష్టమైన తర్కం ద్వారా మనం అవగాహన చేసుకొని, సూచించిన వాటిని వివరించి, సామా జిక శక్తులు ప్రజాస్వామిక స్థలాన్ని తిరిగి పొందడానికి ప్రయత్నించే భారతదేశం, పాకిస్థాన్‌లు నిశ్శబ్ద ప్రజాస్వామిక ప్రతిఘటనల మధ్య ఉన్నాయని వాదిస్తాము.

క్రియాత్మక ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతమైన ఎన్నికల చరిత్ర, అధికారాల విభజన అంగీకార యోగ్యమైన ఆలోచనతో భారతదేశం అసాధారణవాదానికి ప్రతీకగా నిలిచింది. 1975లో విధించబడిన (నియమాల్ని ఉల్లంఘించే) ఎమర్జెన్సీని నిరోధించి, భారతదేశం ఒక బాధ్యతాయుతమైన ప్రజాస్వామ్య దేశంగా మిగిలిపోయింది. సైనిక పాలనపై పౌర పాలన ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు రాజ్యాంగపరమైన దృష్టి, వలసవాద వారసత్వ వ్యతిరేకత భారతదేశం విషయంలో బాగా పని చేసింది. జవహర్ లాల్ నెహ్రూ మంత్రివర్గంలో (1957-62) రక్షణ మంత్రిగా పనిచేసిన కృష్ణ మీనన్ సాయుధ బలగాలను బలహీనపర్చడంలో చాలా కీలకమైన పాత్రను పోషించాడు. ఈ విషయాన్ని ఇటీవలి కాలంలో జైరామ్ రమేష్, కృష్ణ మీనన్ జీవిత చరిత్రలో పేర్కొన్నాడు. భారత దేశం ఏనాడూ ఇంతవరకు సైనిక నియంతృత్వ ముప్పును ఎదుర్కోలేదు.

అయితే 2014లో మొదలైన నరేంద్రమోడీ పాలన అన్నిటినీ మార్చేయడం జరిగింది. అవసరానికి మించి నిరంకుశ పాలనా నమూనా దిశలో వేగంగా వెళ్లడంలో భారత దేశం కూడా పోటీపడుతుంది. భారతీయ ప్రజాస్వామిక కసరత్తు అధ్యక్ష తరహా రూపాన్ని తీసుకోవడమే కాకుండా ప్రతిపక్షం లేని ప్రజాస్వామ్యం కోసం కూడా ప్రచారం చేయడం బహుశా ఇది మొదటిసారి. భారతీయ జనతా పార్టీ 'కాంగ్రెస్ ముక్త భారత్' అనే ప్రచారాన్ని చేపట్టింది. ప్రస్తుత పాలక ప్రభుత్వం భద్రత, సాయుధ బలగాలకు సంబంధించిన సమస్యల్ని రాజకీయం చేస్తోంది. విద్యార్థులు, యువకులు చేపట్టే ప్రజాస్వామిక నిరసన రాజకీయాలను ఎదుర్కొనేందుకు భారత దేశంలోని యూనివర్సిటీలను



మతపరమైన శరణాలయాలుగా, సాయుధ బలగాలకు ప్రతీకలుగా మార్చాలని కోరుతున్నారు.

పాకిస్థాన్‌లో

మరోవైపు పాకిస్థాన్, బ్యూరోక్రసీ (ఉద్యోగస్వామ్యం), మిలిటరీతో రాజకీయ ప్రక్రియను నాశనం చేసి, నిరంకుశత్వం వైపు నడిపించే దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. ఉన్నత వర్గం స్థానంలో నిరంకుశత్వం బాగా లోతుగా పాతుకుపోయినప్పటికీ 1958 నుండి అన్ని మిలిటరీ నియంతృత్వాలు, మిలిటరీ పాలన పట్ల ప్రజలు పెద్ద ఎత్తున చేసిన నిరసనల ద్వారా వారి మరణాన్ని చూశాయి. ఒక సందర్భంలో ప్రజల నిరసనలతోనే పాకిస్థాన్ మొదటి సార్వత్రిక ఎన్నికలు ప్రారంభమయ్యాయి. పాకిస్థాన్ తూర్పు భాగంలో మిలిటరీ అణిచివేత, 1971లో ఆ రాజ్య విచ్ఛిన్నం, అంటే మిలిటరీ అనుకున్న దానికి పూర్తిగా వ్యతిరేకంగా జరిగింది. జనరల్ ముషారఫ్ పాలన ప్రజల్ని, రాజకీయ ఉన్నత వర్గాల వారిని ఒకే విధంగా దూరంలో ఉంచడం వల్ల రాజకీయ వ్యవస్థను అదుపు చేసి, ఆధిపత్యం చెలాయించే ఉద్దేశ్యం మళ్లీ ఒక న్యాయవాదుల ఉద్యమంతో, చట్టబద్ధత కోల్పోయి కుప్పకూలిపోయింది. 2008 నుండి పాకిస్థాన్‌లో నాలుగుసార్వత్రిక ఎన్నికలు జరిగాయి, సాపేక్షంగా చూస్తే ప్రజాస్వామ్య వ్యవస్థకు పరివర్తన జరిగింది. అయితే ఈ పరివర్తనకు వ్యతిరేకంగా మిలిటరీ తీవ్ర ప్రతిఘటనను తెలిపింది. ఈ కాలంలోనే పాకిస్థాన్ రాజకీయాలకు ప్రజాస్వామిక మార్గాన్ని కొనసాగించాలని రాజకీయ ఉన్నత వర్గాలకు చెందిన వారి ఏకాభిప్రాయం కూడా తెలుసు. కానీ గడిచిన రెండు ఎన్నికలు (2018, 2024), రాజకీయ ప్రత్యర్థులను ఎంతకైనా కొనడమేకాక మరీ ముఖ్యంగా వారిని అంతమొందించి, తుడిచిపెట్టడానికి మిలిటరీతో ఏకాభిప్రాయాన్ని కోరుకునే రాజకీయ ఉన్నత వర్గాలకు చెందిన వారి ఆందోళనకర వైఖరిని సూచిస్తున్నాయి.

అయితే రాజకీయ ఉనికికోసం మిలిటరీతో ఎత్తుగడల పొత్తుల్ని చేపట్టిన రాజకీయ ఉన్నత వర్గీయులకు, మిలిటరీకి కూడా ఫలితం చాలా ప్రతికూలంగా వచ్చింది. ప్రజాస్వామ్యానికి అనుకూలంగా పౌరుల లోతైన, విస్తృతమైన వాదనలను, అదే విధంగా ఎవరికి పాలించే హక్కు ఉంది అనే దానిపై రోజురోజుకూ రాజకీయ వర్గాలకు, మిలిటరీకి మధ్య పెరుగుతున్న వైరుధ్యాలను 2008 నుండి పాకిస్థాన్ చూస్తూనే ఉంది. పాకిస్థాన్ తెహ్రీక్-ఈ-ఇన్సాఫ్ (పీటీఐ) ప్రభుత్వం మరియు మిలిటరీ కేవలం పాకిస్థాన్ ముస్లింలీగ్ (ఎన్) ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ప్రదర్శనలు చేపట్టడాన్ని చూసేందుకు 'ఒక పేజీ' మంత్రాన్ని ప్రారంభించాయి. మరీ ముఖ్యంగా మిలిటరీ మాత్రం తన రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ పని చేసింది.

తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత ప్రభుత్వ తొలగింపు కోసం పీటీఐ మిలిటరీని లక్ష్యంగా పెట్టుకోవడం ద్వారా పీఎంఎల్ (ఎన్) చెయ్యాల్సిన పనిని నెత్తికెత్తుకుంది. ఫలితమేమంటే, మొత్తం ప్రభుత్వ యంత్రాంగం దానికి విరుద్ధంగా పని చేసినప్పటికీ పీటీఐ భారీగా ఓట్లు సంపాదించి, పార్లమెంట్‌లో అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించింది. ఎవరైనా తెలుసుకోవాల్సిన విషయమేమంటే, మిలిటరీతో పొత్తు, రాజకీయ ఉన్నత వర్గాలకు అధికారానికి స్వల్పకాలిక మార్గాన్ని ఏర్పరు స్తుంది కానీ రాజకీయ, సామాజిక అవగాహన కలిగిన పౌరులు ఈ కూటమిని, మిలిటరీ రాజకీయ ప్రయోజనాలను ప్రశ్నిస్తారు.

భారతదేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలు, బీజేపీ నిరంకుశ రాజకీయాలకు వ్యతిరేకంగా ఒక ప్రజాస్వామిక ప్రతిఘటనను చూశాయి. పాకిస్థాన్‌లో మిలిటరీ-పార్టీ బంధాన్ని ప్రజలు నిరసించి, ఎన్నికల చట్టబద్ధతను ప్రశ్నించారు. భారతదేశంలో 1975లో ఎమర్జెన్సీ లాంటి కొన్ని చారిత్రక సంఘటనలు జరిగిన సమయంలో మధ్యతరగతి వర్గాలు నియంతృత్వం కోసం పరితపించారు. భారతదేశంలోని వైవిధ్యం, దానితోపాటు వచ్చే సామాజిక గందరగోళాన్ని నిర్వహించడానికి నియంతృత్వం చాలా సమర్థవంతంగా పని చేస్తుందని వారు భావించారు. పాకిస్థాన్‌లో మధ్య తరగతి వర్గం కూడా గజిబిజిగా ఉన్న ప్రజాస్వామ్య రాజకీయాలకు వ్యతిరేకంగా మిలిటరీ పాలనకు అనుకూలంగా సాంప్రదాయ రాజకీయ వైఖరిని ప్రదర్శించింది. కానీ రాజకీయాల్లోకి మిలిటరీ ప్రవేశించడాన్ని అక్కడి యువతరం చాలా తీవ్రంగానే విమర్శిస్తుంది.

దృష్టి కోణంలో

ప్రజాస్వామ్యాలు తిరోగమనాన్ని ఎదుర్కొంటున్నందు వల్ల ప్రజాస్వామిక ప్రతిఘటనను ప్రదర్శించడానికి డిజిటలైజ్డ్ స్థలాల్ని ఉపయోగించడంతోపాటు పౌరులు కొత్త విధానాల్ని కనుగొంటున్నారు. వారు భారతదేశంలో స్థిరమైన రాజకీయ మార్పుకు దారితీసే విధంగా ఎన్నికల ఫలితాల ద్వారా తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. పాకిస్థాన్‌లో ఇది ఎలాంటి రూపం తీసుకుంటుందో చూడాలి.

("ద హిందూ" సౌజన్యంతో)

(ఫర్హాన్ హనీఫ్ సిద్ధిఖీ, ఇస్లామాబాద్ (పాకిస్థాన్)లోని ఖాయిద్ ఈ ఆజమ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్)
(అజయ్ గుడవర్తి జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్)
అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

> **2014లో మొదలైన నరేంద్రమోడీ పాలన అన్నిటినీ మార్చేయడం జరిగింది. అవసరానికి మించి నిరంకుశపాలనా నమూనా దిశలో వేగంగా వెళ్లడంలో భారతదేశం కూడా పోటీపడుతుంది. భారతీయ ప్రజాస్వామిక కసరత్తు అధ్యక్ష తరహా రూపాన్ని తీసుకోవడమే కాకుండా ప్రతిపక్షం లేని ప్రజాస్వామ్యం కోసం కూడా ప్రచారం చేయడం బహుశా ఇది మొదటిసారి. భారతీయ జనతా పార్టీ 'కాంగ్రెస్ ముక్త భారత్' అనే ప్రచారాన్ని చేపట్టింది. ప్రస్తుత పాలక ప్రభుత్వం భద్రత, సాయుధ బలగాలకు సంబంధించిన సమస్యల్ని రాజకీయం చేస్తోంది. విద్యార్థులు, యువకులు చేపట్టే ప్రజాస్వామిక నిరసన రాజకీయాలను ఎదుర్కొనేందుకు భారత దేశంలోని యూనివర్సిటీలను మతపరమైన శరణాలయాలుగా, సాయుధ బలగాలకు ప్రతీకలుగా మార్చాలని కోరుతున్నారు.**

ప్రపంచ యుద్ధాలు - గుణపాఠాలు



డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037


ప్రపంచ దేశాలు 'అల్లీస్ (ఫ్రాన్స్, యుకె, యుఎస్, యుఎస్ఎస్ఆర్, చైనా, పోలాండ్)', 'ఆక్సిస్ (జర్మనీ, జపాన్, ఇటలీ)' అనబడే రెండు జట్లుగా ప్రపంచ ముఖ్య దేశాలు విడిపోయి 1939 నుంచి 1945 వరకు జరిగిన భీకర రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొనడం ప్రపంచం మొత్తానికి తెలుసు. ప్రపంచ వ్యాప్తంగా 30 దేశాలకు చెందిన 100 మిలియన్ల జనాభా పాల్గొనడం, 85 మిలియన్ల సైనిక/సామాన్య ప్రజల అపార ప్రాణ నష్టం, తొలి అణుబాంబుల విధ్వంసకర (హిరోషిమా, నాగసాకి) భయానక అనుభవాలు, యుద్ధ అనంతర కరువులు, వ్యాధుల వ్యాప్తి పీడలు, ఆస్తి విధ్వంసాలు, మారణహోమాలు, నరమేధాలు, అపార ఆర్థిక కుదుపులతో ప్రపంచ చరిత్రలోనే అత్యంత చేదు అనుభవాలను చవిచూశాయి. 'ఆక్సిస్' వర్గపు జర్మనీ, జపాన్ తదితర దేశాలు అపార ఆస్తి ప్రాణ నష్టాలను నమోదు చేసుకోవడం, కనీసం 12 మిలియన్ల ప్రాణ నష్టం జరగడం అత్యంత బాధాకరం. విజేతలైన 'అల్లీస్' వర్గంలో కూడా దాదాపు 61 మిలియన్ల ప్రాణ నష్టం జరిగిందని తెలుస్తున్నది. ఒక్క సోవియట్ యూనియన్లోనే 27 మిలియన్లు, జర్మనీ 5.3 మిలియన్లు, చైనా 7.5 మిలియన్ల ప్రాణాలను కోల్పోవలసి వచ్చింది. వరల్డ్ వార్-2లో సహితం దాదాపు 87,000 మంది సైనికులు, లక్షకు పైగా సామాన్య జనం ప్రాణత్యాగం చేశారు.

రెండో ప్రపంచ యుద్ధం..ప్రజలపై ప్రభావం

01 సెప్టెంబర్ 1939న హిట్లర్ నాజీ జర్మనీ సేనలు పోలాండ్‌పై దండయాత్ర చేయడంతో రెండో ప్రపంచ యుద్ధానికి బీజాలు పడ్డాయి. ఈ దాడిని ఖండించిన యుకె, ఫ్రాన్స్ దేశాలు 03 సెప్టెంబర్‌న జర్మనీపై యుద్ధం ప్రకటించడంతో భీకర ప్రపంచ యుద్ధం విధ్వంసక జడలు విప్పడం, ప్రపంచ దేశాలు రెండు గ్రూపులుగా విడిపోవడంతో యుద్ధ తీవ్రత మానవాళి మనుగడను ప్రశ్నార్థకం చేసింది. హిట్లర్ ఆత్మహత్య చేసుకోవడంతో జర్మనీ దురాక్రమణ చేసిన భూమిని వదిలేయడం, 08 మే 1945న బేషరతుగా జర్మనీ ఓటమిని అంగీకరించడం జరిగింది. ఓటమిని అంగీకరిం చని జపాన్‌లోని హిరోషిమా 06 ఆగష్టు 1945), నాగసాకి (09 ఆగష్టు 1945) నగరాలపై రెండు అణు బాంబులు వేయడంతో జపాన్ ఓటమిని అంగీకరించడం(15 ఆగష్టు)తో రెండో ప్రపంచ యుద్ధం 02 సెప్టెంబర్ 1945న ముగిసినట్లు ప్రకటన వెలువడింది. ప్రపంచ యుద్ధం-2 నేర్పిన గుణపాఠాన్ని గమనించిన ఐరాస సత్వరమే చొరవ తీసుకుంది. ఇలాంటి యుద్ధాలు మానవాళికి శాపాలుగా మారుతాయని అంగీకరించి, ప్రపంచ యుద్ధాలను నిరోధించడంలో భాగంగా నాటి అగ్రరాజ్యాలైన యుఎస్, రష్యా యుకె, ఫ్రాన్స్, చైనా సభ్యుల శాశ్వత సభ్యత్వంతో కూడిన 'ఐరాస భద్రతా మండలి' ఏర్పడింది. అనంతర అర్ధ శతాబ్దకాలం పాటు అమెరికా, సోవియట్ యూనియన్‌ల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరిగిన విషయం కూడా విదితమే.

మూడో ప్రపంచ యుద్ధం రానుందా?

ఓ వైపు 24 ఫిబ్రవరి 2022 నుంచి ఉక్రెయిన్ - రష్యా యుద్ధం, మరో వైపు 07 అక్టోబర్ 2023 నుంచి ఇజ్రాయిల్‌తో పాలస్తీనా యుద్ధంతో పాటు లెబనాన్/ఇరాన్‌లు కూడా ఇజ్రాయిల్‌పై దాడులకు ఉపక్రమించడం తీవ్ర రూపం దాల్చుతూ నెలలు, సంవత్సరాలు దాటుతూ మరో ప్రపంచ



యుద్ధానికి దారి తీస్తున్నట్లు కనిపిస్తున్నది. గతంలో జరిగిన ఇలాంటి రక్తపాత యుద్ధాలతో పాటు నేటి యుద్ధాలు కూడా ప్రపంచ మానవాళికి అద్వితీయ గుణపాఠాలను నేర్పుతున్నాయి. యుద్ధాలు ఎవరు గెలిచినా మారణహోమం, మానవ వనరుల విధ్వంసం తప్పనిసరి అవుతున్నది. రెండు ప్రపంచ యుద్ధాలు పరిచయం చేసిన లక్షలాది మరణాల నుంచి మనందరిలో ఆత్మ విమర్శలకు దారులు తెరవాలి. శతాబ్దం దాటిన ప్రపంచ యుద్ధం-1, 75 ఏండ్ల దాటిన 2వ ప్రపంచ యుద్ధ క్షేత్రాల్లో కోట్ల ప్రాణాలు గాల్లో కలవడం, అపార ఆస్తినష్టం సంభవించడం మనకు హెచ్చరిక కావాలి. 3వ ప్రపంచ యుద్ధమే జరిగితే అత్యాధునిక ఆయుధాలు, అణుబాంబు విధ్వంసాలతో భూమి క్షణాల్లో బూడిద కావడం ఖాయమని తెలుసు కోవాలి. ఓడిన వారు సర్వస్వాన్ని, గెలిచిన వారు భవిష్యత్తు తరాలను కోల్పోతారు. అమెరికా-ఉత్తర కొరియా, ఇం డియా-పాక్, చైనా-తైవాన్‌ల మధ్య అనాదిగా ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం నెలకొంది. అయితే వీటన్నింటికి ఆజ్యం పోసేది మాత్రం అమెరికా అన్న సంగతి మన గమనంలో ఉండాలి. ఒకవేళ మూడో ప్రపంచ యుద్ధమే జరిగితే శక్తివంతమైన క్షిపణులు (మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్), అణ్వాయుధాల అమ్ముల పొదలు భూగోళం దద్దరిల్లేలా గర్జనలు చేసి మానవాళికి ఎంతో నష్టం చేసే ప్రమాదం పొంచి ఉన్నది. ఇప్పటికే 67 దేశాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం ఉన్నట్టు అంతర్జాతీయ మీడియా ద్వారా తెలుస్తోంది.దీన్ని అరికట్టే దిశగా ప్రపంచ దేశాలు పూనుకోవాలి. పరస్పరం చర్చల ద్వారా అంగీకారానికి రావాలి. ప్రజల్ని కాపాడుకోవాలి.

రష్యా, ఉక్రెయిన్ యుద్ధం

నేడు ఏ రెండు అతి చిన్న దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైనా, మరో ప్రపంచ యుద్ధానికి కారణం కావచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం 24 ఫిబ్రవరి 2022న ప్రారంభమై నేటికీ కొనసాగుతున్నది. గత 19 నెలలుగా అపార నష్టాలకు కారణమవుతున్నది. ఈ యుద్ధంలో ఇరుపక్షాలకు చెందిన ఐదు లక్షల మంది మరణించడం లేదా గాయపడినట్టు ప్రపంచ మీడియా ద్వారా తెలుస్తున్నది. ఇప్పటికేఉక్రెయిన్‌కు వెన్నుదన్నుగా ఉంటున్న అమెరికా రష్యాను దెబ్బతీసేందుకు నాటోను ప్రవేశపెట్టడం వ్యూహాత్మకంలో ఓ భాగమే. అయితే అమెరికా సహకారంతో యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్‌కు ఇది అపారష్టం కలగజేస్తున్నది. ఉక్రెయిన్, రష్యాల మధ్య శాంతి చర్చలకు చైనా సహకరిస్తున్నది. కానీ ఇది కూడా సహించని అమెరికా ఇరు దేశాలపైనా తన వాణిజ్య ఆంక్షలతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నది. ప్రపంచంలో నెంబర్‌వన్ స్థానానికి దూసుకెళ్తున్న చైనాను ఎలాగైనా అణగదొక్కాలనే ప్రయత్నం అమెరికా చేస్తోంది. ఇప్పటికే తమ దేశంలో తయారు చేసే ఆయుధ, యుద్ధ సామాగ్రిని ఇతర దేశాలకు అందించడం, సంఘీభావాన్ని వ్యక్తం చేయడం, తమకు లంగని దేశాలపై యుద్ధం ప్రకటించడం అమెరికా కుతంత్రాలను బట్టబయలు చేస్తోంది.

పాలస్తీనా-ఇజ్రాయిల్ యుద్ధం

పాలస్తీనా దేశంలోకి వలసెళ్లిన యూదులు అక్కడి అరబ్బులను తరిమికొట్టి దేశాన్ని ఆక్రమించిన తీరు జగమెరిగిన సత్యం. ఇజ్రాయిల్‌ను కూడా వెనుకనుండి నడిపిస్తున్నది అమెరికానే. అయితే ఈ యుద్ధంలో గాజాపై జరిగిన బాంబులు, రాకెట్ల వర్షం ఎంతోమంది పసిపిల్లలతో సహా దాదాపు నలభై వేల మందికిపైగా ఇప్పటివరకు హతమార్చింది. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ రక్తహింస ప్రపంచ చరిత్రలోనే ఒక దారుణ మారణహోమం. దీనికి యథేచ్ఛగా సహకరిస్తున్న అమెరికా కూడా ప్రపంచ న్యాయస్థానంలో ముద్దాయే. పాలస్తీనా పౌరులను రక్షించడం కోసం ఏర్పడిన హమాస్ సంస్థను నిర్మూలించే పేరుతో కొనసాగుతున్న ఈ యుద్ధ బీభత్స లక్ష్యం పాలస్తీనాను పూర్తిగా ఆక్రమించడం.దాన్ని తిప్పికొడుతున్న పాలస్తీనా ప్రజల ధైర్య సాహసాలు అభినందించదగినవే. అయితే అన్ని దేశాల్లో యుద్ధాలకు కారణమవుతున్న అమెరికా సామ్రాజ్యవాదాన్ని ముందు బద్దలు కొట్టాలి. అది శాంతియుత ఉద్యమాల ద్వారా మాత్రమే సాధ్యమన్న విషయాన్ని ప్రజలు గుర్తెరగాలి.

యుద్ధం ప్రమాదకరమని, యుద్ధాలతో సమాధానాలు దొరకవని, శాంతియుత వాతావరణంలో చర్చల ద్వారానే శాశ్వత పరిష్కారాలు లభిస్తాయని నమ్మితేనే అది సత్ఫలితాల నిస్తుంది. ఒకవేళ యుద్ధానికే కాలుదువ్వితే ఇరుపక్షాల వైపు ప్రపంచ దేశాలు చేరి మరో ప్రపంచ యుద్ధ వాతావరణం నెలకొనడం, మానవాళి/సకల ప్రాణి కోటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరికలు వినిపిస్తున్నాయి. బాధ్యత గల ప్రపంచ దేశాలు శాంతి పావురాలను ఎగురవేస్తూ, సర్వమానవాళి సంక్షేమ దిశగా అడుగులు వేయాలి. అమెరికా ఏకఛత్రాధిపత్యాన్ని, దేశాలపై పెత్తనాన్ని ఐక్యరాజ్య సమితి కట్టడి చేయాలి.లేదంటే సామ్రాజ్యవాద అరాచకం మరింత మితిమీరి ప్రపంచ దేశాలపై ప్రభావం చూపే అవకాశమున్నది.

(01 సెప్టెంబర్ "ప్రపంచ యుద్ధం-2 ప్రారంభ దినం", 02 సెప్టెంబర్ 'ప్రపంచ యుద్ధం-2 ముగిసిన దినం')

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మండల వైద్యాధికారి బాలకృష్ణ
- మంగళగూడెంలో వైద్యశిబిరం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఎం.వెంకటాయపాలెం పీహెచ్సీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మంగళగూడెంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఎంవీపాలెం పీహెచ్సీ వైద్యుడు బాలకృష్ణ ఆధ్వర్యంలోని వైద్యుల బృందం గ్రామంలో ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేపట్టారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. అనారోగ్యం బారినపడ్డ వారిని నుంచి రక్తనమూనాలను సేకరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి గ్రామస్థులంతా పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ప్రజలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. అనంతరం గ్రామం మొత్తం పరిసరాలను పరిశీలించి పారిశుద్ధ్యం సక్రమంగా లేకపోవడంతో బ్లీచింగ్ చల్లి, పంచాయతీ సిబ్బంది చేత పారిశుద్ధ్య పనులు చేయించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మురుగునీరు నిల్వకుండా, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.


కార్యక్రమంలో వైద్యురాలు దివ్య, హెచ్ఈ భద్రు, సిబ్బంది మాణిక్యమ్మ, గురుభాయ్, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- మిషన్ భగీరథతో పట్టణమంతా గోతుల మయం
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో
- ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి



వర్షాకాలం దృష్ట్యా పట్టణ ప్రజలు అంటువ్యాధులు, జ్వరాల బారిన పడకుండా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మున్సిపల్ పాలకవర్గాన్ని కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో ఛైర్మెన్ కూసంపూడి మహేశ్ అధ్యక్షతన 41వ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలంలో సాధారణంగా వచ్చే సీజనల్ వ్యాధులతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకుంటే దోమల తీవ్రత ఎక్కువయి ప్రజలు వివిధ రకాల ఆరోగ్య రుగ్మతల బారినపడతారన్నారు. ప్రజలకు మున్సిపల్ అందించే తాగునీటిని కూడా మంచిగా సరఫరా చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి పట్టణంలోని వాటర్ ట్యాంకులను శుభ్రపర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ట్యాంకుల్లో బ్లీచింగ్, క్లోరిన్ కలపాలన్నారు. మిషన్ భగీరథ కారణంగా పట్టణమంతా గోతుల మయంగా మారిందన్నారు. ప్రధాన రహదారి సైతం పూర్తిగా పాడైందన్నారు. సింగరేణి సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో కొమ్మేపల్లి కుటుంబాలకు నిర్మించిన గృహాల లే-అవుట్ సత్తుపల్లి పరిధిలోకి రాని కారణంగా మున్సిపల్‌కు వచ్చే ఆదాయం రావడం లేదన్నారు.

మున్సిపల్ దుకాణ సముదాయాలకు టెండర్లు పిలవాలి

గత 20యేండ్లుగా మున్సిపల్ దుకాణాలు కొందరి చేతుల్లోనే ఉన్నాయని, పర్సంటేజీలు పెంచి మళ్లీ వాళ్లకే ఇచ్చేకన్నా ఆయా షాపింగ్ కాంప్లెక్సు దుకాణాలకు టెండర్లు పిలవడం ద్వారా మున్సిపాలిటీకి ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని కౌన్సిలర్లు కొందరు తమ అభిప్రాయాలను కౌన్సిల్‌లో ప్రస్తావించారు. మున్సిపల్‌కు అవసరమయ్యే పరికరాలు, విద్యుత్ సామాన్లను చాలా కాలంగా ఒకే షాపునుంచి తీసుకురావడం సరికాదన్నారు. స్టేషనరీ, జిరాక్సులు తీయించే విషయంలో కూడా ఇలాగే జరుగుతుందన్నారు. చెడిపోయిన మోటార్ల రిపేర్లకు పెట్టే ఖర్చుతో కొత్త మోటార్లు కొనే అవకాశం ఉండగా పదేపదే చెడిన మోటార్లను ఎందుకు రిపేర్లకు ఇస్తున్నారని ఇంజినీరింగ్ విభాగం అధికారిని కౌన్సిలర్లు నిలదీశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి, మేనేజర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు గ్రాండ్ మౌలాలి, దూదిపాల రాంబాబు, అమరవరపు విజయనిర్మల, మందపాటి పద్మజ్యోతి, ఎస్కే చాంద్‌పాషా, దేవరపల్లి ప్రవీణ్ పాల్గొన్నారు.

వినాయకచవితి, గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ- ఖమ్మం



వినాయక చవితి, గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను అన్ని శాఖలు సమన్వయంతో పక్కగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్తంభాద్రి ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో వినాయక చవితి పండుగ, గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ హిత మట్టి గణేషులు ప్రతిష్ఠించేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. మండపాల వద్ద పారిశుధ్యం, విద్యుత్ ఏర్పాట్లు చేయాలని, పెద్ద విగ్రహాల మండపాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకొనేలా కమిటీ ప్రతినిధులకు అవసరమైన సూచనలు అందించాలని, నిమజ్జనం సంబంధించి నిర్దేశించిన ప్రదేశాలలో పూర్తిస్థాయి బారికేడ్స్, పబ్లిక్ అడ్రస్ సిస్టం త్రాగునీరు, లైటింగ్, మొబైల్ టాయిలెట్ నిర్వహించాలని అన్నారు. నిమజ్జనం పాయింట్ల వద్ద క్రేన్‌లను ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని, వారి వివరాలు ముందుగానే జిల్లా యంత్రానికి అందించాలని, మత్స్య శాఖ అధికారిని, నిమజ్జన పాయింట్ల వద్ద 108 వాహనాలు, ఏర్పాటు చేయాలని, ప్రతి పాయింట్ వద్ద, అలాగే మండల కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అధికారులు ఉత్సవ కమిటీ మెంబర్లతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని పండుగ, నిమజ్జనం సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్ల మరమ్మతులు చేయించాలని, విద్యుత్ వైర్లు వేలాడకుండా చూడాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆయన తెలిపారు. కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ సహకరించాలని, సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, అదనపు డిసిపి ప్రసాదరావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, స్తంభాద్రి ఉత్సవ కమిటీ బాధ్యులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యూనిట్లను లబ్దిదారులకు అందజేసేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

ఇందిర మహిళా శక్తి పథకం కింద చేపట్టిన వివిధ యూనిట్లను లబ్దిదారులకు అందజేసేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులతో ఇందిర మహిళా శక్తి యూనిట్లపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ మండల వారిగా మహిళా శక్తి పథకం కార్యాచరణ చేయాలన్నారు. స్థానికంగా ఉన్న డిమాండ్‌ను బట్టి యూనిట్ల ఎంపిక చేయాలన్నారు. బ్యాంకు లింకేజ్ రుణాలతో పచ్చళ్ళ తయారీ, కిరాణా, మొబైల్ టిఫిన్, టైలరింగ్, మెకానిక్, టీ స్టాల్, మెడికల్ షాపు, ఫర్టిలైజర్ షాప్, మీ సేవా, పాడి పశువుల, పౌల్ట్రీ, బోటిక్, లాండ్రీ, బ్యూటీపార్లర్ మొదలగు వివిధ వ్యాపార యూనిట్ల ఏర్పాటు కోరకు లబ్దిదారుల ఎంపిక చేపట్టాలన్నారు. యూనిట్లను నడుపుతూ, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఒకే గ్రామం, ప్రాంతంలో ఒకే తరహా యూనిట్లు ఒకటి కంటే ఎక్కువ ఏర్పాటు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యూనిట్ క్యాచ్‌మెంట్ ఏరియా లాభదాయకంగా వుండేలా చూడాలని, మండలాల వారీగా గుర్తించి, ఎంపికయిన యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని, వారం వారం వారిగా గ్రౌండింగ్ యూనిట్ల లక్ష్యం పెట్టుకొని, తదనుగుణంగా కార్యాచరణ చేయాలన్నారు. యూనిట్ల గ్రౌండింగ్ నుండి, యూనిట్లు ఆయా వ్యాపారంలో నిలదొక్కుకోవడానికి కొంతకాలం పాటు అధికారులు పర్యవేక్షణ చేస్తూ, సహాయ సహకారాలు అందించాలన్నారు. సృజనాత్మక యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ఎంపిక చేసిన లబ్ధిదారులు సంపూర్ణంగా అభివృద్ధి చెందాలని, ఈ దిశగా వ్యాపార ధోరణితో ఎదగాలని, ఉత్సాహంగా ఉన్న మహిళా సంఘాలకు ప్రాధాన్యం కల్పించాలని ఆయన అన్నారు. యూనిట్‌తో అభివృద్ధి చెందిన వారి సక్సెస్ స్టోరీస్ ఇతరులకు తెలిసేలా ప్రచారం చేయాలని, దీనితో ఇతరులు ప్రేరణ పొందుతారని కలెక్టర్ తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ మహిళాశక్తి పథకంలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. గ్రామాలలో సింగిల్ యూసెజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, మహిళా స్వశక్తి సంఘాలకు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద అందించే రుణాలను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరా మహిళా శక్తిలో భాగంగా స్వయం సహాయక మహిళా సభ్యులను ప్రోత్సహిస్తూ, ప్రతి మహిళా సభ్యురాలు నెలకు కనీసం రూ.15 వేల వరకు గ్రామంలోనే సంపాదించే విధంగా అవకాశం కల్పించాలన్నారు. జిల్లాలోని సంఘాలు, గ్రామ సంఘాలను ఏ, బి గ్రేడుల్లో ఉంచాలని, ఇందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, అదనపు డిఆర్డీవో నూరొద్దీన్, డిపిఎంలు, ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ అందేలా చూస్తాం

మధిర ఏడీఏ విజయ్ చంద్ర

నవతెలంగాణ - బోనకల్

కొంత ఆలస్యమైనా అర్హత కలిగిన రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఏడీఏ ఎస్ విజయ్ చంద్ర తెలిపారు. మండల కేంద్రంలోని బోనకల్లు రైతు వేదిక నందు శుక్రవారం నిర్వహించిన రుణమాఫీ సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిధిలో బోనకల్ గ్రామంలో రేషన్ కార్డు లేని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి కొండూరి విజయ భాస్కర్ రెడ్డి నిర్వహించారు. బోనకల్ గ్రామంలో నిర్వహించిన సర్వేలో మొత్తం 125 రైతు కుటుంబ సభ్యులకు గాను, 79 రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. షెడ్యూల్ ప్రకారం రేషన్ కార్డు లేని రైతులు ఆయా గ్రామాలలో ధ్రువీకరణ పత్రంతో పాటు, కుటుంబ సభ్యుల ఆధార్ జిరాక్సులు, లోన్ అకౌంట్ జిరాక్సులు, పట్టాదారు పాస్ పుస్తకాల జిరాక్సులు వివరాలతో మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారుల బృందాన్ని సంప్రదించాలని ఆయన కోరారు. షెడ్యూలు ప్రకారం శనివారం రామాపురం, గార్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయాల నందు కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అర్హత ఉన్న రైతులు గమనించి సంబంధిత పత్రాలతో వ్యవసాయ శాఖ బందాన్ని సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు బంధం రజిత, మరీదు త్రివేణి, గోగుల హరికృష్ణ, బద్దల కార్తీక్, నాగినేని నాగసాయి, రైతులు పాల్గొన్నారు.



ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం విజయవంతం

నవతెలంగాణ-వైరా



వైరాలో శుక్రవారం కమ్మవారి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం విజయవంతం అయింది. వైరా మండలంతో బోనకల్, తల్లాడ, కొణిజర్ల మండలాల నుండి ఈ శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ హైద్రాబాద్, ఎస్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ ఖమ్మం, బోడేపూడి వైద్య శిబిరం వైరా, కమ్మజన సేవా సమితి వైరా ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్ నిర్ధారణ శిబిరంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మరియు రీసేర్చ్ కేంద్రం వైద్యులు, అదే హాస్పిటల్‌కు చెందిన సంచార వ్యాధి నిర్ధారణ వెహికిల్, సిబ్బంది పాల్గొని పరీక్షలు నిర్వహించారు. కమ్మజన సేవా సమితి సీనియర్ నాయకులు అడపా అప్పారావు, కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ చైర్మన్ గూడూరు సత్యనారాయణతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కమ్మజన సేవా సమితి అధ్యక్షులు చింతనిప్పు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అడపా అప్పారావు, కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ చైర్మన్ గూడూరు సత్యనారాయణ, బోడేపూడి కళానిలయం సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు, ఎస్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా గౌరవాధ్యక్షులు వెనిగళ్ళ శ్రీనివాసరావు, వైద్య శిబిరం యొక్క ఉద్దేశ్యాన్ని వివరించారు. గ్రామీణ ప్రాంతాలలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన లేక అనేక మంది వ్యాధి వివిధ దశలు దాటిన తరువాత ఆసుపత్రులకు వెళ్లి ఆరోగ్య పరంగా,ఆర్థికంగా నష్టపోతున్నారని, అందుకే తమ సంస్థలు మండల కేంద్రానికి బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులను, సంచార వ్యాధి నిర్ధారణ ల్యాబ్ వెహికిల్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి హైద్రాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి తరలించి ఆరోగ్యశ్రీ కింద ఉచిత చికిత్సలు అందజేయటం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో సుమారు 10 వేల రూపాయల విలువగల సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్‌కు సంబంధించిన మామో గ్రాఫ్, ఎక్స్ రే, అల్ట్రా స్కానింగ్‌లు కూడా చేశారు. ఈ వైద్య శిబిరంలో మధిర మాజీ ఎంఎల్ఏ కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీలు కట్టా కృష్ణార్జునరావు, బొంతు సమత, భూక్యా వీరభద్రం, సామినేని నాగేశ్వరరావు, పెద్దినేని రాధాక్రిష్ణ, పారుపల్లి ఝాన్సీ, చింతనిప్పు రాంబాబు, సూర్యదేవర శ్రీధర్, సీపీఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, మచ్చా మణి, శ్రీదేవి, చింతనిప్పు చలపతి రావు, కె.రాములమ్మ, అఫ్జల్, బెల్లం రాధాక్రిష్ణ, పొడపాటి నాగేశ్వరరావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, బండి వీరయ్య, బి.కృష్ణప్రసాద్, గింజుపల్లి జనార్దన్, ఎస్ విజయ్ భాస్కర్, దామా వీరయ్య, సిహెచ్ మురళీధర్, మాడపాటి కిషోర్, యనమద్ది రామకృష్ణ, వైద్య బృందం శ్రావణ కుమారి, సులోచనారాణి, రవి శంకర్, శాంతిని, క్యాంపు కో ఆర్డినేటర్ పాపినేని ఆదిత్య, తూనాటి శివశంకర్, చావా వినయ్ తదితరులు పాల్గొన్నారు సాయంత్రం నాలుగు గంటలకు 300 మంది పరీక్షలు చేయించుకున్నారు.



రోగులకు అండగా డాక్టర్ 'వేముల స్రవంతి'

- గత వైద్యులు బాలాజీ, శ్రీకాంత్‌ల సేవలను కొనసాగిస్తున్న స్రవంతి
- సీజనల్ వ్యాధుల పట్ల నిత్యం అప్రమత్తం
- పీహెచ్‌సీలో పెరిగిన ఓపి సంఖ్య
- అన్ని గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు
- వైద్య సేవలపై తక్షణం స్పందిస్తున్న సిబ్బంది

నవతెలంగాణ - బోనకల్



సీజనల్ వ్యాధుల పట్ల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, వైద్య సిబ్బంది తక్షణమే స్పందిస్తూ రోగులకు అండగా ఉంటున్నారు. సీజనల్ వ్యాధుల సమస్య ఎక్కువగా ఉన్న గ్రామాలలో వెంటనే ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తూ వైద్య సేవలను కొనసాగిస్తున్నారు. గతంలో జిల్లా ఉత్తమ వైద్యాధికారులుగా సేవలు అందించిన బోనకల్ మండల వైద్యాధికారులు బోడ బాలాజీ, తాటికొండ శ్రీకాంత్ సేవలను ప్రస్తుత మండల ప్రాథమిక వైద్యాధికారిని వేముల స్రవంతి కొనసాగిస్తూ మండల ప్రజల చేత శభాష్ అనిపించుకుంటూ ముందుకు సాగుతున్నారు. వైద్య సిబ్బందితో గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలను కూడా నిర్వహిస్తున్నారు. కానీ ప్రభుత్వం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పూర్తిస్థాయిలో మందులను మాత్రం సరఫరా చేయటం లేదు. ఈ కొరత మాత్రం మండల సిబ్బందిని వేధిస్తుంది.

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జిల్లా స్థాయిలోనే శ్రీకాంత్ మంచి పేరు తీసుకువచ్చి జిల్లా ఉత్తమ వైద్యాధికారిగా కూడా అవార్డులు పొందారు. పీజీ కోసం ఆయన బదిలీపై వెళ్లిపోయారు. శ్రీకాంత్ సేవలను వేముల శ్రవంతి కొనసాగిస్తుంది. ప్రతిరోజు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపి 150 నుంచి 200 వరకు నడుస్తుందంటే ఆమె చేస్తున్న సేవలు ఏ విధముగా ఉన్నాయో అర్థమవుతుందని మండల ప్రజలు అంటున్నారు. ఆమెకు తోడుగా సిహెచ్‌ఓ పెద్దినేని శ్రీనివాసరావు సూపర్వైజర్లు మందా దానయ్య, శ్రీలక్ష్మి, శోభలు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆరోగ్య ఉప కేంద్రాలైన గోవిందాపురం ఎల్‌లో డాక్టర్ కావ్య, కలకోటలో డాక్టర్ ప్రశాంత్, ముష్టికుంట్ల లో డాక్టర్ ప్రియాంక వైద్య సేవలను అందిస్తున్నారు. ఈ మూడు కేంద్రాల్లో ఓపి కూడా వైద్యులు చూస్తున్నారు. చిరునోముల పల్లె దవాఖానలో ప్రియాంక, మోటమర్రిలో సింధు, పెద్దబీరవల్లిలో సాయి లక్ష్మి ఓపితో పాటు వైద్య సేవలు అందిస్తున్నారు. స్టాఫ్ నర్స్ ఉదయశ్రీ ఫార్మా సిస్టర్ రాదాలత, గ్రామాలలో ఏఎన్ఎంలు నిత్యం వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రభావం ఎక్కువగా ఉండటంతో అన్ని గ్రామాలలో దాదాపు జులై మొదటి వారం నుంచే గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సీజనాలు ప్రభావం మండలంలోనూ ఉంది. ఏ గ్రామంలోనైనా పరిస్థితి సీరియస్‌గా ఉంటే వెంటనే తన సిబ్బందితో కలిసి అక్కడ ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ వైద్య సేవలను అందిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 10 గంటలకల్లా తాను విధులకు వస్తూనే మిగతా సిబ్బంది అందరినీ కచ్చితంగా సమయానికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం వలన సిబ్బంది కూడా సకాలంలో విధులకు హాజరవుతున్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపి చూస్తూనే అవసరమైన సమయంలో గ్రామాలలోకి కూడా వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ విధంగా మండల ప్రాథమిక వైద్యాధికారిని, పల్లె దవాఖాన వైద్యులు, ఏఎన్ఎంలు, సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ శ్రీకాంత్, బాలాజీ సేవలను కొనసాగిస్తూ తమదైన ముద్ర వేసుకుంటున్నారు. తమ శక్తి మేరకు రోగులకు వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ మందుల కొరత వారిని ఇబ్బందులకు గురిచేస్తుంది. ఇది ప్రభుత్వం చేయవలసిన పని. అదే విధంగా మోటమర్రి, గోవిందాపురం ఎల్, పెద్దబీరవల్లి గ్రామాలలో మొదటి ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో ఈ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఐదారు గ్రామాల్లో డెంగ్యూ కేసుల నమోదు అయినప్పటికీ అవి అదుపులోనే ఉన్నట్లు మండల వైద్యాధికారిని స్రవంతి తెలిపారు. వారికి ఎటువంటి ప్రాణహాని లేదని స్పష్టం చేశారు. ప్రతిరోజు వారిని ప్రత్యేకంగా సిబ్బంది పర్యవేక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు.





నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మంత్రి నగరంలోని 18వ డివిజన్‌లోని సీతారామ నగర్లో రూ.135 లక్షల వ్యయంతో నిర్మించనున్న స్మార్ట్ వాటర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు నాణ్యతతో, నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ పునకొల్లు నీరజ, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హామీలు అమలు చేయాలి

- నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలి
- జూలై 2023 నుండి పిఆర్‌సి వర్తింపజేయాలి
- సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి
- టిఎస్ యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు

నవతెలంగాణ-వైరాటౌన్

తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగులో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, జూలై-2023 నుండి తెలంగాణ రెండవ పిఆర్సిని అమలు చేయాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక గురుకుల పాఠశాలలను శుక్రవారం సందర్శించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని, ఉద్యోగుల పెండింగ్ బిల్లులన్నీ చెల్లిస్తామని తెలియజేసిందని, కావున మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను వెంటనే అమలు చేయుటకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎస్‌కు బదులుగా యుపిఎస్ తీసుకురావటం మసిపూసి మారేడు కాయ చేయడమేనని, సిపిఎస్ అంతమయ్యే వరకు యుటిఎఫ్ పోరాడుతుందని, ఓపిఎస్ కొరకు అవిశ్రాంత పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు. సెప్టెంబర్ ఒకటవ తేదీన జిల్లాలో పెన్షన్ విద్రోహదినం సందర్భంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నామని, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. గురుకుల పని వేళలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి విద్యార్థులకు అనుకూలమైన సమయ పట్టిక ఉండేలా ప్రభుత్వం విద్యార్థుల తల్లిదండ్రులు, మేధావుల అభిప్రాయాలు తీసుకొని టైం టేబుల్‌ను మార్చాలని, రాష్ట్ర ఐక్య గురుకులాల కన్వీనర్ దూలం ఎల్లయ్య కోరారు. పాఠశాలలకు ఉచిత కరెంటు సరఫరా చేయుటకు అవసరమైన ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలని, పెండింగ్లో ఉన్న ఇతర సమస్యలన్నింటినీ వేగంగా పరిష్కరించాలని, విద్యా కమిషన్ ఏర్పాటు చేసి, విద్యారంగంలో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో యూటిఎఫ్, గురుకులాల నాయకులు ఎ.సుధాకర్, భాస్కర్ , రామకృష్ణ, రాజేశ్వరరావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



బోనకల్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పెండింగ్ బిల్లులన్నింటిని వెంటనే చెల్లించాలని, నాలుగు డిఏలను మంజూరు చేయాలని,పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, తెలంగాణ రెండవ పిఆర్సి ని జూలై-2023 నుండి అమలు చేయాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక గురుకుల పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, ఐక్య గురుకులాల రాష్ట్ర కన్వీనర్ దూలం ఎల్లయ్య, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూపతి ప్రీతం, గుగులోతు రామకష్ణ నాయకులు పి గోపాల్ రావు, సద్దా బాబు, గురుకుల బాధ్యులు రాజేశ్వరరావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మధిర: తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగులో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కష్ణపురం గురుకుల పాఠశాలలను శుక్రవారం సందర్శించి ఆయన మాట్లాడారు. సమావేశంలో యుటియఫ్ నాయకులు ఇ.వీరయ్య, షేక్.ఇబ్రహీం, కోటేశ్వరరావు, శ్రీదేవి, శాంసన్, మోషే తదితరులు పాల్గొన్నారు.

వైరా గురుకులాన్ని సందర్శించిన సంస్థ రాష్ట్ర కార్యదర్శి

నవతెలంగాణ-వైరా

వైరాలోని తెలంగాణ రాష్ట్ర గురుకుల (బాలికల) పాఠశాలను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాలల సెక్రటరీ రమణ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. రమణ కుమార్ విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలపై సూచనలు చేశారు. అనంతరం పాఠశాల పరిసర ప్రాంతాలను, డార్మెంటరీని, హాస్టల్ వసతులను, పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి రమ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముచ్చర్ల క్రాస్ రోడ్‌లో సమీకృత గురుకులం ఏర్పాటు చేయాలి

- టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి

నవతెలంగాణ-కామేపల్లి

మండలంలోని ముచ్చర్ల క్రాస్ రోడ్‌లో సమీకృత గురుకులం ఏర్పాటు చేయాలని తెలుగు దేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, జిల్లా నాయకులు కర్నాటి అశ్విని కుమార్ డిమాండ్ చేశారు. కామేపల్లిలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 5000 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న 30 సమీకృత గురుకులాలలో ఒకదానిని కామేపల్లి, కారేపల్లి, ఏన్కూర్, రఘునాధపాలెం మండలాలకు కలిపి ముచ్చర్ల క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అత్యంత వెనుక బడిన ప్రాంతమైన కామేపల్లి, కారేపల్లి మండలాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు ఈ ప్రాంతాన్ని అధికారంలో ఉన్న పార్టీలు ఏ మంత్రి కూడా సరిగా పట్టించుకోలేదన్నారు. సగటు మనిషి తలసరి ఆదాయం కూడా జిల్లాలోని మిగతా ప్రాంతాల వారి కన్నా చాలా తక్కువగా ఉందని పేర్కొన్నారు. తరతరాలుగా వివక్షకు గురవుతున్న ఈ ప్రాంతానికి ఈ సమీకృత గురుకులాన్ని కేటాయించి పిల్లలకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- సీఐ తిరుపతి రెడ్డి

నవతెలంగాణ-కామేపల్లి

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ తిరుపతి రెడ్డి అన్నారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నిర్వాహణ కమిటీ సభ్యులకు కామేపల్లి పోలీస్ స్టేషన్ లో ఎస్సై బి. సాయికుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన కారేపల్లి రూరల్ సిఐ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ వినాయక నిర్వాహణ కమిటీ సభ్యులు, భక్తులు వినాయకచవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు ఎటువంటి అలజడులు చేసుకోకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించటం జరుగుతుందని పోలీసు వారికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. చట్టానికి విరుద్ధంగా ఎవరైనా ఎక్కడన్నా అలజడులు సృష్టిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నీటిపారుదల శాఖలో టీఎన్‌జీవోస్ మెంబర్‌షిప్ డ్రైవ్

నవతెలంగాణ-ఖమ్మం

టీఎన్జీవోస్ మెంబెర్ షిప్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం ఖమ్మంలోని నీటి పారుదల శాఖ సీఈ కార్యాలయంలో నిర్వహించారు .ఈ సందర్భంగా టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా కో కన్వీనర్ కొణిదెణ శ్రీనివాస్ ఉద్యోగులకు సభ్యత్వాలు అందజేసి మాట్లాడుతూ టీఎన్జీవోస్ యూనియన్ ఎల్లవేళలా ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తుందన్నారు. అనంతరం ఖమ్మం సీఈ విద్యాసాగర్, ఈఈ వెంకటేశ్వర్లులకు కో కన్వీనర్ శ్రీనివాస్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడహాక్ కమిటీ సభ్యులు జైపాల్, శ్రీధర్ సింగ్, పూసపాటి శ్రీనివాస్, కార్యాలయం సూపరింటెండెంట్ రాంబాబు, వెంకటరమణ, వెంకట్రావు, రాజకుమార్ దుర్గాప్రసాద్, సుజాత, వీణా కుమారి, రాధా, బుచ్చిరాజు పాల్గొన్నారు.

అంకమ్మ గుడిలో దొంగతనం

- 3కేజీల వెండి, 30 గ్రాముల బంగారం ఆభరణాలు చోరీ

నవతెలంగాణ-వేంసూరు

మండల పరిధిలోని వెన్నచేడు వెంకటాపురం అంకమ్మ అమ్మవారి దేవస్థానంలో గురువారం రాత్రి దొంగలుపడ్డారు. మూడు కేజీల వెండి ఆభరణాలు, 30 గ్రాముల బంగారు వస్తువులు చోరీకి గురైనట్లు నిర్వాహకుడు చిలుకూరు సత్యనారాయణ రెడ్డి ఫిర్యాదు మేరకు వేంసూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన ప్రదేశాన్ని ఎస్సై వీరప్రసాద్ పరిశీలించారు.

ఆయుష్ వైద్య విధానం ద్వారా ఆరోగ్య సమస్యలకు పరిష్కారం

- ప్రభుత్వ హోమియో వైద్యులు డి.కృష్ణ

నవతెలంగాణ-కూసుమంచి

వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్య సమస్యలకు ఆయుష్ వైద్య విధానాల ద్వారా సులువైన చికిత్స అందజేయ వచ్చునని ప్రభుత్వ హోమియో వైద్యులు డి .కృష్ణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో ఏర్పాటుచేసిన వృద్ధాప్య వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... వృద్ధాప్యంలో వచ్చే దీర్ఘకాలికమైన వ్యాధులు షుగర్, బీపీ, అస్తమా, మోకాళ్ల నొప్పులు, గ్యాస్ ట్రబుల్, లాంటి వ్యాధులకు సులువైన చికిత్సను ఆయుష్ వైద్య విధానం ద్వారా ఆరోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో వృద్ధ సమస్యలతో బాధపడే 68 మంది ఆయుష్ చికిత్సను అందించారు. అనంతరం తగిన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి బాబునాయక్, మండల వైద్యాధికారి డి.కిషోర్, ఫార్మాసిస్ట్ మాన్ సింగ్, సిబ్బంది రామకృష్ణ, రాధ పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతి విగ్రహం ఆవిష్కరణ

నవతెలంగాణ-కొణిజర్ల

మండల పరిధిలోని పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సరస్వతి విగ్రహాన్ని విద్యార్థుల చేత శుక్రవారం ఆవిష్కరించారు. పెద్దగోపతి పాఠశాలకు గోళ్ళమూడి మల్లికార్జున శర్మ మొదటి టీచర్‌గా నియామకం పొందిన పాఠశాల కావడంతో మల్లికార్జున తల్లిదండ్రులు గోళ్లమూడి వెంకట అప్పారావు సీతారావమ్మల జ్ఞాపకర్థంగా సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మార్క్, గ్రామస్తులు వడ్డే నారాయణరావు, సామినేని చినపుల్లయ్య, మాజీ సర్పంచ్ సామినేని నర్సయ్య, ప్రాథమిక పాఠశాల పెద్దగోపతి ప్రధానోపాధ్యాయులు మేడా నరసింహులు పాల్గొన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు షేక్ రంజాన్, మాదినేని నరసింహారావు, ఎండి ఇస్మాయిల్ కేవీఎల్ నరసింహారావు, కటారి శ్రీనివాసరావు, దేగల గురవయ్య, శ్రీనివాస్, రమేష్, భావ్ సాన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పల్లె దవాఖాన మెడికల్ వైద్యాధికారి వెలసిరి వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-చింతకాని



ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలో లచ్చగూడెం కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులకు జ్వరం, జలుబు, దగ్గు, ఎలర్జీకి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచనలు సలహాలు ఇచ్చారు. దోమల నివారణకు స్ప్రే చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి. వెంకటేశ్వరరావు, సిహెచ్‌ఓ వీరేంద్ర, ఏఎన్ఎం పద్మ, సూపర్వైజర్ నగేష్, ఏఎన్ఎం ఝాన్సీ, ప్రిన్సిపల్ శాంతకుమారి సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో శానిటేషన్ పనులను పర్యవేక్షించిన కమిషనర్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

శానిటేషన్ విజిట్‌లో భాగంగా మున్సిపల్ కమిషనర్ 37, 45 డివిజన్లలో పర్యటించారు. కమర్షియల్ షాప్‌ల నుంచి చెత్త కలెక్ట్ చేస్తున్నారా లేదా ఆ ప్రదేశాల్లో ఎప్పుడు శుభ్రపరుస్తున్నారు అనేది అడిగి తెలుసుకున్నారు. వినోద థియేటర్ రోడ్, పోస్ట్ ఆఫీస్ రోడ్డు, పాత బస్టాండ్ వెళ్లేదారిలో పర్యటించి అక్కడ శానిటేషన్ సిబ్బంది పని చేస్తుండగా వారితో మాట్లాడారు. తడి, పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని చెప్పారు. కాలువలను శుభ్రపరిచేటప్పుడు బూట్లు ధరించాలని, శుభ్రపరిచిన ప్రదేశంలోని షాప్ ఓనర్స్‌తో సంతకాలు సేకరించాలన్నారు. కాలువలను శుభ్రపరిచిన వెంటనే తీసినటువంటి చెత్తను అక్కడ నుంచి తరలించాలని అన్నారు. కాలువలో దోమల నివారణకు బ్లీచింగ్ చల్లాలని చెప్పారు. క్రిస్టల్ బార్ సందులో పర్యటిస్తుండగా అక్కడ కాలువలో మొత్తం ప్లాస్టిక్ గ్లాసులు ఉండగా శుభ్రపరచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశించారు. తక్షణమే క్రిస్టల్ బార్ ఓనర్స్‌కి ఫైన్ విధించాలని అన్నారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడుతున్న వారికి ఫైన్ విధించాలని శానిటరీ సూపర్వైజర్‌కి ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే స్పందించిన అధికారులు బార్ ఓపెన్‌కు రూ.2వేలు ఫైన్ విధించారు.

రుణమాఫీ కానీ రైతుల అరణ్యరోదన

- గత ప్రభుత్వం చేసిన వారికే మళ్లీ ఇప్పుడు మాఫీ
- 2 లక్షల కంటే ఎక్కువ రుణం చెల్లించాలని లింకు పెట్టడంపై రైతుల ఆగ్రహం
- ఈ ప్రభుత్వం ఎవరికి మేలు చేస్తుందని ప్రశ్నిస్తున్న రైతులు

నవతెలంగాణ-కల్లూరు



కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తుందని ఆశతో ఎదురుచూసిన రైతులకు అడియాశలు కావడంతో రైతు బాధ అరణ్య రోదనగా మారింది. 2023 డిసెంబర్‌లో గత ప్రభుత్వం మాఫీ చేసిన రైతులకు మరల 6 నెలలు తిరగకుండానే ఇప్పుడు అదే రైతులకు రుణమాఫీ జరిగినది. అప్పుడు కాని రైతులకు ఇప్పుడు కూడా మాఫీ కాలేదు. అసలు రుణమాఫీ కాని రైతులకు అలానే ఉంచి, ఒక సారి మాఫీ అయిన రైతులకే మరల ఇప్పుడు మాఫీ చేశారని మా పరిస్థితి ఏమిటని రైతులు ఆవేదన చెందుతున్నారు.

గత ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చెయలేదనే కోపం కసితో రైతులు తమకు ఉన్న ఓటు అనే వజ్రాయుధంతో గంపగుత్తగా కాంగ్రెస్‌కు ఓట్లు వేసి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకునివచ్చారు. అయిన కూడా రుణమాఫీ విషయంలో మాకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబంలో భార్యాభర్తలకు రేషన్ కార్డు ఉండి పొలం పాసుబుక్ ఉండి భర్త పేరున 2 లక్షలు భార్య పేరున 1.50 లక్షలు రుణం తీసుకున్నారు. ఇద్దరికీ కలిపి రుణం మొత్తం 3.50 లక్షలు, కుటుంబంలో ఒకరికి 2 లక్షలు మాఫీ చేస్తే సరిపోతుంది. కానీ వారి పేరున ఉన్న 1.50 లక్షలను కూడా బ్యాంక్ లో చెల్లించమనటం రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. కుటుంబంలో ఎంత మందికి అప్పు ఉన్న కుటుంబంలో ఒకరికి మాఫీ చేస్తే రైతులకు ఈ బాధలు ఉండవని, ఎవరికి చెప్పుకోలేక రైతులు కుమిలిపోతున్నారు. రుణమాఫీతో సంబంధం లేకుండా కుటుంబంలో భార్యాభర్తలు ఇరువురు తమ ఖాతాలను 2024 జూన్ నెలలో రెన్యువల్ చేయించుకున్నారు. 2025 జూన్ నెల వరకు ఆ రెండు ఖాతాదారులకు బ్యాంక్‌కి రుణం చెల్లించే గడువు ఉన్నది.

భార్యాభర్తలలో ఒకరికి 2 లక్షలు రుణమాఫీ చేస్తే నేరుగా రైతు అకౌంట్ లో జమ చేసి రైతులకు బ్యాంకులు నగదు ఇస్తున్నాయి. రైతులు ముందుగానే రెన్యువల్ చేసి ఉన్నందున కుటుంబం లో రెండో వ్యక్తి పేరు మీద ఉన్న అప్పు 1.50 లక్షలు కూడా రుణమాఫీ తో సంబంధం లేకుండా ముందుగానే అప్పును 2024 జూన్ లో రెన్యువల్ చేయించుకున్నారు. బ్యాంకులకు బకాయి అనే ప్రసక్తే ఉండదు. ఇందులో ఇంత నిజాలు కనిపిస్తున్న కూడా బ్యాంకులు రుణమాఫీ కానీ వారి పేరున ఉన్న బకాయిని చెల్లించమనటం, బ్యాంకులకు మేలు చెయ్యటానికి మాత్రమే ఉపయోగపడుతుందని రైతులు ఎవరికి చెప్పుకోలేక ఆవేదన చెందుతున్నారు. జూన్ నెలలోనే రెన్యువల్ చేయించుకున్న రైతులను మరలా రెండు నెలలకే మాఫీ కానీ వారిని కూడా అప్పు చెల్లించమనటం దారుణం అని రైతులు అంటున్నారు. కుటుంబంలో ఎంత మందికి అప్పు ఉన్న ఒక ఖాతాకు రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు అందరికీ న్యాయం జరుగుతుందని అంటున్నారు. గ్రామాలలో కొంతమందికి మాఫీ చేసి కొంత మందికి చేయకపోవటం వల్ల ప్రభుత్వానికి మేము గంపగుత్తగా ఓటు వేసి గెలిపించటమేనా మేము చేసిన తప్పు అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి రైతు కుటుంబంలో ఒకరికి అయిన రుణమాఫీ వర్తింపచేయలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కుటుంబ నిర్ధారణ పేరుతో కాలయాపన చేయడమే తప్పా, రైతులకు మేలు జరిగే అవకాశం లేదని ఆరోపిస్తున్నారు. రైతుల బాధలు అర్థం చేసుకుని ప్రభుత్వం బకాయి చెల్లింపులతో సంబంధం లేకుండా రెండు లక్షలు రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కల్లూరు మండలంలో రుణమాఫీ నిర్ధారణకు కోసం 3036 పేర్లు జాబితా పంపించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రోజుకు 100 కుటుంబాలను నిర్ధారణ చేయడమే కష్టంగా ఉంది. ఆ విధంగా 3036 మందిని నిర్ధారణ చేయాలంటే వారు 30 నుండి 40 రోజులు సమయం పడుతుంది. ఇది కాలయాపన కాదంటారా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. రెండు లక్షల రుణమాఫీ నిబంధనలతో సంబంధం లేకుండా ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సమాజ భాగస్వామ్యంతోనే ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి

- ఉద్యోగ విరమణ అనంతరం కూడా సామాజిక సేవ చేయాలి
- టీఎస్ యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు

నవతెలంగాణ-బోనకల్



ఉద్యోగ విరమణ అనంతరం కూడా సామాజిక స్పృహతో సమాజానికి సేవ చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని ఆళ్ళపాడు ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న టీఎస్ యుటీఎఫ్ నాయకులు ఎంసిఆర్ చంద్ర ప్రసాద్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీలత అధ్యక్షతన శు క్రవారం జరిగింది. ఎంసీఆర్ చంద్రప్రసాద్ భాగ్యలక్ష్మి దంపతులను టీఎస్ యుటీఎఫ్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఆళ్లపాడు ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీలత ఉపాధ్యాయులు కూడా శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ సమాజం భాగస్వామ్యంతోనే ప్రభుత్వ విద్యారంగం విరిజిల్లుతుందని, ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఉపాధ్యాయ, ఉద్యోగులు సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఉద్యోగ విరమణ పొందిన రోజే వారికి రావలసిన ప్రయోజనాలను ప్రభుత్వం ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. ఎంసీఆర్ చంద్ర ప్రసాద్ వారి సర్వీస్ కాలంలో అనేకమంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరే విధంగా కృషి చేశారని అభినందించారు. మండల ఇన్చార్జి విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మండల నోడల్ అధికారి దామాల పుల్లయ్య మాట్లాడుతూ యంసిఆర్ చంద్ర ప్రసాద్ సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయునిగా ఉద్యోగంలో జాయిన్ అయి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయం అని అన్నారు. వారి కుటుంబ సభ్యులందరూ ప్రభుత్వ విద్యారంగంలో ఉపాధ్యాయులుగా పనిచేయడం ఆదర్శనీయమని అన్నారు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి యంసిఆర్ చంద్రప్రసాద్ చేసిన సేవలు వెలకట్టలేనిది అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, జిల్లా నాయకులు సద్దా బాబు, పి గోపాల్ రావు, జిల్లా కోటయ్య, చిన్న రంగారావు, కే.సౌభాగ్యలక్ష్మి, పిఆర్‌టియు మండల అధ్యక్షులు కొనకంచి రామ్మోహన్, ఎం.రవికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలత, ఆళ్ళపాడు మాజీ సర్పంచ్ మర్రి తిరుపతిరావు, మరీదు బరకయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ నాగలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు వీరభద్ర స్వామి, సిహెచ్ వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, రవికిరణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డ్ లేని రైతులు సద్వినియోగం చేసుకోగలరు

- వ్యవసాయ జిల్లా అధికారి పుల్లయ్య

నవతెలంగాణ-కూసుమంచి



రేషన్ కార్డు లేని రైతులందరూ షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల రైతులు సంబంధిత తేదీలలో ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డు మొదలగు పత్రాలతో రైతులు హాజరై ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీలో భాగంగా రేషన్ కార్డు లేని రైతుల కుటుంబ నిర్ధారణ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డు లేని రైతులందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల రైతులు సంబంధిత తేదీలలో ధ్రువీకరణ పత్రము రేషన్ కార్డు జిరాక్స్, ఆధార్, తదితర పత్రాలతో హాజరుకావాలని సూచించారు. అదేవిధంగా ఏఈఓలకు పంట నమోదు కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి డివిజన్ ఏడిఏ సరిత, మండల వ్యవసాయ అధికారిని రామడుగు వాణి, టెక్నికల్ ఏవో అరుణ, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రియాంక, రవీందర్, మానస, రవికుమార్ పాల్గొన్నారు.

పోలియో తరహాలో తలసేమియాపై అవగాహన అవసరం

- చిన్నారులకు అండగా పోలీసులు, వైద్యులు
- సంకల్ప స్వచ్ఛంద సంస్థ సేవలు వెలకట్టలేనివి
- వార్షికోత్సవ వేడుకల్లో అడిషనల్ డీసీపీ సిటీసి ఖమ్మం ఇ.విజయబాబు, డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌గౌడ్
- ఘనంగా సంకల్ప స్వచ్ఛంద సంస్థ 14వ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం



దేశంలో పోలియో నిర్మూలన కోసం అవగాహన కల్పించిన విధంగా తలసేమియా వ్యాధిపై అవగాహన అవసరమని, దీనికోసం సమాజమంతా ఏకమవ్వాలని అడిషనల్ డీసీపీ సిటీసి ఇ.విజయబాబు, డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవాసంస్థ 14వ వార్షికోత్సవ వేడుకలను ఖమ్మంలోని ఓ హెూటల్‌లో ఘనంగా నిర్వహించారు. సంకల్ప స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు పి.అనిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ విజయబాబు మాట్లాడుతూ ఒకప్పుడు పోలియో వ్యాధి ఉధృతంగా ఉండేదని, ఇప్పుడు ఒక్క కేసు వచ్చినా తెలిసిపోతుందన్నారు. పోలియో వ్యాధి ఎలా నిర్మూలమైందో..అందరూ చేయి చేయి కలిపి పోరాడితే తలసేమియా వ్యాధిని కూడా అరికట్టవచ్చునన్నారు. తన వద్దకు ఎవరైనా పెళ్లి కార్డు తీసుకొస్తే ముందు తలసేమియాకు సంబంధించిన టెస్టులు చేయించుకోమని సలహా ఇస్తానని తెలిపారు. తలసేమియా చిన్నారులకు సంకల్ప సంస్థ అందిస్తున్న సేవలను గత కొన్నేళ్లుగా దగ్గరగా చూస్తున్నానన్నారు. వ్యాధి నిర్మూలనకు, చిన్నారులను రక్షించుకునేందుకు సంస్థ సభ్యులు పడుతున్న కష్టం ఎనలేనిదని కొనియాడారు. ఈ సంస్థ నిర్వహణకు వైద్యుల సహకారం ఎంతో అవసరమని, వైద్యులు అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని దిగ్విజయంగా 14 ఏళ్లు స్వచ్ఛంద సంస్థను నిర్వహించారని కొనియాడారు. చిన్నారులకు అవసరమైన రక్తదాన శిబిరాలను పోలీస్ శాఖ ద్వారా ఏర్పాటు చేస్తామని తెలిపారు. చిన్నారులకు రక్తదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాను ఒక పోలీస్ అధికారిగా కంటే తాను ఒక సంకల్ప స్వచ్ఛంద సంస్థ సేవకుడిగా పాల్గొనేందుకు వచ్చానని పేర్కొన్నారు. డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ పోలీసులతోపాటు వైద్యులు కూడా తలసేమియా చిన్నారులకు అండగా ఉంటామన్నారు. రక్త కొరత ఏర్పడినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి కూడా చిన్నారులకు రక్తం ఇచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. తీరికలేని సమాజంలో తలసేమియా చిన్నారుల కోసం సంకల్ప చేస్తున్న సేవలు అద్భుతమైనవన్నారు. తలసేమియా చిన్నారులకు సేవలు అందించేందుకు తామూ భాగస్వాములం అవుతామని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులతో కేక్ కట్ చేయించారు. అనంతరం తలసేమియా చిన్నారులను తమ నత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ ఎన్.నర్సయ్య, వైద్యులు నారాయణమూర్తి, రాంప్రసాద్, గణేష్, అనురాధ, సంకల్ప స్వచ్ఛంద సేవాసంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, కోశాధికారి పి.రవిచందర్, ఉదయ్‌భాస్కర్, వంశీ కిరీటి, ఎన్.ఉపేందర్, నాగేశ్వరరావు, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామకృష్ణ విద్యాలయంలో సాంప్రదాయంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు

నవతెలంగాణ-ఖమ్మం

సాంప్రదాయాలకు నిలయం అయినటువంటి శ్రీ రామకృష్ణ విద్యాలయంలో ప్రతీ సంవత్సరంలాగానే సామూహిక వరలక్ష్మి వ్రతం రెండు వందలకు పైగా ముత్తైదువలతో ఘనంగా పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పూజా సామగ్రి, తీర్థ ప్రసాదాలు అన్నీ పాఠశాల వారే ఏర్పాటు చేసి సంప్రదాయంగా జరిపించారు. శ్రావణ మాసంలోని ఆఖరి శుక్రవారం ముత్తైదువులు అందరూ పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా శ్రీ కరి స్వర్ణలత వచ్చిన మహిళలకు శ్రావణ శుక్రవారం గురించి, వరలక్ష్మి వ్రత వైభవం గురించి, మన హిందూ సాంప్రదాయాల గురించి తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానాచార్య సంతోషా గౌతం మాట్లాడుతూ వచ్చిన అందరూ చాలా బాగా ఏర్పాట్లు చేశారని సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విభాగ్ కార్యదర్శి వేమవరపు సుబ్బారావు, కమిటీ సభ్యులు గుంటి అశోక్, మతాజీలు, పోషకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నవరాత్రులు భక్తితో జరుపుకోవాలి

నవతెలంగాణ-మధిర



మధిర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సీఐ మధు, ఎస్సై సంధ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి పండుగను పురస్కరించుకొని, జిల్లాలో గణేష్ విగ్రహాలను ప్రతిష్టించడం మండపాలు ఏర్పాటు చేయదలచిన వారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవడం తప్పనిసరి అన్నారు. ప్రజలు గణేష్ నవరాత్రిని భక్తి, శాంతితో జరుపుకోవాలని, ఎటువంటి అల్లర్లు లేదా గొడవలు జరుగకుండా చూడాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ముసుగులో అసభ్యకరమైన లేదా అనైతిక ప్రదర్శనలు, ఆడవారి డాన్సులు లేదా రికార్డు డాన్సులు నిర్వహిస్తే, నిర్వాహకులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గణేష్ ఉత్సవ సమితులు నవరాత్రి సందర్భంగా జరిగే అన్ని కార్యకలాపాలకు పూర్తి బాధ్యత వహించాలి తెలిపారు.

మహాలక్ష్మి పథకం రూ.2,500లను వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ - బోనకల్

రాష్ట్రంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒకటైన మహాలక్ష్మి పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమైక్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి లతా దేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతితో కలిసి ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ప్రవేశపెట్టిన గృహ జ్యోతి పథకం పూర్తిస్థాయిలో అమలు చేస్తూ, మహాలక్ష్మి పథకం మాత్రం అమలు చేయడం లేదన్నారు. 500 రూపాయలకే గ్యాస్ ఇవ్వడంతో మహిళలకు ప్రతినెల 2500 రూపాయలు ఇస్తానని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. డిసెంబర్ నెల నుంచి ఇప్పటివరకు ఎందరో యువతులు పెళ్లిళ్లు చేసుకున్నారని వారికి రావలసిన కల్యాణ లక్ష్మి పథకం చెక్కుల తోపాటు 10 గ్రాముల బంగారాన్ని వెంటనే అందజేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించడానికి కావాల్సిన స్థలాల సేకరణ చేయడంతో పాటు స్థలాలు ఉన్నవారికి వీలైనంత త్వరలో పథకాన్ని అమలు చేయాలని వారు కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో సమాఖ్య మండల నాయకురాలు ఆకెన రేణుక, వెంగళ లక్ష్మీ పాల్గొన్నారు.

ముత్యాలమ్మను దర్శించుకున్న పొదెం వీరయ్య



నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామంలో తరతరాలుగా వెలిసిన గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ తల్లిని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పొదెం వీరయ్య శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారు ఆలయ మర్యాదల ప్రకారం డప్పులతో స్వాగతం పలికి ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ దేవత విశిష్టతను అడిగి తెలుసుకోవడంతో పాటు అమ్మవారి ఆశీర్వాదాలతో ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని సేవలు అందించే భాగ్యం ఆ తల్లి కలుగజేయాలని అన్నారు. అనంతరం ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దుమ్ముగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బైరెడ్డి సీతారామారావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు చింతిర్యాల రవికుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరమాచినేని వినీల్, నాయకులు పూజారి సూర్యచంద్రరావు, రైతు సంఘం నాయకులు యలమంచి శ్రీనుబాబు, ఆలయ కమిటీ చైర్మెన్ చుక్క గణేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కెల్లా శేఖర్, నటరాజస్వామి, లంక ప్రసాద్, డింగి సందీప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రుణమాఫీ గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

- ఏడీఏ రవికుమార్

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఈ 28 నుండి వచ్చే నెల 10 వరకు మండలంలో నిర్వహించే రుణ మాఫీ గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలని, అర్హత ఉండి రుణమాఫీ జాబితాలో చోటు దక్కని దరఖాస్తుదారులును ఏడీఏ రవికుమార్ కోరారు. శుక్రవారం ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. మండలంలో 1611 దరఖాస్తులను 18 గ్రామాల్లో పరిశీలించడానికి కార్యాచరణ చేపట్టామని అన్నారు. ఈ 28 నుండి 30 వరకు అశ్వారావుపేట (378) రైతు వేదికలో, 31వ తేదీ శనివారం అచ్యుతాపురం (45), సెప్టెంబర్ 1న ఆదివారం నారంవారిగూడెం (133) ఆయా జీపీ కార్యాలయాల్లో, 2వ తేదీ సోమవారం అనంతారం (27) రైతు వేదికలో, ఆసుపాక (21), బచ్చువారిగూడెం (08), దురద పాడు (09), గాండ్లగూడెం (47), 3వ తేదీ మంగళవారం గుమ్మడి వల్లి (23), జమ్మి గూడెం (70), కన్నాయిగూడెం (11), కావడి గుండ్ల (17), నందిపాడు (23) జీపీ కార్యాలయాల్లో, 4వ తేదీ బుధవారం నారాయణపురం (97), 5వ తేదీ గురువారం తిరుమలకుంట (85) రైతు వేదికల్లో, 6వ తేదీ శుక్రవారం ఊట్లపల్లి (52), వినాయక పురం (68) దరఖాస్తులను ఆయా జీపీ కార్యాలయాల్లో, 7 నుండి 10 తేదీ వరకు ఇతర మండలాల దరఖాస్తులు పరిశీలించడం జరుగుతుందని తెలిపారు.

ముంపు ప్రాంతాలను మెట్ట ప్రాంతాలకు తరలించాలి

- ఎమ్మెల్యే పాయంకు వినతి



నవతెలంగాణ-బూర్గంపాడు

గోదావరి వరదల వల్ల ప్రతి సంవత్సరం వరద ముంపునకు గురవుతున్న ప్రాంతాలను మెట్ట ప్రాంతాలకు తరలించాలని సామాజిక కార్యకర్త నల్లమోతు సురేష్, వరద బాధితుల పోరాట కమిటీ నాయకులు ముత్యాల సత్య నారాయణలు అన్నారు. శుక్రవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బూర్గంపాడు మండలంలోని సారపాక గ్రామ పంచాయతీ పరిధిలోని భాస్కర్ నగర్, ఎస్టీ కాలనీ (చంద్ర పుల్లారెడ్డి నగర్) ప్రతి సంవత్సరం వర్షాకాలం వరదలు వచ్చినప్పుడల్ల ముంపుకు గురి అవుతుందని వారు పేర్కొన్నారు. ముంపుకు గురి అవుతున్న ప్రాంతాలను మెట్ట ప్రాంతాలకు తరలించాలని ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఈ కాలనీ వాసులకు మెట్ట ప్రాంతంలో భూములను కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని వారు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద బాధితుల సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని ఆయన హామీనిచ్చారు.

ఎస్సీ వర్గీకరణ సుప్రీం కోర్టు తీర్పు రద్దు చేయాలని రిలే నిరాహారదీక్షలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

స్థానిక భద్రాచలం అంబేద్కర్ సెంటర్ నందు సుప్రీం కోర్టు ఇచ్చినటువంటి ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వర్గీకరణ పోరాట సమితి అధ్యక్షుడు అల్లాడి పౌల్ రాజ్ మాట్లాడారు. అన్నదమ్ములుగా ఉన్న దళితులను విడదీసి రాగ ద్వేషాలు రెచ్చగొట్టి ఉసుగొలిపే ప్రయత్నాలు జరుగుతున్నాయి అని దళితులు మేలుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ముంపు మండలాల ఇన్‌చార్జి దేగల వంశీ మాట్లాడుతూ... మహానుభావుడు బీఆర్ అంబేద్కర్ ఈ దేశానికి యిచ్చినటువంటి రాజ్యాంగాన్ని మార్చే మొత్తం ఎస్సీలకు ఉన్నటువంటి రిజర్వేషన్ తొలగించే కుట్రలో భాగమే ఈ వర్గీకరణ అన్నారు. ఈ కార్యక్రమంలో వర్గీకరణ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అల్లాడి పౌల్ రాజ్, దేగల వంశీ, శివ, సరేళ్ళ వెంకటేష్, శ్రీను, సందీప్, వెంకన్న, రాఘవులు, రామకృష్ణ, కార్తీక్, సత్తిబాబు, సురేష్, వెంకటేశ్వర్లు, ఉప్పెర్ల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్, బస్సు షెల్టర్ నిర్మించాలి

నవతెలంగాణ-జూలూరుపాడు

జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం మెయిన్ రోడ్డు సెంటర్లో పబ్లిక్ టాయిలెట్స్, బస్ షెల్టర్ లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు తంబర్ల నరసింహారావు, భారతీయ గోర్ బంజారా పోరాట సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు బానోత్ దుర్గాప్రసాద్, బిజెపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మూడ్ నాగరాజ్ చౌహాన్ వీరన్న అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రానికి వచ్చే ప్రతి ఒక్కరూ వారి వారి పనులు నిమిత్తం సెంటర్‌కు వచ్చి గంటల తరబడి సెంటర్లో ఉంటున్నారని, అలాంటి వారికి పబ్లిక్ టాయిలెట్స్ లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని అన్నారు. ప్రజల అవసరాలు నిమిత్తం సెంటర్లో పబ్లిక్ టాయిలెట్స్, బస్ షెల్టర్ త్వరగా నిర్మించాలని వారన్నారు. లేని పక్షంలో దశలవారీగా నిరసన కార్యక్రమాలు తెలియజేస్తామని అన్నారు.

10 శాతం లాభాల వాటా చెల్లించాలి



నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి వార్షిక లాభాలలో కాంట్రాక్ట్ కార్మికులకు 10 శాతం లాభాల వాటా చెల్లించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఏరియా పర్సనల్ మేనేజర్ సింగు శ్రీనివాస్‌కి కాంట్రాక్ట్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. సంబంధిత వినతి పత్రాన్ని సింగరేణి చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం (ఐఆర్ఎస్)కి పంపించాలని కోరారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి యస్‌డీ నాసర్ పాషా, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మణుగూరు ఏరియా అధ్యక్షులు అంగోత్ మంగీలాల్ మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు రూ.30 లక్షల ప్రమాద బీమా వర్తింపజేస్తూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో ఒప్పందం చేయటం పట్ల సింగరేణి సీఎండీ ఎన్ బలరాంకి కాంట్రాక్ట్ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ వైద్య సౌకర్యం అమలు చేయాలని మనవి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రెండు పాఠశాలల్లో పర్యావరణ ప్రతిజ్ఞ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండల పరిధిలోని లొద్దిగూడెం, బోడాయికుంట గ్రామాల్లోని ఎంపీపీఎస్‌లలో ప్రపంచ పర్యావరణ సంస్థ (డబ్ల్యుఈఓ) తెలంగాణ స్టేట్ లెవెల్ గ్రీన్ రేంజర్ ఎస్.ఎం.పాష శుక్రవారం పర్యావరణ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు పెంచడం అనేది విద్యార్థులు ఒక అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాల, ఊర్లలో మొక్కలను విరివిగా పెంచడం ఒక బాధ్యతగా తీసుకొని పర్యావరణ పరిరక్షకులుగా మారాలని కోరారు. ఈ పర్యావరణ ప్రతిజ్ఞ అనే కార్యక్రమానికి సహకరించిన రెండు పాఠశాల హెచ్‌ఎంలు నాగు, రామదాసు, టీచర్ సమ్మక్కలకు ఎస్.ఎం.పాషా కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా ఈ పర్యావరణ ప్రతిజ్ఞ అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు షాషా తెలిపారు.

కాసానిని పరామర్శించిన ఎంపీ రఘురాం రెడ్డి



నవతెలంగాణ-సుజాతనగర్

ఇటీవల అనారోగ్యానికి గురై ఖమ్మం హాస్పిటల్ నుండి ఇంటికి వచ్చిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్యను ఖమ్మం పార్లమెంటు సభ్యుడు రామసాయం రఘురాం రెడ్డి శుక్రవారం పరామర్శించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు కాంగ్రెస్ జిల్లా నాయకులు నాగ సీతారాములు, సొసైటీ చైర్మెన్ మండె వీర హనుమంతరావు, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ, మండల కమిటీ సభ్యులు కాట్రాల తిరుపతిరావు, కొండె కృష్ణ, గండమాల భాస్కర్, వీర్ల సత్యం, చింతల శ్రీను, నల్ల గొపు పుల్లయ్య, షణ్ము, రవి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పిల్లలకు ఐటీడీఏ చేయూత

- ఐఐటీ, నీట్, స్పోర్ట్స్‌లో రాణించిన ఒక్కొక్కరికీ రూ.25 వేలు సాయం
- పీఓ చేతులమీదుగా ఆర్థిక సహకారం అందజేత
- బాలికలు ధైర్యంగా ఉంటూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : పీఓ



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం గిరిజన గురుకులంలో చదివి ఐఐటీ నీట్, స్పోర్ట్స్‌లో రాణిస్తున్న పూర్వ, ప్రస్తుత మొత్తం పదిమంది బాలికలు భద్రాచలం ఐటీసీ పీఎస్‌పీడీ ఆర్థిక సహకారానికి ఎంపికయ్యారు. ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున చెక్కులను శుక్రవారం ఐటీడీఏ పీఓ రాహుల్ చేతుల మీదుగా బాలికలకు, వారి తల్లిదండ్రులకు అందజేశారు. భద్రాచలం గిరిజన గురుకుల కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలో పీఓ పాల్గొని ఈ నగదు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ... ఐఐటీ, నీట్, స్పోర్ట్స్‌లో రాణించిన భద్రాచలం గిరిజన గురుకుల బాలికలను ఆయన అభినందించారు. వీరిని ప్రోత్సహిస్తూ ఐటీసీ ఆర్థిక సహకారం అందజేయడం ప్రశంసించదగ్గ విషయం అన్నారు. బాలికలు ధైర్యంగా ఉండి లక్ష్యాన్ని పెట్టుకొని గమ్యస్థానాన్ని చేరుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఐటీసీ పీఎస్‌పీడీ హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీ డి.చంగల్ రావు మాట్లాడుతూ... తమ ఐటీసీ తరఫున చదువులో రాణిస్తున్న పిల్లలను ప్రోత్సహించేందుకు ఇటువంటి ఆర్థిక సహకారాన్ని అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నగదును పిల్లలు సద్వినియోగం చేసుకొని తమ తమ చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో గిరిజన గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి కే.నాగార్జున రావు, భద్రాచలం గిరిజన గురుకుల ప్రిన్సిపాల్ ఏ.పద్మావతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.రమాదేవి, ఐటీసీ భద్రాచలం మహిళా సమితి వైస్ ప్రెసిడెంట్ రేష్మ ప్రణవ శర్మ, సెక్రటరీ ఆల్క ప్రపుల్ల, భద్రాచలం గిరిజన గురుకుల కళాశాల హిస్టరీ లెక్చరర్ తోటమల్ల బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

1న జిల్లా స్థాయిలో నవోదయ మోడల్ పరీక్ష



నవతెలంగాణ-బూర్గంపాడు

గత 19 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం నవోదయలో సీట్లు సాధిస్తున్న బ్రిలియంట్ నవోదయ కోచింగ్ వారి ఆధ్వర్యంలో ఈ సంవత్సరం కూడా 2024-2025 సంవత్సరంలో జరగబోయే నవోదయ మెయిన్ పరీక్ష రాయబోవు విద్యార్థులకు పరీక్షపై అవగాహన కల్పించుటకు ఈ నవోదయ మోడల్ పరీక్షను సారపాక బ్రిలియంట్ నవోదయ కోచింగ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటవ తేదీ ఆదివారం ఉదయం 9:30 నిమిషాలకు బ్రిలియంట్ స్కూల్, కాలేజ్ నందు నిర్వహించనున్నట్లు బ్రిలియంట్ నవోదయ కోచింగ్ చైర్మెన్ బీఎస్‌ఆర్ తెలిపారు. మెంటల్ ఎబిలిటీ, మాథ్స్, లాంగ్వేజ్‌పై ఈ మోడల్ పరీక్ష ఉంటుందని ఈ అవకాశాన్ని ప్రయివేట్, గవర్నమెంట్ స్కూల్‌లలో 5వ తరగతి చదువుతున్న తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని ఆయన పేర్కొన్నారు. ఈ పరీక్షలో మొదటి రెండు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్టు బీఎస్‌ఆర్ తెలిపారు. నవోదయ మోడల్ పరీక్ష రాయబోవు విద్యార్థులు ఒక్కరోజు ముందుగా తమ పేర్లను బ్రిలియంట్ స్కూల్ నందు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు బ్రిలియంట్ స్కూల్ సారపాక సెల్ : 9866283566, 7675040619 సంప్రదించాలని ఆయన తెలిపారు.

సంఘ విద్రోహ శక్తులకు సహకరిస్తే చర్యలు : డీఎస్పీ

- అడవిరామవరంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

సంఘ విద్రోహ శక్తులకు ఎవరైనా సహకరిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్టు ఇల్లందు డీఎస్పీ చంద్రభాను హెచ్చరించారు. ఈ మేరకు మండల పరిధిలోని అడవిరామవరం గ్రామంలో ప్రజలకు ఆళ్ళపల్లి పోలీస్ శాఖ, వైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం చేపట్టారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ హాజరై, మాట్లాడారు. గత వారం గుండాల సీఐ, ఎస్సై గ్రామాన్ని సందర్శించగా ప్రజలకు టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయనే విషయం వారి ద్వారా తెలుసుకొని, నేడు ఆళ్ళపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం అడవి రామవరం ప్రజలకు సోలార్ లైట్స్, పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు. గ్రామంలో అందరూ మంచిగా పని చేసుకొని జీవించాలని చెప్పారు. మీకు ఏ సమస్య ఉన్న పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో గుండాల పోలీస్ స్టేషన్ సీఐ, ఎస్సై రవీందర్, రాజమౌళి, ఆళ్ళపల్లి ఠాణా ఎస్సై ఈ.రతీష్, ఆళ్ళపల్లి పి.హెచ్.సి వైద్యాధికారులు అర్వపల్లి రేవంత్, సంఘమిత్ర, వైద్య సిబ్బంది శ్రీధర్, నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణిలో బదిలీ వర్కర్లకు తీపి కబురు

- 2364 మందిని జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరణకు ఆమోదం
- వీరిలో 243 మంది మహిళలు... త్వరలోనే ఉత్తర్వుల జారీ
- సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ వెల్లడి



నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న 2364 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తున్నట్టు సంస్థ చైర్మెన్, ఎండీ ఎన్.బలరామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలో చేరినప్పటి నుంచి క్యాలెండర్ ఏడాదిలో భూగర్భ గనుల్లో 190 రోజులు, ఉపరితల గనులు, విభాగాల్లో 240 రోజులు విధులు నిర్వహించిన వారిని రెగ్యులరైజ్ చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా డైరెక్టర్ (పర్సనల్)కు ఆదేశాలు జారీ చేశారు. 1 సెప్టెంబరు 2024 నుంచి వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తించబోతున్నట్లు స్పష్టం చేశారు. ఎలాంటి నిరీక్షణ లేకుండా ఏడాదిలో నిర్ణీత మస్టర్లు పూర్తి చేసిన వారిని జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తుండటం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. సింగరేణిలో కారుణ్య, డిపెండెంట్ ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా సంస్థలో చేరిన వారికి తొలుత బదిలీ వర్కర్లుగా సంస్థ నియమిస్తోంది. ఏడాది కాలం పనిచేసిన తర్వాత కనీస మస్టర్లు పూర్తి చేస్తే జనరల్ మజ్దూర్లుగా శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తోంది. ఉన్నత విద్యార్హతలు కలిగిన వీరంతా కంపెనీలో ఇంటర్నల్ ఉద్యోగాల ద్వారా పదోన్నతులు పొందడానికి అర్హత లభిస్తుంది. అలాగే క్వార్టర్ల కేటాయింపులో ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. సింగరేణిలో ఒకేసారి 2364 మందిని జనరల్ మజ్దూర్లుగా ఉద్యోగ ఉన్నతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సంస్థ అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ అంకిత భావం, క్రమశిక్షణతో పనిచేయాలని ఆయన కోరారు.

ఏరియాల వారిగా....

తెలంగాణ రాష్ట్రంలోని 6 జిల్లాల్లో విస్తరించిన ఉన్న సింగరేణి కంపెనీ వ్యాప్తంగా కార్పొరేట్ ఏరియాలో 25 మంది, కొత్తగూడెంలో 17 మంది, ఇల్లందులో 9 మంది, మణుగూరులో 21 మంది, భూపాలపల్లిలో 476 మంది, రామగుండం-1 ఏరియాలో 563 మంది, రామగుండం-2 ఏరియాలో 50 మంది, రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలో 240 మంది, శ్రీరాంపూర్ ఏరియాలో 655 మంది, మందమర్రి ఏరియాలో 299 మంది, బెల్లంపల్లిలో 9 మందిని రెగ్యులరైజ్ చేయబోతున్నారు.

కార్మికుల సమస్యల కోసం ముందుండే సూర్యుడు...

- కోయగూడెం ప్రయివేటీకరణ వ్యతిరేక పోరాటంలో జైలు జీవితం
- 37 ఏండ్లు కార్మికుల కోసం అలుపెరగని పోరాటం
- వై.రామ్మూర్తికి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

నవతెలంగాణ-మణుగూరు

ఉద్యోగ ధర్మాన్ని నిర్వహిస్తూనే నిరంతరం కార్మికుల పక్షాన పోరాటాలు, ఉద్యమాలలో ముందు బాగానే ఉండే సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ అభివృద్ధికి మరియు సీపీఐ(ఎం) పార్టీ నిర్మాణానికి నిరంతరం కృషి చేసిన సింగరేణి నల్ల సూర్యుడు కామ్రేడ్ యర్నాగి రామ్మూర్తి ఉద్యోగ విరమణ సందర్భంగా నవతెలంగాణ ప్రత్యేక కథనం.



సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర సందర్భంగా...



సింగరేణి సీ అండ్ ఎండీ బలరాంతో...

ఉమ్మడి వరంగల్ జిల్లా కురవి మండలం నల్లెల్ల గ్రామంలో వెంకన్న-పిచ్చమ్మ దంపతులకు జన్మించారు. సంక్షేమ హాస్టల్లో పదవ తరగతి పూర్తి చేశారు. ఐటీఐ ఫిట్టర్ పూర్తి చేసిన అనంతరం కొంతకాలం ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తుండగా తన తండ్రి మరణించడంతో కుటుంబ బాధ్యతలు నిర్వర్తించాడు. తమ్ముళ్లకు పెళ్లిళ్లు చేశాడు. వారి అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందించాడు. పోటీ పరీక్షల ద్వారా సింగరేణిలో 1987లో ఉద్యోగం సాధించాడు. ఫిట్టర్‌గా సింగరేణి మొదలైన ఉద్యోగ ప్రస్థానం ఈపీ మెకానిక్‌గా 37 సంవత్సరాలు సిరుల తల్లి సింగరేణిలో ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాడు. రామ్మూర్తికి సతీమణి రాధా, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇల్లందు కోయగూడెం ప్రయివేట్ సర్ఫేస్ మైనర్ వ్యతిరేకంగా 2002లో 45 రోజులు సింగరేణి వ్యాప్తంగా కార్మికులు సమ్మె నిర్వహించారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కార్మికులపై ఉక్కుపాదం మోపింది...అనేక నిర్బంధాలు విధించింది. కార్మికులను, నాయకులను జైలు పాలు చేసింది. దాని ఫలితంగా వై.రామ్మూర్తి వరంగల్ సెంట్రల్ జైల్లో జీవితాన్ని గడిపారు. వారం రోజులపాటు టేకులపల్లి పోలీస్ స్టేషన్లో నిర్బంధించ బడ్డాడు. ఇల్లందు, రామగుండం, బెల్లంపల్లి, మణుగూరు ప్రాంతాలలో ఉద్యోగం నిర్వహించారు. కొత్తగూడెంలో పనిచేస్తున్న సమయంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకాశం స్టేడియంలో బహిరంగ సభ నిర్వహిస్తుండగా స్టేజి పైకి దూసుకువెళ్లి సేవ్ సింగరేణి అంటూ నినాదాలు ఇచ్చామన్నారు. దాని ఫలితంగా అరెస్టులు చేశారని తెలిపారు. ప్రాంతం ఏదైనా కార్మిక పక్షాన క్రియాశీలక పోరాటాలు నిర్వహించాడు. ధర్నాలు, రాస్తారోకోలు, కార్మికుల సమస్యలపై ఏ పోరాటంకైనా సరే అగ్ర బాగాన ఉండేవాడు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. అన్ని ఏరియాలలో ఆఫీస్ బేరర్‌గా పనిచేశారు. కార్మిక వ్యతిరేక విధానాలకు ఉద్యమాలలో పాల్గొన్నారు. ఇల్లందు మండలం సుదిమల్ల సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శిగా పనిచేశారు. చదువు గొప్పతనాన్ని వివరించే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అక్షర దీపం సాంస్కృతిక కళాబృందంలో నాటికలు, గొల్ల సుద్దులు తదితర కళారూపాలు ప్రదర్శిస్తూ కీలక పాత్ర పోషించారు. ఏ ప్రాంతమైనా కొన్ని సందర్భాలలో సింగరేణి యాజమాన్యంకు వ్యతిరేకంగా ఒంటరిగా కార్మిక సమస్యలపై నిలదీసిన రోజులు చాలానే ఉన్నాయన్నారు. అనేక ఛార్జ్ సీట్లు ఇచ్చిందన్నారు. సింగరేణి యాజమాన్యం ఒత్తిడి తెచ్చినప్పటికీ మొక్కవోని దీక్షతో జంకకుండా సింగరేణి సంస్థకు నష్టం రాకుండా నిరంతరం విధులను నిర్వర్తిస్తూ కార్మిక సమస్యలపై పోరాటాల నిర్వహించారు. ఇటీవల మణుగూరుకు వచ్చిన సీఅండ్ ఎండీ బలరాంకు కాంట్రాక్ట్ కార్మికులకు, అప్రెంటిషిప్ చేసే వారికి క్యాంటీన్‌లలో టిఫిన్, భోజనం సదుపాయాలు కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. సిరుల తల్లి సింగరేణి సంస్థ అంటే ఎనలేని అభిమానం. ఇటీవల మహబూబాబాద్‌లో తన సొంత ఇంటికి సిరులు ఇచ్చిన నా సింగరేణి అని పేరు పెట్టుకుని సింగరేణి పై ఉన్న తన అభిమానాన్ని, ప్రేమను చాటుకున్నాడు. నిరంతరం శ్రామికుడిగా, పోరాటాల యోధునిగా, కార్మిక సంఘం అభివృద్ధికి సీపీఐ(ఎం) పార్టీ నిర్మాణానికి ఎనలేని కృషి చేసిన వై.రామ్మూర్తికి పదవీ విరమణ శుభాకాంక్షలు.



స్నేహితుడికి ఆపన్న హస్తం అందించిన తోటి మిత్రులు



నవతెలంగాణ-దుమ్ముగూడెం

తోటి స్నేహితుడికి ఆపద రావడంతో వారి మనసులు చలించింది. తమవంతుగా ఆపన్న హస్తం అందించేందుకు ముందుకు వచ్చారు. చేయి చేయి కలిపారు. స్నేహితుల ద్వారా సేకరించిన సుమారు రూ.13 వేల 330లు శుక్రవారం తన మిత్రుడికి అందజేసి స్నేహమంటే ఇదేరా అంటూ చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే దుమ్ముగూడెం మండలం మంగువాయి బాడువ గ్రామానికి చెందిన పోడియం సురేష్ పూరిల్లు గత మూడు రోజుల క్రితం విద్యుద్ఘాతంతో సర్వం కోల్పోవడంతో పాటు కట్టుబట్టలే మిగిలాయి. దీనపరిస్థితిలో ఉన్న మిత్రుడు పోడియం సురేష్ కుటుంబానికి భరోసాగా నిలిచి ఆర్థికంగా తమ వంతు సహకారం అందించేందుకుగాను 10వ తరగతి బ్యాచ్ చెందిన తోటి స్నేహితులు కలిసి వారు సేకరించిన నగదును సురేష్ కుటుంబానికి అందజేసి ఆర్థికంగా అండగా నిలిచారు. ఆపదలో ఉన్న తోటి స్నేహితుడికి అండగా నిలిచిన స్నేహితులను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు తోట రమేష్, సొందే మల్లు, కోరం మురళి, తునికి నాగరాజు, పాయం కామేష్, సోయం వీరభద్రం, సోయం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తప్పుదోవ పట్టిన ఎరువుల లారీ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

గూగుల్ లో రూట్ మ్యాప్ చూసి వేరే ప్రాంతానికి వెళ్లాల్సిన ఎరువుల లారీ తప్పుదోవ పట్టి ఆళ్ళపల్లి మండలం వైపు వచ్చిన వైనం శుక్రవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. విశాఖపట్నం నుండి ఎరువుల బస్తాలతో వస్తున్న లారీ మంగపేట సమీపంలోని రాజ్ పేట గ్రామానికి వెళుతుండగా గూగుల్ మ్యాప్ చూపిన రూట్‌లో వచ్చి ఆళ్ళపల్లి మండల పరిధిలోని మర్కోడు గ్రామం సమీపంలో గల అడివిలో డ్రైవర్ లోడ్ లారీతో ఇరుక్కున్నాడు. ఆ మార్గం బురదమయమైన మట్టి రోడ్డు కావడంతో ఇరికిన లారీని మర్కోడులోని ఓ జేసీబీ సహాయంతో లాగి రాజ్ పేట గ్రామానికి పంపించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-పినపాక

గేదె అడ్డుగా రావడంతో బైక్‌పై వస్తున్న యువకుడు ఢీ కొని మృతి చెందిన ఘటన మండలంలోని జానంపేట గ్రామంలో ప్రధాన రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే జానంపేట గ్రామానికి చెందిన కట్టం సాయి (22) అనే తన బైక్ పై జానంపేట నుండి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ప్రధాన రహదారిపై గేదె అడ్డుగా రావడంతో బైక్ గేదెను ఢీకొంది. ఈ సాయికి తీవ్రగాయాలు కాగా గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. మణుగూరు ఆస్పత్రికి తరలించే లోపే సాయి మృతి చెందినట్లుగా మణుగూరు 100 పడక ఆసుపత్రి వైద్యులు తెలియజేశారు. మృతుడు మంత్రి సీతక్క కుమారుడు దనసరి సూర్యకు డ్రైవర్‌గా పని చేశాడు. మృతి పై సూర్య ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ పెంచాలి

- సేవాలాల్ సేన రాష్ట్ర కన్వీనర్ హుస్సేన్

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

గిరిజనులకు 12శాతం రిజర్వేషన్ పెంచాలనే కాంగ్రెస్ హామీని నిలబెట్టుకోవాలని సేవాలాల్ సేన రాష్ట్ర కన్వీనర్ భానోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. శుక్రవారం కేటీపీఎస్ గిరిజన ఉద్యోగుల భవన్లో సేవాలాల్ యువసేన జిల్లా అధ్యక్షులు బానోత్ భరత్ నాయక్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బంజారాలను గుర్తించి, మంత్రి పదవి అప్పగించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఓ గిరిజన ఉన్నతాధికారిని నియమించాలన్నారు. ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటైన తండాలలో పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. బంజారాలు పవిత్రంగా జరుపుకునే తీజ్, సీట్లా పండుగలను జాతీయ పండుగగా గుర్తించాలని, ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని పేర్కొన్నారు.

సెప్టెంబర్ 9న చలో హైదరాబాద్

సేవాలాల్ సేన పదవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. సెప్టెంబర్ 9న ఇందిరా పార్క్ హైదరాబాద్ నందు జరిగే గిరిజన సింహగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాలోత్ శివ నాయక్, సేవాలాల్ సేన రైతు జిల్లా అధ్యక్షులు పాపవత్ రాందాస్ నాయక్, ఉపాధ్యక్షులు బట్టు హుస్సేన్ నాయక్, పాల్వంచ, సుజాతనగర్, ఇల్లందు మండలాల అధ్యక్షులు జరుపల పరమేష్ నాయక్, ప్రసాద్ నాయక్, నవీన్ నాయక్, జిల్లా నాయకులు నాయక్, నాగేందర్ నాయక్, కృష్ణ, సురేష్, యోగి, రమేష్‌లు పాల్గొన్నారు.

పెన్షన్ విద్రోహ దినం, నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటాం

- టీజీఈజేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోర్తి జాన్

నవతెలంగాణ-ఇల్లందు

సెప్టెంబర్ 1 ఆదివారం జరగనున్న పెన్షన్ విద్రోహ దినం నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటామని టీజీఈజేఏసీ తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ 475 అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందికొండ వెంకన్న, తోర్తి జాన్‌లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఉద్యోగులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు హక్కుల కోసం టీఎన్జీవో అండ్ టీజీవో ఆధ్వర్యంలో ఏర్పడిన తెలంగాణ ఉద్యోగుల, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికుల, పెన్షనర్స్, సంఘాలతో ఏర్పడిన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నిర్వహించే సెప్టెంబర్ 1న నిరసన కార్యక్రమంలో తమ సంఘ సభ్యులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, జిల్లా స్థాయి నిరసన కార్యక్రమంలో పాల్గొంటామని తెలుపుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్ యూపీఎస్ రద్దు చేయాలని, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం



నవతెలంగాణ-మణుగూరు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మణుగూరు డిపో ఆధ్వర్యంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నేడు నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ కె.శ్యామ్ సుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. శనివారం సాయంత్రం 3గంటల నుండి 4 గంటల మధ్యలో మణుగూరు డిపో పరిధిలోని అశ్వాపురం, మెండికుంట, బయ్యారం, కరకగూడెం తదితర ప్రాంతాల ప్రజలు డిపో అభివృద్ధి, వారికి సౌకర్యవంతమైన ప్రయాణాలు తదితర అంశాల సమస్యల పై సలహాలు, సూచనలు అందించాలని కోరారు. తమ అమూల్యమైన సలహాలు, సూచనలను 9959225963, 7382858121 నెంబర్లకు డయల్ చేయాలని తెలిపారు.

ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మిక తనిఖీ చేసిన పొదెం



నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పొదెం వీరయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సిబ్బంది విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలకు వెనుకాడేది లేదన్నారు. వైద్యులు అందిస్తున్న వైద్య సేవలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. గ్రామపంచాయతీలలో పారిశుధ్య పనుల పట్ల శ్రద్ధ వహించవలసిందిగా మండల అభివృద్ధి అధికారికి తన చరవాణి ద్వారా తెలియజేశారు. పరిసరాల పరిశుభ్రత పై గిరిజన గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించవలసిందిగా ఆదేశించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు చింతిర్యాల రవికుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరమాచినేని వినిల్, మాజీ మండల అధ్యక్షులు లంక శ్రీనివాసరావు, నాయకులు కుంజ శ్రీనివాసరావు, డింగి సందీప్ రెడ్డి, సీరపు అప్పల రెడ్డి, లంక ప్రసాద్, వైద్యాధికారి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి ప్రకటన

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-అశ్వారావుపేట





అశ్వారావుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు చేపట్టేందుకు అర్హుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.గోపి ప్రత్యేక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఇటీవల నవతెలంగాణలో "కళాశాల సరే పోస్టులు మంజూరి ఎపుడు" శీర్షికన కథనం ప్రచురితం అవడం పాటకులకు విదితమే. తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్య కమిషన్ ఉత్తర్వుల ప్రకారం 2024-25 విద్యా సంవత్సరానికి గాను కళాశాలలో ఖాళీగా ఉన్న తెలుగు (01), ఇంగ్లీషు (01), ఎకనామిక్స్ (01), హిస్టరీ (01) పోస్టుకు సంబంధించి అతిథి అధ్యాపకుల నియామకాలు ఈ సెప్టెంబర్ నెల (06-09-2024) శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నడప బడుతున్న డిగ్రీ కళాశాల నందు ఇంటర్వ్యూ పద్ధతి ద్వారా చేపట్టనున్నట్లు తెలియజేశారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ/ఎస్టీ/వికలాంగులు 50% మార్కులు కలిగి ఉండాలని, నెట్/సెట్/పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 2వ తేదీ సోమవారం (02-09-2024) నుండి 4వ తేదీ బుధవారం (04-09-2024) సాయంత్రం నాలుగు గంటల లోపు తమ పూర్తి బయోడేటాతో పాటు జిరాక్స్ సర్టిఫికెట్స్ జత చేసిన అప్లికేషన్‌ను కళాశాలలో సమర్పించాలని తెలిపారు.

ర్యాగింగ్ భావనే అదో మనో వైకల్యం : సీఐ

- జూనియర్‌లకు సీనియర్‌లు ఆదర్శంగా ఉండాలి : ఏడీ
- ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు : ఎస్ఐ

నవతెలంగాణ-అశ్వారావుపేట



ర్యాగింగ్ అనే భావనే ఏదో మనో వైకల్యంతో కూడిన ప్రవర్తన అని, ఆడవారిని మగవారు కానీ, మగవారిని ఆడవారు కానీ ఎవరిని ఎవరు బెదిరించినా, మానసికంగా, శారీరకంగా ఏ విధమైన హింస అయినా ర్యాగింగ్ పద్ధతే అవుతుందని సీఐ కరుణాకర్ తెలిపారు. స్థానిక వ్యవసాయ కళాశాల విద్యార్థులకు కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగంలో శుక్రవారం ర్యాగింగ్ నివారణపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ జే.హేమంత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన కార్యక్రమానికి సీఐ కరుణాకర్ హాజరై ప్రసంగించారు. బెదిరింపు, భయపెట్టడం, కొట్టడం, తిట్టడం, హింసించడం లాంటివి అన్నీ ర్యాగింగ్ పరిధిలోకే వస్తాయని ఆయన వివరించారు. ఎవరు ఎవరి పై ఏ విధమైన ర్యాగింగ్‌కు పాల్పడినా నేరమే అవుతుందని, క్షణికావేశంలో నో లేక తక్షణం ఆనందం కోసం చేసే తప్పిదాలు జీవితాంతం వేధిస్తాయి అని ఎస్ఐ శివరాం క్రిష్ణ తెలిపారు. ర్యాగింగ్ ఫ్రీ కళాశాలగా గుర్తింపును తేవడానికి విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యంపై దృష్టి సారించాలని ఏడీ హేమంత్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్స్ ఓఎస్ ఏ.మధుసూదన్ రెడ్డి, ఐవీ శ్రీనివాసరెడ్డి, గోపాల క్రిష్ణ మూర్తి, నాగాంజలి, ఏవో జయమ్మ, కే.శిరీష, పి.రెడ్డి ప్రియ, టి.శ్రావణ్ కుమార్‌లు పాల్గొన్నారు.

పీఓడబ్ల్యూ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

- అరుణోదయ కళాకారుల ప్రచారం

నవతెలంగాణ-ఇల్లందు

ఆగస్టు 31 సెప్టెంబర్ 1, 2 తేదీలలో హైదరాబాదులో జరుగు పీఓడబ్ల్యూ రాష్ట్ర 7వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం ఇల్లెందు పట్టణంలో కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, ఆమ్ బజార్ మార్కెట్ సెంటర్లలో అరుణోదయ కళాకారులు కళారూపాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకులు ఏనుగుల జానకి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్తీ కోటమ్మ కల్తీ సుభద్ర మాట్లాడారు. ఆగస్టు 31న హైదరాబాద్ నగరంలో వీఎస్టీ సెంటర్ నుండి ఇందిరాపార్క్ వరకు వేలాది మంది మహిళలతో భారీ ప్రదర్శన నిర్వహించి ఇందిరాపార్క్ వద్ద బహిరంగ సభ జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనగంటి చిరంజీవి, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధానకార్యదర్శి కల్తి సుభద్ర, చిన్నారి కళాకారులు పాల్గొన్నారు.

క్వార్టర్ కౌన్సెలింగ్‌లు నిర్వహించకపోతే దీక్షలు చేపడతాం

నవతెలంగాణ-మణుగూరు

క్వార్టర్ కౌన్సెలింగ్‌లు నిర్వహించకపోతే జీఎం కార్యాలయం ఎదుట దీక్షలు చేపడతామని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షులు నాగేల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఏరియాలో జనరల్ క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించక 7 నెలలు గడుస్తుందని ఏరియాలో 100కు పైగా క్వార్టర్‌లు ఖాళీగా ఉన్న కౌన్సిలింగ్ నిర్వహించకుండా అధికారులు కార్మికులను నష్ట పరుస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని, సకాలంలో జనరల్ క్వార్టర్ కౌన్సెలింగ్ నిర్వహించకుండా అశ్రద్ధ చేస్తే కార్మికులను కూడగట్టుకొని జీఎం కారాలయం ఎదుట దీక్షలు చేపడతామని అయన హెచ్చరించారు.



ప్రభుత్వ వైద్యశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు

నవతెలంగాణ-అశ్వాపురం



మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఏజెన్సీ గ్రామాలలో ప్రజలు తీవ్ర విష జ్వరాలతో అల్లాడుతున్నారన్నారు. అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ రకాల రక్త పరీక్షలు చేయకపోవడంతో రోగులు స్థానిక ఆర్ఎంపీలతోపాటు మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం కార్పొరేట్ వైద్యశాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని ఆయన తెలిపారు. ప్రయివేట్ ఆస్పత్రులకు సామాన్య ప్రజలు వెళ్లడంతో రక్త పరీక్షలకే అధిక వ్యాయాయాన్ని వెచ్చిస్తూ డబ్బులు ఖర్చు చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రిన్సిపల్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నలగట్ల

నవతెలంగాణ-అశ్వాపురం



ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన నలగట్ల సత్య ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లోని నోడల్ ఆఫీసు నందు జరిగిన ప్రిన్సిపాల్ జనరల్ బాడీ సమావేశంలో ఆయనకి ఈ అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ఆయనకు నోడల్ అధికారి వెంకటేశ్వర్ రావు, ఫార్మల్ నోడల్ అధికారి శ్రీమతి సులోచన ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. అశ్వాపురం మండల కేంద్రానికి చెందిన ఆయన ఎంతో కష్టపడి అధ్యాపకుడిగా పనిచేస్తూ ప్రిన్సిపాల్ స్థాయికి ఎదిగి ఎన్నో కష్టనష్టాలు కూర్చి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత ఆయనకు దక్కింది అన్నారు. రానున్న రోజుల్లో ఆయన మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆదివాసీ భూముల జోలికి రావద్దు

- ఎమ్మెల్యేకి గిరిజన రైతులు వినతి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఆదివాసీల భూముల జోలికి వెళ్లొద్దని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, దుమ్ముగూడెం మండల కార్యదర్శి కారం పుల్లయ్య అన్నారు. భద్రాచలం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుని శుక్రవారం వారు ఆదివాసీలతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దుమ్ముగూడెం మండలం మారాయి గూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న మారాయిగూడెం, భీమవరం రెండు గ్రామాలకు సంబంధించిన ఆదివాసీ 16 మంది రైతులు గత అనేక సంవత్సరాల నుండి పంటలు వేసి సాగు చేస్తున్నారు. ఆదివాసీ రైతులకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని, సర్వేనెంబర్ 39/పి 16 ఎకరాలు జామాయిల్, పత్తి లాంటి పంటలు వేసి సాగు చేస్తున్న భూములను ఇప్పుడు రెవెన్యూ అధికారులు వచ్చి ఫారెస్ట్ డిపార్ట్మెంట్‌కు రాసి ఇచ్చామని, వాళ్లను భయభ్రాంతులకు గురి చేస్తూ నోటీసులు ఇచ్చి బెదిరించడం సరైంది కాదన్నారు. ఎమ్మెల్యే వెంకట్రావు స్పందించి వెంటనే దుమ్ముగూడెం తహసీల్దార్‌కి ఫోన్ చేసి ఆదివాసీలు సాగు చేస్తున్న భూములను ఫారెస్ట్ డిపార్ట్మెంట్‌కి ఏ విధంగా రాసిస్తారని, ఇది కరెక్ట్ కాదని వెంటనే నిలుపుదల చేయాలని తహల్దార్ దృష్టికి తీసుకు వెళ్లారు. నేను అవసరం అయితే రెవెన్యూ శాఖ మంత్రితో మాట్లాడి ఆదివాసీల సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని, ఆ భూములకు పట్టాలు ఇవ్వాలని మంత్రి దృష్టికి తీసుకుని వెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోంది అర్జున్, సోడి చిన్న వెంకటేష్, సొంది జోగయ్య, రాజు, సరియం చిన్న వీరయ్య, సోడి భద్రయ్య, సోడి పెద్ద వెంకటేష్, రామారావు, కల్లూరి భద్రయ్య, సోందే అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారాన్ని అందించాలి

- ఆశ్రమ పాఠశాలల ఆకస్మిక తనిఖీలో పీఓ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికరమైన ఆహారంతో పాటు వారికి అర్థమయ్యే రీతిలో విద్యా బోధనలతో పాటు వారి ఆరోగ్యం పట్ల సంబంధిత హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. శుక్రవారం భద్రాచలంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని డార్మెటరీ బ్లాకు, కిచెన్, షెడ్లు, కూరగాయలు, పాఠశాల లోపల బయట, తరగతి గదులు, టాయిలెట్లు, బాత్రూంలు, నిర్వహణ, పాఠశాల ఆవరణ సరిగా ఉన్నది లేనిది పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారాన్ని ఆయన పరిశీలించి మెనూ ప్రకారం ప్రతిరోజూ భోజనం పెడుతున్నది, లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వర్షాకాలం నడుస్తున్నందున విద్యార్థినీల పట్ల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు వారి ఆరోగ్య స్థితిగతులను గమనిస్తూ ఉండాలని, వాతావరణం మార్పు వలన సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున పిల్లల ఆరోగ్యములో మార్పులు సంభవిస్తాయని గమనిస్తూ ఉండాలన్నారు. ఎవరైనా పిల్లలు అస్వస్థతకు గురి అయితే వెంటనే వైద్య పరీక్షలు చేయించాలని అన్నారు. పాఠశాలల్లో ముఖ్యంగా విద్యార్థినీలకు ఇబ్బందులు కలగకుండా టాయిలెట్, మంచినీరు, బాత్రూమ్స్, కరెంటు, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. పిల్లలు రాత్రిపూట బయటకు రాకుండా చూడాలని, విషపూరితమైన క్రిమి కీటకాలు పాములు, తేళ్లు సంచరిస్తూ ఉంటాయని సంబంధిత సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. ప్రతిరోజు పిల్లలకు మెనూ ప్రకారం భోజనము అందించాలన్నారు. రాత్రిపూట చదివించడానికి ప్రత్యేకంగా ఉపాధ్యాయులు స్థానికంగా ఉండాలని విద్యార్థినీలకు వారికి సంబంధించిన సబ్జెక్టులలో ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయాలని అన్నారు. 5, 8, 10వ తరగతి విద్యార్థినీలకు గణితం సబ్జెక్టు బోధిస్తున్న అంశాలను ఆయన పరిశీలించి తప్పకుండా విద్యార్థినిలకు పూర్తిస్థాయిలో అర్థమయ్యేలా గణితం బోధించాలని అన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధిస్తున్న బోధన తీరును ఆయన పరిశీలించి సబ్జెక్ట్ టీచర్లు బోధిస్తున్న పాఠాలు అర్థమవుతున్నది లేనిది విద్యార్థినీలను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి పిల్లల చేత కంప్యూటర్లకు సంబంధించి అంశాలను పరిశీలించి ఐదవ తరగతి పిల్లల చేత గణితంలోని అంశాలను విద్యార్థినీల చేత చెప్పించి ప్రతి పిల్లలకు తప్పనిసరిగా గణితం సబ్జెక్టులో కూడికలు, తీసివేతలు, గుణకారాలు, బాగాహారాలు, ఎక్కాలు బోర్డుపై రాయించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణ చుట్టు ప్రతిరోజు శుభ్రం చేయాలని అందుకు హెచ్ఎం వార్డెన్లు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుభద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులను సీనియర్ సిటిజన్స్ ఉపయోగించుకోవాలి

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి

నవతెలంగాణ-ఇల్లందు



సీనియర్ సిటిజన్స్ రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి తెలిపారు. స్థానిక గోవింద్ సెంటర్‌లో గల పెన్షనర్ల భవన్ నందు శుక్రవారం న్యాయ చైతన్య సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్ వృద్ధాప్యంలో ఎదుర్కొంటున్న సమస్యలు ముఖ్యంగా వారి పిల్లలు ఆర్థిక స్తోమత ఉండి పోషించలేని క్రమంలో సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకున్నట్లయితే వారు దరఖాస్తును స్వీకరించి ఎంక్వయిరీ చేసి కమిటీని నియమిస్తుందని తెలిపారు. అంతేకాకుండా న్యాయ సేవ సంస్థ ఆశ్రయించినట్లయితే దరఖాస్తులు స్వీకరించి ఉచిత న్యాయ సేవ ద్వారా సత్వర పరిష్కారం అందిస్తామని తెలిపారు. సెక్షన్144 భారతీయ న్యాయ సురక్ష సంహిత ద్వారా మనోవర్తి పొందవచ్చని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కీర్తి కార్తిక్, మోదుగు వీరేంద్రబాబు, రిటైర్డ్ ఎంఈఓ స్వామి దాస్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రూ.22 వేల విలువగల టొబాకో, అంబర్ ప్యాకెట్లు పట్టివేత

నవతెలంగాణ-దుమ్ముగూడెం :

తెలంగాణ రాష్ట్రంలో నిషేధించబడిన రూ.22 వేల విలువగల టొబాకో, అంబర్ ప్యాకెట్లను దుమ్ముగూడెం పోలీసులు శుక్రవారం స్వాధీనపర్చుకున్నారు. పోలీసులు ములకపాడు సెంటర్లో వాహన తనిఖీలు చేస్తుండగా మారుతి సుజుకి సూపర్ క్యారీ ట్రాలీలో పొగాకుతో తయారు చేయబడిన అంబర్ ప్యాకెట్లు 560, వి-1 టొబాకో ప్యాకెట్స్1560, జెకె నెంబర్ 3320 టొబాకో ప్యాకెట్లుతో వెళుతున్న వాహనాన్ని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 22 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. అట్టి వాహనం పాల్వంచ పట్టణానికి చెందిన ముక్కా శశాంక్‌గా పోలీసులు గుర్తించారు. ఎస్సై గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ హయాంలోనూ రాజకీయ జోక్యం యథాతదం

- గుర్తింపు సంఘ ధృవపత్రం జారీకి మోకాలడ్డుతున్నది ఎవరు..?
- నాలుగేళ్ళ కాలపరిమితితో గుర్తింపు పత్రం జారీ చేయాలి
- విలేకర్ల సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య

నవతెలంగాణ-కొత్తగూడెం



బీఆర్ఎస్ ప్రభుత్వంకు తీసిపోని విధంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సింగరేణి సంస్థపై ఆధిపత్యం చెలాయిస్తూ రాజకీయ జోక్యానికి పాల్పడుతోందని, ఈ విధానం సింగరేణి సంస్థ మనుగడకు ప్రమాదకరంగా మారిందని సింగరేణి గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కేంద్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కోరిమి రాజ్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం కొత్తగూడెం శేషగిరిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర పాలకులు సింగరేణి సంస్థను దోచుకోవడమే ధ్యేయంగా పెట్టుకున్నారని, సొమ్మొకరిది సోకొకరిది అన్న చందంగా పాలకులు వ్యవహరిస్తున్నారని ఆరపించారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాలకు, కార్మిక వాడల అభివృద్ధికి, కార్మిక కుటుంబాల సంక్షేమానికి వినియోగించాల్సిన సియస్ఆర్ నిధులను దారి మళ్లించుకుటూ సంస్థకు, కార్మికులకు ద్రోహం చేస్తున్నారన్నారు. ఎన్నికలు జరిగి ఎనిమిది నెలలు కావస్తున్నా గుర్తింపు ధృవపత్రం అందించడంలో యాజమాన్యం మీనమేషాలు ఎందుకు లెక్కిస్తోందని ప్రశ్నించారు. ధృవపత్రం జారీకి మోకాలడ్డుతున్నదెవరని ప్రశ్నించారు. నాలుగేళ్ల కాలపరిమితితో గుర్తింపు పత్రం అందించాలని డిమాండ్ చేశారు. టిబిజికెఎస్ సంఘానికి ఆరేళ్ళు గుర్తింపు హోదాను కొనసాగిస్తే నోరుమెదపని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు ఏఐటీయూసీకి రెండేళ్ల కాలపరిమితి ఇస్తామంటే సంబరపడటం సరైంది కాదన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో నాయకులు మిర్యాల రంగయ్య, కె.సారయ్య, కె.వీరభద్రయ్య, వైవి.రావు, ముస్కె సమ్మయ్య, వంగ వెంకట్, రాంగోపాల్, గట్టయ్య, రమణమూర్తి, కిష్టాఫర్, రాములు, రాము తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- గణేష్ మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి
- ఎస్పీ రోహిత్ రాజు

నవతెలంగాణ-కొత్తగూడెం



గణేష్ నవరాత్రులను దృష్టిలో పెట్టుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించేందుకుగాను జిల్లా పోలీస్ శాఖ తరపున గణేష్ నవరాత్రి మండపాల నిర్వహకులకు ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గణేష్ మండపాల నిర్వహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ముందుగా నిర్వహకులు తాము ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం తేదీ, ప్రదేశం మొదలైన సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్సైట్ ద్వారా మండపాల నిర్వహకులు పూర్తి వివరాలను నమోదుచేసుకోని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్లైన్ ద్వారా అనుమతులు జారీచేస్తారని తెలిపారు. గణేష్ మండపాలను ఎవరికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి, మండపాల కొరకు విద్యుత్ శాఖ వారి అనుమతితోనే కనెక్షన్ తీసుకోవాలని తెలిపారు. నాణ్యత గల వైరును ఉపయోగించాలి, గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు,మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయాలి, సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలి, గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, లక్కీ డ్రాలు నిర్వహించడం, అసభ్యకరమైన నృత్యాల ఏర్పాటు, అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం, పాటలు పాడటంపై పూర్తిగా నిషేధం విధించినట్లు తెలిపారు. మండపాల వద్ద అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు, వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 100గాని, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

మత సామరస్యమే మన కర్తవ్యం కావాలి : డీఎస్పీ



ఇల్లందు : వివిధ మతాల సమ్మేళనమే భారతదేశమని మత సామరస్యమే మన కర్తవ్యం కావాలని డీఎస్పి చంద్ర భాను అన్నారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా జిల్లా పరిధిలో గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించేందుకుగాను జిల్లా ఎస్పీ అదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో శుక్రవారం గణేష్ నవరాత్రి మండపాల నిర్వహకులు, రాజకీయ పార్టీలు, మతాల పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్, బీజేపీ, వివిధ మతాల పెద్దలు పాల్గొని ప్రసంగించారు. మతసామరస్యానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం డీఎస్పీ మాట్లాడారు. గణేష్ మండపాల నిర్వహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. శాంతి సమావేశంలో అన్ని మతాలకు చెందిన మతం పెద్దలు, బతుల సత్యనారాయణ, ఎస్ఐ నాగుల్‌మీరాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి : గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ సురేష్ మండల ప్రజలకు పలు సూచనలు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆయన శుక్రవారం మాట్లాడారు. గణేష్ మండపాల నిర్వహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తప్పని తీసుకోవాల్సి వుంటుందన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం పట్టణ, పరిసర ప్రయాణికుల సౌకర్యం, ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ తెలిపారు. ఈనెల 31వ తేదీ శనివారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 3 గంటల వరకు డయల్ యువర్ డీఎం ఫోన్ ఇన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కావున ప్రయాణికులు, ప్రజలు మీ సూచనలు, సలహాలు, ఫిర్యాదులు ఫోన్ నెంబర్ 9959225959కు ఫోన్ చేసి తెలియజేయాలని తెలిపారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

నవతెలంగాణ-దమ్మపేట



ఎటువంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని ఏఐకెఎస్ జిల్లా కార్యదర్శి కలూరి కిషోర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లూరి కిషోర్ మాట్లాడారు. కౌలు రైతులను గుర్తించి నిర్దిష్ట చర్యలు చేపట్టాలని, వ్యవసాయ కార్మికులకు ప్రకటించిన రూ.12వేల జీవన భృతిని వెంటనే అమలు చేయాలని అన్నారు. సెప్టెంబర్ 2న కలెక్టరేట్ ఎదుట జరుగు ప్రదర్శన ధర్నాకు రైతుకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అమర్లపూడి రాము, పండూరి వీరబాబు, కురసం ముత్యాలరావు, వాడె గిరి, కీసరి వెంకటేష్, ఉప్పునూరి వెంకటేశ్వరావు, ముక్తేశ్వరి, నాగరాజు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : రైతు రుణాలను ఎలాంటి షరతులు లేకుండా బేశరత్తుగా రెండు లక్షల వరకు మాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలని, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బుర్ర వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఏడీ, ఏవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఏడీఏకు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికైనా వెంటనే తమ వాగ్దానాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు లేకపోతే రైతు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయిని రాజు, చాట్ల వెంకన్న, ఇరుప వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : నాడు ఎన్నికల ముందు టీపీసీసీ అధ్యక్షులుగా రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ నేడు సీఎం అమలు చేయాలని, అదే విధంగా షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ యంఎల్-మాస్ లైన్ ప్రజాపంథా పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి వాసం బుచ్చి రాజు నేతృత్వంలో శుక్రవారం తహసీల్దార్, వ్యవసాయ శాఖ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ క్రిష్ణ ప్రసాద్, ఏవో శివరాం ప్రసాద్‌కు మెమోరాండం అందజేసి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐపీకేఎస్ మండల కార్యదర్శి కంగాల కన్నయ్య, మండల నాయకులు కణితి జోగారావు, రాజులు, లక్ష్మడు, వెంకటేష్, కొమరం పెద్ద గంగరాజు, పీవైఎల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తాలిపేరు ప్రాజెక్టుకు మళ్లీ వరద

● 22 గేట్లు ఎత్తి 28748 క్యూసెక్కుల నీరు విడుదల

నవతెలంగాణ-చర్ల

వాతావరణంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో సరిహద్దు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టులోకి మళ్లీ వరద పోటెత్తింది. శుక్రవారం సాయంత్రం వరకు 30136 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్లోకి చేరుకోవడంతో ప్రాజెక్టుకు ఉన్న 25 గేట్ల గాను 22 రెండు అడుగుల మేర ఎత్తి దిగువన ఉన్న గోదావరిలోకి అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు.

ఇండ్లు కాలిపోయిన వారికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

దుమ్ముగూడెం మండలం యర్రబోరు గ్రామంలో పర్శిక కిరణ్ పూరిల్లు కాలిపోయి ఇబ్బందులు పడుతున్న వారికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిత్యావసర వస్తువులు, ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో బొంబోతుల రాజీవ్, భోగాల శ్రీనివాస్ రెడ్డి, భీమవరపు వెంకటరెడ్డి, మామిడి పుల్లారావు, భూక్య రంగ, ఆకుల వెంకట్, రసమళ్ళ రాము, ఆదినారయణ తదితరులు పాల్గొన్నారు.



పర్ణశాలలో సీతమ్మ సాగర్ భూనిర్వాసితుల గ్రామసభ

నవతెలంగాణ- దుమ్ముగూడెం

మండలంలోని పర్ణశాల గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సీతమ్మ సాగర్ భూ నిర్వాసితుల గ్రామసభ ఆర్డీవో దామోదర్ రావు అధ్యక్షతన జరిగింది. ముందుగా సీతమ్మ సాగర్ కరకట్టల నిర్మాణాలతో భూములు కోల్పోతున్న రైతుల వివరాలను అధికారులు వెల్లడించారు. పర్ణశాల గ్రామంలో 18.19 3/4 గుంటలకు అవార్డు ఎంక్వయిరీ నిర్వహించారు. గ్రామానికి చెందిన 41.36 3/4 గుంటలకు గాను రైతుల నుండి అభ్యంతరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్, గిర్దావర్లు లక్ష్మయ్య, కల్లూరి వెంకటేశ్వర్లు, సిసి రామ్ నాయక్, రెవెన్యూ సిబ్బంది, నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలన్నిటిని

కాంగ్రెస్ అమలు చేయాలి

నవతెలంగాణ-జూలూరుపాడు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రావటానికి రైతులకు ఇచ్చిన హామీలన్నిటిని సమగ్రంగా అమలు చేయాలని ఏఐకేఎస్ జిల్లా సహా కార్యదర్శి బానోతు ధర్మ, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజా పంథా) పార్టీ జిల్లా నాయకులు ఏదులాపురం గోపాలరావులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలం పరిధిలోని పాపకొల్లు రైతు వేదిక వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి దీపక్ ఆనంద్‌కి సమస్యలతో కూడిన మెమొరండం ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐకేఎస్ జిల్లా సహా కార్యదర్శి బానోతు ధర్మ, పార్టీ జిల్లా నాయకులు ఏదులాపురం గోపాలరావులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు రాయల సిద్ధు, రైతు సంఘం మండల నాయకులు తోటకూరి నరేష్, ఎన్.నాగేశ్వరావు, పివైఎల్ డివిజన్ కార్యదర్శి బానోతు జగదీష్, భూక్య చంద్రబాబు, రాము, రమేష్ పాల్గొన్నారు.

పెద్ద హరిజనవాడలో హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-జూలూరుపాడు

జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్ద హరిజనవాడ గ్రామంలో శుక్రవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్ళు నొప్పులతో బాధపడుతున్న వారికి చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వర్షాకాలం కావున సీజనల్ వ్యాధులు ప్రభులే అవకాశం ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎఎంఒ రామకృష్ణ, సిహెచ్ఓ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్ఎం ఆశాలు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంపై అభిప్రాయ

సేకరణలో భాగస్వాములు కావాలి

● మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా

నవతెలంగాణ-పాల్వంచ

వక్ఫ్ సవరణ చట్టం-2024 జాయింట్ పార్లమెంట్ కమిటీ నిర్వహిస్తున్న అభిప్రాయ సేకరణలో భాగస్వాములు కావాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. లోక్‌సభలో ప్రవేశ పెట్టబడిన వక్ఫ్ (సవరణ) బిల్లు 2024 బిల్లు వివరాలను లోక్‌సభ వెబ్‌సైట్‌లో ఇంగ్లీష్, హిందీ భాషల్లో పొందుపరచబడి ఉన్నదని, దీనిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, తమ అభిప్రాయాలను ఇంగ్లీష్, హిందీ భాషలలో రాత పూర్వకంగా రెండు సెట్ లను జాయింట్ సెక్రటరీ, రూమ్ నంబర్ 440, పార్లమెంట్ హౌస్ అనెక్స్, న్యూ ఢిల్లీ - 110001 కి లేదా jpcwaqf_lss@sansad.nic అను వెబ్‌సైట్‌కు సెప్టెంబర్ 12 లోపు పంపాలని తెలిపారు. ఈ అభిప్రాయ సేకరణలో ముస్లింలు, ముస్లిం సంఘాలు, ఎన్‌జీఓ, మేధావులు, మసీదు కమిటీ వారు, తమ అమూల్యమైన అభిప్రాయాలను తప్పకుండా తెలియపర్చాలని కోరారు. ఇతర సమాచారం కోసం - 8520860785 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చిరు వ్యాపారులకు రోటరీ

చేయూతనివ్వడం అభినందనీయం

● భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంఖ్వార్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

జీవనోపాధి కోసం రోడ్డుపై కూరగాయలు, పండ్లు, టీ, కాఫీ, టిఫిన్లు అమ్ముకుని జీవనం సాగించే నక్క సుబ్రమణ్యం, ఇనుముల ప్రవీణ్, షేక్ గౌస్య, మణి తదితర చిరువ్యాపారులకు రూ.60 వేల విలువ గల తోపుడు బండ్లను చార్జబుల్ దీపాలను భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంఖ్వార్ చేతులు మీదుగా అందించారు. రోటరీ చేయూతనివ్వడం అభినందనీయం అని అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ రివర్సైడ్ అధ్యక్షులు డా.రమేష బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల తాజా మాజీ గవర్నరు డా. బూసిరెడ్డి శంకర్ రెడ్డి, భద్రాచలం గ్రామ పంచాయతీ కార్యదర్శి చెరుకుమిల్లి శ్రీనివాసరావు, ప్రోగ్రాం చైర్మెన్ రొటేరియన్ ధనికొండ రాఘవయ్య, కార్యదర్శి రొటేరియన్ గంజి సంపత్ పాల్గొన్నారు.



గణేష్ నవరాత్రులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



అశ్వారావుపేట సిఐ కరుణాకర్

నవతెలంగాణ-దమ్మపేట

గణేష్ మండపాల నిర్వాహకులు నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అశ్వారావుపేట సీఐ కరుణాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా దమ్మపేటలో శుక్రవారం జరిగిన సమావేశంలో సిఐ మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వహకులు పోలీసుల అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశానుసారం మేరకు గణేష్ నవరాత్రులను దృష్టిలో పెట్టుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించేందుకుగాను జిల్లా పోలీస్ శాఖ తరపున గణేష్ నవరాత్రి మండపాల నిర్వహకులకు సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. గణేష్ మండపాల నిర్వహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాల్సి వుంటుందని, ఇందుకోసం ముందుగా నిర్వహకులు తాము ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం తేదీ, ప్రదేశం మొదలైన సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. అలా వెబ్‌సైట్ ద్వారా మండపాల నిర్వహకులు పూర్తి వివరాలను నమోదుచేసుకోని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు జారీచేస్తారని తెలిపారు. గణేష్ మండపాలను ఎవరికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, విద్యుత్ శాఖ వారి అనుమతితోనే కనెక్షన్ తీసుకోవాలని, మండపాల వద్ద డిజెలను ఏర్పాటు చేయరాదని అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల్నిద్దరిని హత్యచేసిన ఘటనలో...

తండ్రికి జీవితఖైదు విధించిన కోర్టు

నవతెలంగాణ-సత్తుపల్లి/మధిర

భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్న క్రమంలో కన్న బిడ్డలిద్దరిని తండ్రి గొంతు నులిమి హత్యచేసిన ఘటనలో ఆ తండ్రికి సత్తుపల్లిలోని 6వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు శుక్రవారం జీవితఖైదును విధిస్తూ తీర్పును వెల్లడించింది. ఖమ్మం జిల్లా, మధిర మండలం రాయపట్నం గ్రామంలో పార్శపు శివరామ్ గోపాల్, అతని భార్య మార్తమ్మల మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ క్రమంలో వారి ఇద్దరి పిల్లల్లో కుమారుడు రామకృష్ణ (8), కుమార్తె ఆరాధ్య (6)లను తండ్రి శివరామ్ గోపాల్ 2023, జులై 10వ తేదీన గొంతు నులిమి పిల్లలను హత్య చేశాడు. పిల్లలను భర్త హత్యచేసిన ఘటనపై భార్య మార్తమ్మ మధిర పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై ఐపీఎస్ ట్రైనీ అవినాశ్‌కుమార్ ఈ హత్యలపై విచారణ జరిపారు. ఇదే కేసులో శివరామ్ గోపాల్‌ను రిమాండ్ చేశారు. ఈ కేసును విచారించిన సత్తుపల్లి 6వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి ఎం. శ్రీనివాస్ 36మంది సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో ముద్దాయి శివరామ్ గోపాల్‌కు జీవితఖైదును విధించి జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ఎస్కే అబ్దుల్ బాషా వాదించగా ముద్దాయికి శిక్ష పడేలా ఐపీఎస్ అధికారి అవినాశ్ కుమార్, మధిర సీఐ మధు, కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎస్వీ రామారావు, కోర్టు హెచ్‌జీ బుద్దా శ్రీనివాసరావు సహకరించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన విద్యుత్ సేవలు

ఖమ్మం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎ. సురేందర్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన విద్యుత్ సేవలు అందిస్తున్నామని ఖమ్మం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎ. సురేందర్ పేర్కొన్నారు. సైదీ, సైఫీ విధానం ద్వారా విద్యుత్ అంతరాయాలు కనిష్ట స్థాయికి తీసుకొచ్చామని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. షెడ్యూల్ మెయింటనెన్స్ అంతా యాప్ లో పొందుపరుస్తున్నామని తెలిపారు. తద్వారా అంతరాయాల సమయం తగ్గిందన్నారు. వినియోగదారుల పనులు ఆలస్యం కాకుండా సకాలంలో పూర్తి అవడానికి ఈ -స్టోర్ విధానాన్ని ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. దీనివల్ల క్షేత్ర స్థాయి సిబ్బంది సమయం ఆదా అవుతుందని వివరించారు, త్వరిత గతిన పనులు పూర్తి అవుతున్నాయని తెలిపారు. డిస్కమ్ కు సంబంధించిన ప్రతి సమాచారాన్ని చూసే డాష్ బోర్డు అప్లికేషన్ ను పెంపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు . దీని ద్వారా వర్క్ ఫోర్స్ మేనేజిమెంట్ , అవుటేజ్ మేనేజిమెంట్ సిస్టం , డిమాండ్ సైడ్ మేనేజిమెంట్ , వినియోగదారుల పోర్టల్ , సిటిజన్ మేనేజిమెంట్, మీటర్ డాటా మేనేజిమెంట్,అస్సెట్ మేనేజిమెంట్ సమగ్ర వివరాలు తెలుసుకొనే వీలుంటుందని వివరించారు . బిల్లింగ్ , కలెక్షన్ , అంతరాయాలు . ఫిర్యాదుల వివరాలు కమాండ్ కంట్రోల్ లాగా ఒకటే చోట ప్రతి ఒక్క పూర్తి సమాచారాన్ని తెలుసుకొనే వీలుంటుందని వివరించారు . ఎక్కడ ఎం జరిగిన ఆ సమాచారాన్ని ఇందులో తెలుసుకునే సదుపాయం ఉంటుందని, చాట్ బాట్, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తద్వారా వారి సమస్యలు త్వరిత గతిన పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. సరఫరా వ్యవస్థలో రీయాక్టివ్ పవర్ కాంపన్సేషన్ ద్వారా పవర్ గణనీయంగా మెరుగు పరచడానికి కెపాసిటర్ బ్యాంకులు దోహద పడతాయన్నారు. తద్వారా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ తో పాటుగా టెక్నికల్ నష్టాలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లు , పారిశ్రామిక ఫీడర్లకు లో వోల్టేజ్ వలన మోటార్లు కాలిపోకుండా ఉండేందుకు కెపాసిటర్ బ్యాంకులు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. వర్షాలు, ఈదురుగాలులతో సాంకేతికంగా విద్యుత్ సరఫరా లో సమస్యలు తలెత్తినప్పుడు అన్ని ఫీడర్లకు ప్రత్యామ్నాయ సరఫరా అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. చాలా వరకు 33 కేవీ %ఽ% 11కేవీ ఇంటర్ లింకింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్ లో అన్ని 33 కేవీ %ఽ% 11 కేవీ స్తంభాలకు యూనిక్ పోల్ నెంబర్ పెయింటింగ్ ప్రక్రియను చేపట్టామన్నారు. పోల్ ల వారీగా పెట్రోలింగ్ సులభంగా చేపట్టవచ్చని తెలిపారు. నిర్వహణ ను కూడా ట్రాక్ చేసే వీలుంటుందని అన్నారు. గత తాలుకు అంతరాయాలు , ట్రాన్స్ ఫార్మర్ ల వైఫల్యాలు కూడా ట్రాక్ చేసుకునే సౌల్యభ్యం ఉందని తెలిపారు. ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే ఆ పోల్ నెంబర్ ద్వారా అక్కడి లొకేషన్ మ్యాపింగ్ తెలుసుకొని వెంటనే అక్కడికి వెళ్లి సమస్యను త్వరిత గతిన పరిష్కరించవచ్చని అన్నారు . దీని ద్వారా అంతరాయాల సమయాన్ని గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. ముందస్తు సమాచారం తెలుసుకోవడానికి, సమస్యలు తలెత్తక ముందే గుర్తించడానికి ఎంతో దోహద పడుతుందని వివరించారు.



ప్రతి విద్యార్థి విజన్‌తో పాటుగా...

పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌ను అభివృద్ధి చేసుకోవాలి

- సైకాలజిస్ట్ విజయలక్ష్మి విద్యార్థులకు మోటివేషన్
- విద్యార్థులకు ప్రేరణతో కూడిన అవగాహన ఉండాలి
- సాయిస్ఫూర్తి ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి

నవతెలంగాణ-సత్తుపల్లి

ప్రతి విద్యార్థికి విజన్‌తో పాటుగా పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌ను అభివృద్ధి చేసుకోవాలని ప్రముఖ సైకాలజిస్ట్ వి. విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఇండక్షన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మోటివేషనల్ సదస్సులో విజయలక్ష్మి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఇండక్షన్ ప్రోగ్రాం అనేది క్రమ బద్ధమైన శిక్షణ, కళాశాల లక్ష్యాలను తెలియజెప్పేందుకు ఈ విధంగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతూ ఉంటుందన్నారు. విద్య, ఆరోగ్యం, ఆత్మ విశ్వాసం, వ్యక్తిత్వ వికాసం, మానవీయ విలువలు జీవితాన్ని ఆనందమయం చేస్తాయన్నారు. ప్రిన్సిపాల్ ఊటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ విద్యార్థులు ప్రేరణతో కూడిన అవగాహన కలిగి ఉండాలన్నారు. మనిషి జీవితంలో ఆత్మ సంతృప్తి కోసం విలువైన సమయం, ఆదాయంలో కొంత భాగాన్ని ప్రేమతో కూడిన సేవ కార్యక్రమాల కోసం నిస్వార్ధంగా త్యాగం చేసే వైఖరిని కలిగి ఉండటం మనసుకి తృప్తిని ఇస్తుందని ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి అన్నారు.

దెబ్బతిన్న రహదారుల పరిశీలన

నవతెలంగాణ-సత్తుపల్లి

ఇటీవల కాలంలో మిషన్ భగీరథ వారు నిర్వహిస్తున్న అస్తవ్యస్త పనుల నిర్వహణ కారణంగా పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు అనేక వీధులు ఛిద్రంగా మారాయని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే పట్టణంలో ఛిద్రమైన పలు రహదారులను పరిశీలించారు. చాలాచోట్ల పైప్ లైన్లు లీకయి నీరంతా రోడ్డు పాలై వృధాగా పోతోందన్నారు. మంచిగా ఉన్న రహదారులు మిషన్ భగీరథ కారణంగానే పాడై ఎక్కడ చూసిన గుంటలు దర్శనమిస్తున్నాయన్నారు. రహదారుల్లో ఎక్కడెక్కడ రహదారులు పాడైపోయాయో గుర్తించి తక్షణమే వాటిని బాగుచేయించాలని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ అధికారులను కోరారు.

తూటికుంట్లలో ప్రత్యేక వైద్య శిబిరం

నవతెలంగాణ -బోనకల్

మండల పరిధిలోని తూటికుంట్ల గ్రామ పంచాయతీ కార్యాలయం నందు శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో డ్రై డే కార్యక్రమాన్ని మండల ప్రాథమిక వైద్యాధికారిని వేముల స్రవంతి పరిశీలించి ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో డెంగీ కేసు నమోదు కావటంతో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వెంటనే చర్యలు చేపట్టారు. ప్రజలకు మందులు ఇచ్చి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యం లో ప్రజలు కూడ ఇంటి చుట్టూర, పరిసరాల పరిశుభ్రత పాటించి వారి ఇళ్లల్లో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తగా ఉంచుకోవాల్సిందిగా సూచించారు. వైద్య శిబిరంలో ఎమ్ఎల్‌హెచ్‌పి డాక్టర్ కావ్య, హెల్త్ సూపర్వైజర్ మందా దానయ్య, ఏఎన్ఎం మేరీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఊరూరా హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు

నవతెలంగాణ-పెనుబల్లి

జ్వరాలతో ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని, తక్షణమే గ్రామ గ్రామాన ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి విష జ్వరాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పెనుబల్లి పార్టీ కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడం వలన దోమలు బీభత్సంగా పెరిగిపోయి ప్రజలు జ్వరాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. లంకపల్లి తో పాటుఅనేక గ్రామపంచాయతీలో జ్వరంతో మృత్యువాత పడ్డారన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాలని ప్రత్యేక అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు గాయం తిరుపతిరావు, చలమాల నరసింహారావు, కండే సత్యం, నాగ బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సీఎం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి

నవతెలంగాణ-పెనుబల్లి

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తానన్న మాటలకు కట్టుబడి ఉండాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ కోరారు. శుక్రవారం పెనుబల్లి ఎంఆర్పిఎస్ మండలాధ్యక్షులు గొల్లమందలవినోద్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సపమావేశంలో నాయకులు జొన్నగట్ల వెంకటేశ్వరరావు, జిజార పుల్లయ్య, లింగ పోగు తిరుపతయ్య, కొలికిపోకు ప్రతాప్, జొన్నలగడ్డ బాబురావు, సింగిసాల సామ్రాట్ పాల్గొన్నారు.

చదువు మనిషికి మూడో నేత్ర

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల - ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్స్ ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-పాల్వంచ

చదువు మనిషికి మూడో నేత్రం అని, చదువు లేకుంటే జీవితం అంధకారం అని డీసీఎంఎస్ చైర్మెన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్స్ ప్రారంభం సందర్భంగా ప్రవేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. శుక్రవారం తెలంగాణా ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే 2024-25 విద్యా సంవత్సరపు ప్రవేశాల పోస్టర్‌ను స్థానిక మార్కెట్ ఏరియాలోని స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ చదువుపై ఆసక్తి వుంది, వివిధ కారణాలతో చదువు మధ్యలో ఆపేసిన వారికి, గృహిణులు, పలు రకాల వృత్తి, వ్యాపారములలో వున్నవారు, ప్రమోషన్లు పొందగోరు ఉద్యోగులకు ఓపెన్ స్కూల్ విద్యా విధానం సువర్ణ అవకాశం అని అన్నారు. స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ యాజమాన్యం కొత్వాలను శాలువా, బొకేలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ కోఆర్డినేటర్ భాస్కర్ రావు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ గంగుల శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, కాంగ్రెస్ నాయకులు కోండం వెంకన్న, చింతా నాగరాజు, గంగుల వెంకటేశ్వర రెడ్డి, వెంకటేశ్వర్లు, పాబోలు నాగేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

గాజులతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

నవతెలంగాణ-సత్తుపల్లి

శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్‌లోని శ్రీవిజయదుర్గ అయ్యప్ప ఆలయంలో అమ్మవారిని భక్తులు గాజులతో ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా కుంకుమ పూజలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన రంజిత్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ తుంబురు దయాకర్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ శుక్రవారం అందజేశారు. అన్నారుగూడెం గ్రామానికి చెందిన మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ యాకూబ్ పాషా చొరవతో చెక్కును అందజేశారు,

సదరం స్లాట్‌లను సద్వినియోగం చేసుకోండి

నవ తెలంగాణ-తల్లాడ

సెప్టెంబర్ నెలకి సంబంధించిన సదరం స్లాట్స్ శుక్రవారం ఓపెన్ అయ్యాయని, అవసరమైన వికలాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు. రెన్యువల్ అవసరమైన వారు మీ సేవా సెంటర్లకు వెళ్లి స్లాట్ బుక్ చేసుకోవాల్సిందిగా సూచించారు.

కస్తూర్బాలో పారిశుధ్య పనులు

పర్యవేక్షించిన ఎంపీడీవో

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి కస్తూర్బాగాంధీ విద్యాలయంలో శుక్రవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను చేపట్టారు. విద్యాలయ అవరణంలో చెత్త మొక్కలు, ముండ్ల పొదలు ఉండి దోమలకు నిలయంగా మారాయి. దీంతో చెత్త.. ముండ్ల పొదలను జీపీ కార్మికులు తొలంగించారు. బ్లీచింగ్ చల్లిచారు. మురికి గుంటలలో అయిల్ బాల్స్ వేశారు. పారిశుధ్య పనులను ఇంచార్జీ ఎంపీడీవో రమేష్, జీపీ కార్యదర్శి తిలక్‌కిషోర్‌లు పర్యవేక్షించారు. విద్యార్ధులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తుచర్యలలో భాగంగా పారిశుధ్య పనులు చేపట్టినట్లు తెలిపారు.

రోడ్లపై గుంతలు పూడ్చిన పోలీసులు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



ఖమ్మం-సూర్యాపేట ప్రధాన రహదారి మార్గంలో మండల పరిధిలోని ఆటోనగర్, వరంగల్ క్రాస్ రోడ్, కోదాడ క్రాస్ రోడ్డు ప్రాంతాల్లో రహదారిపై ఏర్పడ్డ గుంతలను పోలీసులు మట్టితో శుక్రవారం పూడ్చి వేశారు. రహదారిపై ఏర్పడిన గుంతల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణకు గాను గుంతలు పూడ్చివేసినట్లు ఖమ్మంరూరల్ పోలీసులు పేర్కొన్నారు.



సీపీని కలిసిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

ఇటీవల ఖమ్మం కమిషనరేట్‌కు బదిలీపై వచ్చిన రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ నాగేశ్వరరావు శుక్రవారం సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలోని వెల్ఫేర్ సెక్షన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

తెలంగాణ రాష్ట్ర బీసీ కార్పొరేషన్

చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌ను కలిసిన 'కందుల'

నవతెలంగాణ - బోనకల్

తెలంగాణ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌ను కాంగ్రెస్ బీసీ సెల్ బోనకల్ మండల అధ్యక్షుడు కందుల పాపారావు శుక్రవారం హైదరాబాదులోని డిఎస్ఎస్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాపారావు ఆయనకు పలు సమస్యలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అర్హత కలిగిన వారికి బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇప్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అర్హత కలిగిన ప్రతి గీత కార్మికులకు అతి కొద్ది రోజుల్లో నూతన పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రమాదవశాత్తూ మరణించిన గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా ఐదు లక్షలకు పెంచినట్లు శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. అదే విధంగా గీత కార్మికులకు ప్రభుత్వమే సబ్సిడీ ద్వారా మోకులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శ్రీకాంత్ గౌడ్‌ను కలిసిన వారిలో పలువురు ఆళ్లపాడు యువ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సర్వే సమర్ధవంతంగా నిర్వహించాలి

కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-వేంసూరు

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుటుంబ నిర్ధారణ సర్వే శుక్రవారం ఆడసర్ల పాడులో ఏవో రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్‌రెడ్డి సర్వేను పరిశీలించి ప్రజా ప్రభుత్వం పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్క రైతుకి రుణమాఫీ అందించేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ సర్వే అని, మండలంలో అర్హత ఉండి రుణమాఫీ పొందని వారు వ్యవసాయ శాఖ అధికారులకు సహకరించి సర్వేలో వివరాలు అందజేయాలని అన్నారు ఏవో రామ్మోహన్ మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలలో కుటుంబ నిర్ధారణ సర్వే ఉంటుందని, ప్రజలు అధైర్యపడవలసిన అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, ఏఈఓలు రైతులు ఉన్నారు.

జల్సాలకు అలవాటు పడి.. దొంగతనాలు

9 మందిని పట్టుకున్న పోలీసులు..

నవతెలంగాణ-పెనుబల్లి

దొంగతనాలతో డబ్బు సంపాదించి జలసాలు చేయొచ్చని భావించిన సూరయ్య బంజర్ తండాకి చెందిన 9 మంది గిరిజన యువకులను పెనుబల్లి పోలీసులు శుక్రవారం పట్టుకొని కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ మేరకు కల్లూరు ఏసిపి రఘు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సూరయ్యబంజర తండాకు చెందిన రవి, భిక్ష నాయక్, టక్రియ, శ్రీహరి, గోపాలస్వామి, గోపాలకృష్ణ, రవీంద్రబాబు, ఎల్లయ్య, ఉపేంద్ర అనే గిరిజన యువకులు రైతుల విద్యుత్ మోటార్లు, ట్రాక్టర్ బ్యాటరీలు, ట్రాక్టర్ టైర్లు, మోటర్ కేబుల్ వైర్లు లంక సాగర్ పరిసర ప్రాంతాల్లో దొంగిలించి వాటిని ఇతర ప్రాంతాలకు చెందిన భూక్యవాళ్య, బానోతు రామకృష్ణ, బుక్య బాలాజీ, గుగులోతు మురళీకృష్ణలకు అమ్మి ఆ సొమ్ముతో జల్సాలు చేసేవారు. తమకు నమ్మదగిన సమాచారంతో వారందరిని విచారించి చోరీకి గురైన వస్తువును రైతులకు న్యాయస్థానం ద్వారా అప్పగించడం జరుగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ ముత్తిలింగయ్య, పెనుబల్లి ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది రాజమల్లు, బి.వెంకటేశ్వరరావు శ్రీనివాసరావు, సురేష్ పాల్గొన్నారు.

సచివాలయంలో సీఎం బిజీ బిజీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డి పలు సమీక్షలు, కార్యక్రమాలతో శుక్రవారం బిజీ బిజీగా గడిపారు. హైదరాబాద్‌లోని సచివాలయం లో ఆయన స్కిల్ యూనివర్సిటీకి సంబంధించిన ప్రాథమిక డిజైన్లను పరిశీలించారు. ఆ డిజైన్లకు ఆర్కిటెక్ట్‌లకు పలు సూచనలు చేశారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ డిజైన్ల విషయంలోనూ సీఎం పలు సూచనలు చేశారు. సూచించిన మార్పులతో వీలైనంత త్వరగా పూర్తిస్థాయి డిజైన్స్ నమూనాను రూపొందించాలని ఆదేశించారు. స్పీడ్‌పై వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. ప్రతిష్టాత్మక వరల్డ్ ఫుడ్ ఫౌండేషన్ టాప్-2024 అవార్డు గ్రహీత డాక్టర్ సమరేందు మొహంతి, ప్రొఫెసర్ జానయ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మతి భానుమూర్తి రచించిన "జయ సేనాపతి" నవలను సచివాలయంలో సీఎం ఆవిష్క రించారు. వీటితో పాటు జానపద కళాకారుడు కుమారస్వామి రచించిన 5 వేల చరణాలతో కూడిన ప్రపంచంలోనే అతిపెద్ద జానపద గీతాన్ని ముఖ్యమంత్రి పుస్తకరూపంలో విడుదల చేశారు.

ఆలయ విస్తరణకు శృంగేరి పీఠం అనుమతి తీసుకోండి

వేములవాడ ఆలయ విస్తరణకు పనులు ప్రారంభించాలనీ, దానికి సంబంధించి శృంగేరి పీఠం అనుమతి తీసుకోవాలని అర్చకులకు సీఎం ఎ. రేవంత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎంను వేములవాడ అర్చకులు కలిశారు. ఆయన్ను ఆశీర్వదించారు. ఆలయ విస్తరణకు రూ.50 కోట్లు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో వినోద్, స్థపతి వల్లినాయగం, ఈఈ రాజేష్, డీఈఈ రఘునందన్, ఆలయ ప్రధాన అర్చకులు ఉమేష్ శర్మ, తదితరులున్నారు. ఆలయ విస్తరణకు సంబంధించిన డిజైన్స్, నమూనాకు శృంగేరి పీఠం అనుమతి తీసుకోవాల్సి ఉందని సీఎం దృష్టికి వారు తీసుకెళ్లారు. వెంటనే ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాలని సీఎం ఆలయ అర్చకులకు సూచించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తాం

అగ్రిగోల్డ్ అంశంపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి హామి ఇవ్వడం పట్ల తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ బాలమల్లేష్. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎన్ సునీత హర్షం వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ సంస్థ ఎక్కువ లాభాలు ఇస్తామని ప్రజలను నమ్మించి డిపాజిట్లను సేకరించి మోసం చేసిందని తెలిపారు. వారికి న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి బాధితుల సంఘం ప్రతినిధుల బృందం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితులు ఐదు లక్షల మంది ఉన్నారనీ, వారి నుంచి ఆ సంస్థ రూ.500 కోట్లను సేకరించిందనీ, తిరిగి చెల్లించే సమయంలో ఆ సంస్థ చేతులెత్తేసిందని సీఎంకు బాలమల్లేష్ వివరించారు. రాష్ట్రంలో ఆ సంస్థకు దాదాపు రూ.1000 కోట్లకుపైగా ఆస్తులున్నాయనీ, వాటిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని వేలం వేసి మోసపోయిన బాధితులకు డబ్బులు చెల్లించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులతో హైపవర్ కమిటీ ఏర్పాటు చేయాలనీ, అగ్రిగోల్డ్ కంపెనీ వ్యవస్థాపక డైరెక్టర్లు, వారి కుటుంబ సభ్యుల బినామీ పేర్ల మీద ఉన్న అన్ని ఆస్తులను తక్షణమే అటాచ్ చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామని హామి ఇచ్చారని తెలిపారు.

కరెంటు పోల్స్‌పై కేబుల్, నెట్ వైర్లు తొలగించండి



- లేకుంటే చర్యలు తప్పవ్...

:ఆపరేటర్లకు టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ హెచ్చరిక

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్లు విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేసుకున్న అనవసర కేబుల్స్, ఇతర వస్తువుల్ని తొలగించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ సీఎమ్‌డీ ముషారఫ్ ఫరూఖి విజ్ఞప్తి చేశారు. లేకుంటే సంస్థ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలపై అడ్డదిడ్డంగా సాధారణ ప్రజలకు ప్రాణాంతకంగా మారిన కేబుల్స్‌ను తొలగించాలని జులై 27, ఆగస్టు 7, 28 తేదీల్లో సమావేశాలు నిర్వహించి కేబుల్ సంస్థలు, ఇంటర్నెట్ ప్రొవైడర్ల యాజమాన్యాలకు తెలిపామన్నారు. ఆగస్టు 7 న జరిగిన సమావేశంలో ప్రధాన రహదారుల్లో వారం లోగా, ఇతర ప్రధాన రహదారుల్లో రెండు వారాల్లోగా నిబంధనల ప్రకారం కేబుల్స్ అమర్చేలా చర్యలు తీసుకోవాలని ఆపరేటర్లకు చెప్పామన్నారు. సమావేశాల్లో అంగీకరించిన విధంగా కొంత మంది కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు కేబుల్స్‌ను తొలగిచట్లేదని శుక్రవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కరెంటు పోల్స్ మీద కెపాసిటీకి మించి కేబుల్స్, కేబుల్ బండిల్స్, వివిధ ఆకారాల్లో వున్న టెలికాం పరికరాలు వేలాడదీయడం వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి ఫలితంగా షార్ట్ సర్క్యూట్‌లు జరిగి, విద్యుత్ ప్రమాదాలు సైతం జరిగాయని వివరించారు. కరెంటు పోల్స్‌పై అదనపు భారం పడి పోల్స్ వంగిపోతున్నాయనీ, కేబుల్స్ చిందరవందరగా ఫుట్‌పాత్‌లపై పడి బాటసారులకు ఇబ్బందికరంగా, ప్రమాదంగా ఉంటున్నాయని తెలిపారు. పోల్ మొత్తం కేబుల్స్‌తో చుట్టి ఉండటంతో విద్యుత్ సిబ్బంది పోల్స్ మీద మరమ్మతులు చేపట్టడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కేబుల్, ఇంటర్నెట్ వినియోగదారులకు ఇబ్బందులు కలగొద్దనే ఉద్దేశ్యంతో ఆయా సంస్థలకు తగినంత సమయం ఇచ్చామనీ, ఇక ప్రత్యక్ష కార్యాచరణకు తామే దిగి, కేబుల్స్ తొలగిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో ప్రమాదకరంగా కరెంటు స్థంభాలకు కట్టిఉన్న కేబుల్స్‌ను విద్యుత్‌శాఖ సిబ్బంది తొలగించారు.

జనంపై భారం లేకుండా ఆదాయం పెంచండి

కొత్త ఆలోచనలు చేయండి

- ప్రభుత్వ శాఖల సమీక్షలో ఆర్థికశాఖ మంత్రి భట్టి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రజలపై భారం లేకుండా రాష్ట్ర ఖజానా ఆదాయం పెంచేలా కొత్త ఆలోచనలు చేయాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారుల్ని ఆదేశించారు. శుక్రవారంనాడిక్కడి బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ప్రతి నెల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆదాయం పెంపుపై జరిగే సమావేశానికి నూతన ఆలోచనలతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకొని రావాలని చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజా ప్రభుత్వంలో అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామన్నారు. ఆయా శాఖల్లో స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకొని ఫలితాలు సాధించాలన్నారు. అందరికీ ఇసుక అందుబాటులోకి తెచ్చేందుకు ప్రధాన పట్టణాలకు సమీపంలో సబ్ యార్డులు, అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మార్కెట్ యార్డుల్లో ఇసుక నిల్వలు అందుబాటులో ఉంచాలని మైనింగ్ శాఖ అధికారులకు సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ పథకంలో వేగం పెంచాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు, ఇప్పటివరకు సమకూరిన ఆదాయం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ఏ మేరకు ఆదాయం అంచనా వేయవచ్చు అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎండిఏ ఆధ్వర్యంలో ల్యాండ్ పూలింగ్ ప్రణాళికలు, అసైన్డ్ భూములు, కోర్టు వివాదాలను సమీక్షించారు. ల్యాండ్ పూలింగ్ విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కావొద్దన్నారు. జీఎస్టీలో లీకేజీలను అరికట్టి ఆదాయం పెంచేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, కమర్షియల్ టాక్స్ అండ్ రెవెన్యూ కమిషనర్ ఎస్ఎమ్ఏ రిజ్వీ, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్, రవాణా శాఖ కమిషనర్ బుద్ధప్రకాష్, హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి గౌతమ్, మైనింగ్ శాఖ సెక్రెటరీ సురేంద్రమోహన్, డైరెక్టర్ సుశీల్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరింత బలోపేతంగా 'హైడ్రా'

మరో 15రోజుల్లో పూర్తిస్థాయి సిబ్బంది

- ప్రత్యేక పోలీస్‌స్టేషన్..

రూ.200 కోట్ల నిధులు



అక్కడ స్థలాలు కొనుగోలు చేయవద్దు

కబ్జాలు లేని హైదరాబాద్‌ను తీర్చి దిద్దడమే లక్ష్యంగా హైడ్రా పని చేస్తోందని, చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఎవరూ స్థలాలు కొనుగోలు చేయొద్దని హైడ్రా కమిషనర్, ఐజీ రంగనాథ్ తెలిపారు. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తే హైడ్రా చర్యలు తప్పవని హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో చెరువులు, కుంటలు అన్నీ కలిపి 400కుపైగా ఉండేవన్నరు. వాటిని కబ్జాదారులు ఆక్రమణకు గురి చేశారన్నారు. ప్లాట్లు, ఫ్లాట్లు కొనుగోలు చేసే ముందు ప్రజలు అన్ని రకాల అనుమతులను పరిశీలించి కొనుగోలు చేయాలని సూచించారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా గురించే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా జంట జలాశయాల పరిరక్షణ లక్ష్యంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చేపడుతున్న ఆపరేషన్ అక్రమార్కుల గుండెల్లో గుబులు రేపుతోంది. ఎవరేమనుకున్నా.. ఎవరు ఏ ఒత్తిడి చేసినా పట్టించుకోకుండా.. చర్యలు తీసుకోవడంతో హైడ్రాకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. ముఖ్యంగా 'ఎన్'కన్వెన్షన్ కూల్చివేత హైడ్రాకు కావల్సినంత మద్దతును కూడగట్టింది. అన్ని వర్గాల ప్రజలు దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే హైడ్రాకు మరిన్ని అధికారాలను, సిబ్బందిని ప్రభుత్వం కేటాయించనుంది. దాంతోపాటు నిధులు కేటాయించనుంది.

ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం

హైదరాబాద్‌లో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రాకు మరిన్ని అధికారాలను, సిబ్బందిని కేటాయించనున్నారు. ఓ.ఆర్.ఆర్ పరిధిలోని అన్ని చెరువులు, పార్కులు, నాలాలతోపాటు అన్ని ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతలను పూర్తి స్థాయిలో హైడ్రాకు అప్పగించేందుకు ప్రభుత్వం విధి విధానాలు రూపొందిస్తోంది. ఇప్పటి వరకు చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపుపై ప్రస్తుతం నీటిపారుదల శాఖ, జీహెచ్‌ఎంసీ, పురపాలక శాఖ, పంచాయతీరాజ్, వాల్టా తదితర విభాగాలు వేర్వేరుగా నోటీసులు జారీ చేస్తున్నాయి. ఈ క్రమం లో పలు శాఖల మధ్య సమన్వయం లోపిస్తోంది. ఈ లోపాలను నివారించేం దుకు.. ఓఆర్‌ఆర్ పరిధిలో అన్ని రకాల ఆక్రమణల తొలగింపులు, నోటీసుల జారీ హైడ్రా ద్వారానే చేప ట్టేందుకు విధి విధానాలు ఖరారు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. హైడ్రాకు కావాల్సిన అదనపు అధికారులు, సిబ్బందిని మరో 15రోజుల్లో ప్రభుత్వం నియమించనున్నట్టు తెలిసింది. హైడ్రా ఆధ్వర్యంలో మొత్తం 72 బృందాలు ఏర్పాటు చేశారు. అయితే, దాదాపు 3800 మంది సిబ్బంది అవసరమని హైడ్రా కమిషనర్ ఐజీ రంగనాథ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో హైడ్రాకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయడంతోపాటు, ఏసీపీ స్థాయి అధికారి, ప్రతి ఏటా హైడ్రాకు రూ.200కోట్ల మేర నిధులు కేటాయించ నుంది.

పొలిటికల్ నుంచి సామాన్యుల వరకు

పొలిటికల్‌గా, సామాన్యుల నుంచి హైడ్రాకు పెద్దఎత్తున మద్దతు వస్తోంది. నాలాలు, చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. హైడ్రా లాంటి వ్యవస్థను రాష్ట్ర మంతటా విస్తరించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. కొందరు నాయకులు మాత్రం హైడ్రాను కట్టడి చేయాలని, కూల్చివేతలపై అభ్యంతరాలు తెలుపుతున్నారు. మరికొందరు ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా వ్యతిరేకిస్తున్నారు. ఆగస్టు 13న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఎంఐఎం కార్పొరేటర్లు హైడ్రా తీరుపై మేయర్, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. హైడ్రాను రద్దు చేయాలని కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని మజ్లిస్ కార్పొరేటర్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి కాటను కలిసి వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. హైడ్రా కమిషనర్ ఐజీ ఏవీ రంగనాథ్ మాత్రం ఎక్కడా 'ఒత్తిళ్లకు తలొగ్గకుండా' ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తుండటం ప్రస్తుతం సంచలనంగా మారింది.

హైడ్రా ఆపరేషన్లలో వెలుగులోకి అక్రమాలు

హైడ్రా ఆపరేషన్‌తో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. కొన్ని చోట్ల భవన నిర్మాణం పూర్తి కాకముందే ఓసీ సర్టిఫికెట్లను జారీ చేయడం, బఫర్ జోన్‌లో ఇరిగేషన్ ఎన్‌వోసీ లేకుం డానే అనుమతులు ఇవ్వడం లాంటివి వెలుగు చూస్తున్నా యి. ఆక్రమణలకు పాల్పడిన వారితోపాటు అధికారులకు సైతం హైడ్రా నోటీసులు జారీ చేయడం, సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు. ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసులు చేయాలని సైబరాబాద్ కమిషనర్‌కు హైడ్రా సిఫారసు చేసింది.

అనుమానాస్పద స్థితిలో నర్సు మృతి

సెవెన్‌హిల్స్ ఆస్పత్రి, పోలీస్‌స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన

- ఆస్పత్రి యాజమాని అదుపులోకి..

మరో వ్యక్తిపై కుటుంబీకుల ఫిర్యాదు



నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

ప్రయివేటు ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న నర్సు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో శుక్రవారం జరిగింది. కాగా నర్సు మృతిపట్ల కుటుంబీకులు, బంధువులు సదరు ప్రయివేటు ఆస్పత్రి ఎదుట, పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. దాంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామానికి చెందిన మమత (23) బాన్సువాడ పట్టణంలోని చైతన్య కాలనీలో అద్దెకుంటూ బాన్సువాడ సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తుంది. శుక్రవారం సాయంత్రం ఆమె అద్దె ఇంటికి ఎవరో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమెను భుజంపై వేసుకొని ప్రభుత్వ ఆస్పత్రిలో వదిలేసి వెళ్లిపోయాడు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేయగా అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మమతను ఎవరో హత్య చేసి ఆస్పత్రిలో పడేశారంటూ హత్య చేసిన వారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలని బరంగెడ్గి గ్రామస్తులు భారీ ఎత్తున పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చి రాత్రి 8 గంటల వరకు ఆందోళన చేపట్టారు. నర్సు హత్య వెనుక సెవెన్ హిల్స్ ఆస్పత్రి యాజమాన్యమే బాధ్యత వహించాలంటూ వీరి కనుసైగల్లోనే హత్య జరిగిందని, ఆస్పత్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎల్లారెడ్డి బోధన్ వెళ్లే రహదారిపై గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. అదే విధంగా సెవెన్ హిల్స్ ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. విషయం తెలుసుకొని రాష్ట్ర ఆగ్రో సంస్థ చైర్మెన్ కాసుల బాలరాజు బాన్సువాడ పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చి ఆరా తీశారు. పోలీసు ఉన్నత అధికారులతో పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తానంటూ హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని బాన్సువాడ టౌన్ సీఐ కృష్ణ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, ఆస్పత్రి యజమాని ప్రవీణ్‌రెడ్డిని ముందస్తు చర్యగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే ప్రశాంత్ అనే యువకునిపై కుటుంబ సభ్యులు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు.



శ్రీపతి ల్యాబ్ ఫార్మా కంపెనీలో గ్యాస్ లీకేజీ

- పెద్దఎత్తున మంటలు

నవతెలంగాణ-చిట్యాల

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో గల శ్రీపతి ల్యాబ్ ఫార్మా కంపెనీలో శుక్రవారం ఉదయం రియాక్టర్ నుంచి గ్యాస్ లీకేజీ జరిగి పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. వెంటనే అక్కడ పనిచేస్తున్న కార్మికులు బయటకు పరుగులు తీయడంతో ప్రాణనష్టం తప్పింది. ఘటనపై సకాలంలో స్పందించిన చిట్యాల పోలీసులు ప్రమాద తీవ్రత పెరగకుండా చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చింది. గతంలో కూడా ఈ కంపెనీలో ప్రమాదాలు జరిగాయని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కంపెనీ నుంచి వెలువడే కాలుష్యం వల్ల పంట పొలాలకు నష్టం వాటిల్లుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ లీకేజీతో వచ్చిన మంటలతో దట్టమైన పొగ కమ్ముకోవడంతో తాము భయాందోళన చెందామన్నారు. కంపెనీపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. సంఘటనా స్థలాన్ని నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు, చిట్యాల ఎస్ఐ ఎన్.ధర్మ, నార్కట్‌పల్లి ఎస్ఐ శివ పరిశీలించారు.

జూరాల 42 గేట్లు ఎత్తివేత

- కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి
- పెరుగుతున్న వరద ప్రవాహం



నవతెలంగాణ -ధరూరు

ప్రియదర్శని జూరాల ప్రాజెక్టుకు ఆల్మట్టి, నారాయణ పూర్ డ్యాంల భారీగా వరద వస్తోంది. జూరాలకు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో 3లక్షల 20 వేల క్యూసెక్కు లు వస్తుండటంతో ప్రాజెక్టు 42 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. 3లక్షల 10 వేల 453 క్యూసెక్కుల నీటిని జలాశయంలోనికి వదులుతున్నట్టు పీజేపీ అధికారులు తెలిపారు. జల విద్యుత్ కేంద్రం ద్వారా 5 యూనిట్ల నుంచి 19వేల 580 క్యూసెక్కులను వదులుతున్నారు. నెట్టెంపాడుకు 750, కోయిలసాగర్ 613, బీమా2 లిఫ్టు 750, లెఫ్ట్ కెనాల్‌కు 820, కుడి కెనాల్‌కు 620 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు.

బాలికపై లైంగికదాడి కేసులో.. నిందితుడికి జీవిత ఖైదు

- బాధిత కుటుంబానికి రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశం : రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు



(ఫైల్)

నవతెలంగాణ-కందుకూరు

ఓ బాలికను ప్రేమ పేరుతో వంచించి, ఆమెపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ.25వేల జరిమానాను రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. బాధితురాలికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. కందుకూరు సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కొన్నాయిపల్లి రెవెన్యూ పరిధిలో కొత్తకోట గ్రామానికి చెందిన నిందితుడు ఇరగదిండ్ల శివాజీ.. కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్ గ్రామ పరిధిలో కూలి పని చేస్తుండేవాడు. బాలిక కుటుంబం సైతం అక్కడే గుడిసెలు వేసుకొని పనిచేస్తుండేవారు. ఈ క్రమంలో బాలికతో పరిచయం పెంచుకున్న నిందితుడు.. ప్రేమ పేరుతో మభ్యపెట్టి దగ్గరయ్యాడు. 2017 ఫిబ్రవరి 12వ తేదీ రాత్రి బాలికను పెండ్లి పేరుతో మాయమాటలు చెప్పి సికింద్రాబాద్‌కు తీసుకువెళ్లి ఆమెపై రెండు రోజులపాటు లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో నిందితుడిపై కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో యూ/ఎస్ 363, 366, 417, 376, 493 ఐపీసీ, సెక్షన్ 3(1)(డబ్ల్యూ), ఎస్సీ, ఎస్టీ చట్టం, సెక్షన్ 4 ఆఫ్ పోక్సో చట్టం, ఎస్సీ 399/2018 లైంగికదాడి, ఫోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. సాక్ష్యాదారాలను పరిశీలించిన రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ. 25వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు సీఐ తెలిపారు.

బీజేపీకి జేడీయూ షాక్

కులగణన నిర్వహించాల్సిందేనంటూ పట్టు

- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో ప్రతిపక్షానికి జేడీయూ మద్దతు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కుల గణనపై కేంద్రంలోని అధికార బీజేపీకి ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షం జేడీయూ షాక్ ఇచ్చింది. కుల గణన నిర్వహించాల్సిందేనని పట్టు బట్టింది. పార్ల మెంటరీ కమిటీ తొలి సమావేశంలో కుల గణనపై చర్చ జరగాలన్న ప్రతిపక్ష సభ్యుల డిమాండ్‌కు జేడీయూ మద్దతు పలికింది. జనాభా గణనలో కుల గణనపై చర్చ జరగాలన్న డిమాండ్‌ను మొదట డీఎంకే ఎంపీఆర్ బాలు లేవనెత్తారని, ఆ తరువాత కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్, జేడీయూ ఎంపీ గిరిధారి యాదవ్ డిమాండ్ చేశారు. ఓబీసీ సంక్షేమానికి సంబంధించిన పార్ల మెంటరీ కమిటీ తన మొదటి సమావేశంలో రాబోయే సంవత్సరపు ఎజెండాను నిర్ణయించడంపై చర్చించింది. జేడీయూ ఎంపీ గిరిధారి యాదవ్ మద్దతు పొందిన అనేక మంది ప్రతిపక్ష సభ్యుల నుంచి డిమాండ్ చేసిన తరువాత, కమిటీ చర్చించబోయే సబ్జెక్ట్‌లలో ఒకటిగా "కుల గణన"ను ఎంచుకుంది. సమావేశంలో 30 సబ్జెక్టుల జాబితాను ప్యానెల్ ముందుంచారు. డీఎంకే ఎంపీ టీ.ఆర్ బాలు కుల గణనపై చర్చ అవసరమని లేవనెత్తారు. ఆయనకు కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ మద్దతు పలికారు. దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న జనాభా గణనకు సన్నాహకాల పరిస్థితిపై హోం మంత్రిత్వ శాఖ నుంచి కమిటీ తప్పనిసరిగా వివరణ కోరాలని ఠాగూర్ అన్నారు. ఆయనకు టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ మద్దతు పలికారు. విజయవంతమైన గణనను నిర్వహించి, ఫలితాలను ప్రచురించిన బీహార్‌ను ఉదాహరణగా చెబుతూ, దేశవ్యాప్తంగా ఈ కసరత్తు చేయాల్సిన అవసరం ఉందని జేడీయూ ఎంపీ గిరిధారి యాదవ్ అన్నారు. సమస్యను లోతుగా మూల్యాంకనం చేయాలని ప్యానెల్‌కు ఆయన తెలిపారు.

జనాభా గణనతో పాటు కుల గణన కూడా చేయాలా వద్దా అనే అంశంపై చర్చ జరగాలని కోరారు. జనాభా గణనను చర్చించే అంశాల జాబితాలో చేర్చడానికి కమిటీ అధ్యక్షుడైన గణేష్ సింగ్ అంగీకరించినట్లు తెలిసింది. పార్లమెంటరీ కమిటీ సమావేశంలో కూడా ప్రతిపక్ష సభ్యులు ఓబీసీల కోసం జాతీయ కమిషన్‌ను కూడా చర్చా జాబితాలో సబ్జెక్ట్‌గా చేయాలని డిమాండ్ చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నెల ప్రారంభంలో పునర్నిర్మించిన ఈ కమిటీలో 30 మంది ఎంపీలు ఉన్నారు. బీజేపీ ఎంపీ గణేష్ సింగ్ నేతృత్వంలో 2024-25 మధ్యకాలంలో చర్చించే సబ్జెక్టుల ఎంపికపై చర్చించేందుకు మొదటి సమావేశాన్ని నిర్వహించారు. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ) ప్రభుత్వంలో బీజేపీకి జేడీయూ కీలక మిత్రపక్షం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 240 సీట్లు గెలుచుకోవడంతో సొంతంగా మెజారిటీకి దూరమైన తరువాత ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ తన మిత్రపక్షాలపై ఆధారపడింది. బీజేపీకి 12 మంది ఎంపీలతో జేడీయూ, 16 మంది ఎంపీలతో టీడీపీ కీలక కూటమి పార్టీలుగా ఉన్నాయి. 2021లో జరగాల్సిన దశాబ్ద జనాభా గణన ఆలస్యమైంది. ఎప్పుడు నిర్వహించాలనే దానిపై కేంద్ర ప్రభుత్వం ఇంకా ఒక స్పష్టతకు రాలేదు. కుల కాలమ్‌ను చేర్చడానికి డేటా సేకరణను విస్తరించడానికి చురుకైన చర్చలు జరుగుతున్నాయి. బీహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్‌తో పొత్తులో ఉన్న జేడీయూ రాష్ట్రంలో కులాల సర్వే నిర్వహించింది. ఎన్‌డీఏలో తిరిగి చేరినప్పటికీ సామాజిక న్యాయం అంశమైన దేశవ్యాప్త కుల గణన డిమాండ్ నుంచి వెనక్కి తగ్గబోమని జేడీయూ పునరుద్ఘాటించింది. తొలి నుంచి కుల గణనను ప్రతిపక్ష ఇండియా బ్లాక్ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కూడా లేవనెత్తాయి. గత నెలలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన ప్రసంగంలో డిమాండ్‌ను పునరుద్ఘాటించారు.

ఎట్టకేలకు మార్కెట్ కమిటీలు

- మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా హరినాథబాబు
- నేలకొండపల్లి చైర్మెన్‌గా వెన్నుపూసల సీతారాములు
- 18 మంది చొప్పున రెండు కమిటీలు
- పెండింగ్ లోనే ఖమ్మం మార్కెట్ కమిటీ

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ కమిటీలను ప్రభుత్వం శుక్రవారం రాత్రి ప్రకటించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 9 నెలల తర్వాత కమిటీలను ప్రకటించడం గమనార్హం. మార్కెట్ కమిటీలు, ఇతరత్రా నామినేటెడ్ పోస్టుల కోసం సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ నాయకులు ఎదురుచూస్తున్నారు. వారి ఆకాంక్షలను నెరవేరుస్తూ మొత్తం మీద పాలేరు నియోజకవర్గం లోని మద్దులపల్లి, నేలకొండపల్లి మార్కెట్ కమిటీలను ప్రకటించారు. ఒక్కో పాలకవర్గంలో 18 మంది చొప్పున చోటు కల్పించారు. మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ గా బైరు హరినాథబాబు, వనవాసం నరేందర్ రెడ్డి ఎంపికయ్యారు. అలాగే నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ గా వెన్నపూసల సీతారాములు, కొండపర్తి సురేష్ నియమితులయ్యారు.

మద్దులపల్లి మార్కెట్ కమిటీ..

మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గా బైరు హరినాథ బాబు, వైస్ చైర్మన్ గా వనవాసం నరేందర్ రెడ్డి, సభ్యులుగా ముత్యం కృష్ణారావు, కర్లపుడి భద్రకాళి, తేజావత్ పంతులు, ఉప్పుగండ్ల ప్రసాద్, వంగూరి రవి, ధరావత్ బాబు, నల్లమల ప్రతాప్, జడ్డల నగేష్, నంద్యాల శ్యాంసుందర్ రెడ్డి, బానోత్ హుస్సేన్ , కన్నేటి జ్యోతి, పాటిబండ్ల శ్రీలక్ష్మి, బీరోలు పీఏసీఎస్ చైర్మన్ రామసహాయం నరేష్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి అబ్దుల్ అలీమ్, కూసుమంచి ఏడీఏ సరిత, మద్దులపల్లి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి సభ్యులుగా ఎంపికయ్యారు.

నేలకొండపల్లి మార్కెట్ కమిటీ...

నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గా వెన్నపూసల సీతారాములు, వైస్ చైర్మన్ గా కొండపర్తి సురేష్ , సభ్యులుగా మీసా నాగేశ్వరరావు, సూరేపల్లి రవి, చిట్టూరి అచ్చయ్య, భూక్య సీతయ్యనాయక్, మొక్క ఉపేందర్, బానోత్ బొంగనాయక్, కంచర్ల సుధీర్ రెడ్డి, చాట్ల సత్యనారాయణ, లిప్పని సరోజినీ, బానోత్ సైదానాయక్, ఓరుగంటి కిరణ్ కుమార్, బోనగిరి సాయి రాజేష్, రాజేశ్వరపురం పీఏసీఎస్ చైర్మన్, డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ అధికారి అబ్దుల్ అలీమ్, కూసుమంచి ఏడీఏ సరితతో పాటు నేలకొండపల్లి పంచాయతీ ప్రత్యేక అధికారి సభ్యులుగా నియమితులయ్యారు. ఇరు మార్కెట్ కమిటీలకు ఎంపికైన పాలక మండలి సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మిక్సీని ఇలా వాడుదాం...

ఉదయం చట్నీ చేయటం మొదలు... గ్రేవీ మసాలా వరకూ ప్రతి ఒక్క అవసరానికి మిక్సీని వాడతాం. మిక్సీ లేనిదే పని అవ్వదనే పరిస్థితి వచ్చింది. మరి అలాంటి వస్తువుని జాగ్రత్తగా వాడాలంటే ఏమేం టిప్స్ పాలో అవ్వాలో చూద్దాం.

మెల్లిగా..

మిక్సీ వాడేటప్పుడు ఒకేసారి దాని స్పీడ్ పెంచొద్దు. ఫస్ట్ మోడ్‌లో పెట్టి కాసేపయ్యాక సెకండ్ మోడ్‌లోకి వెళ్ళాలి. మరీ అవసరం అనుకుంటే లాస్ట్ మోడ్ వరకూ వెళ్ళండి.

రెగ్యులర్‌గా క్లీనింగ్..

రెండు వారాలకొకసారైనా సబ్బునీటితో క్లీన్ చేయాలి. టూత్ బ్రష్‌తో కింద భాగంలోనూ శుభ్రం చేసుకోవాలి. క్లీన్ చేసేటప్పుడు తడి లేకుండా చూసుకోండి.

జార్స్ పెట్టేటప్పుడు..

అదే విధంగా జార్స్ ఎలా పడితే అలా పెట్టి మిక్సీ ఆన్ చేయొద్దు..




జార్ పూర్తిగా సెట్ అయ్యాకనే మిక్సీ ఆన్ చేయాలి. అదే విధంగా, ఏవైనా మిక్సీ పట్టాక అందులో వాటర్ వేసి మిక్సీ చేయండి. పొడులని మిక్సీ చేసేటప్పుడు దాన్ని ఆపి ఆపి పొడి చేసుకోవటం మంచిది.

సగం పరిమాణంలో..

జార్‌ను పూర్తిగా నింపేయొద్దు. దీని వల్ల మిక్సీ త్వరగా పాడవుతుంది. పదార్థాలు కూడా మెత్తగా అవ్వవు. అందుకే, ఓవర్‌లోడ్ వద్దు. దీంతో పాటు మిక్సీ రన్ అవుతుండగా మూత తీసి చూడడం వంటివి చేయొద్దు. ■

నిజం దాచిపెట్టి....

పెండ్లి అంటే రెండు శరీరాలు ఒకే ప్రాణంగా మారడం. పెండ్లి తర్వాత భార్యా, భర్తలు అన్యోన్యంగా కలిసి జీవించాలని కోరుకుంటారు. ఎంత ప్రేమగా ఉన్నా చిన్నచిన్న గొడవలు, మనస్పర్థలు సహజం. ఇలాంటివి ఎన్ని వచ్చినా ఒకరినొకరు అర్థం చేసుకొని కలిసి జీవించేలా చేసేదే పెండ్లి. అయితే కొంత మంది చిన్న విషయాలకే విడిపోవాలని చూస్తుంటారు. ఇంకొందరు ఎంత పెద్ద సమస్య వచ్చినా విడిపోకుండా అలా భరిస్తూ ఉంటున్నారు. ఆ బంధం నుండి బయటకు రావడానికి ఇష్టపడరు. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్...



ఐద్వా అదాలత్
సెల్: 9490098024

పవిత్రకు 26 ఏండ్లు, రఘుకు 28 ఏండ్లు. ఇద్దరికీ పెండ్లి జరిగి ఆరు నెలలు అవుతుంది. రఘు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. పవిత్ర కూడా ఇక్కడ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. ఇద్దరి జోడీ బాగుంటుందని పెద్దలు మాట్లాడుకొని సంబంధం కుదిర్చారు. పెండ్లికి ముందు ఆరు నెలల వరకు ఇద్దరూ ఫోన్లో మాట్లాడుకున్నారు. ఒకరి గురించి ఒకరు తెలుసుకున్నారు. పెద్దల సమక్షంలో పెండ్లి చేసుకున్నారు. రఘుకు కట్నంగా 25 లక్షల రూపాయలు, 32 తులాల బంగారం, రెండు కిలోల వెండి ఇచ్చారు. పెండ్లి తర్వాత ఇరు కుటుంబ సభ్యులు కలిసి తీర్థయాత్రలు కూడా చేశారు. అయితే రఘు, పవిత్రకు జరగాల్సిన మొదటి రాత్రిని మాత్రం మూహుర్తాలు బాగోలేదని నెల రోజులు గడిపేశారు.

పెండ్లికి ముందు ఆరు నెలల వరకు ఇద్దరూ ఫోన్లో మాట్లాడుకున్నారు. ఒకరి గురించి ఒకరు తెలుసుకున్నారు. పెద్దల సమక్షంలో పెండ్లి చేసుకున్నారు. రఘుకు కట్నంగా 25 లక్షల రూపాయలు, 32 తులాల బంగారం, రెండు కిలోల వెండి ఇచ్చారు. పెండ్లి తర్వాత ఇరు కుటుంబ సభ్యులు కలిసి తీర్థయాత్రలు కూడా చేశారు. అయితే రఘు, పవిత్రకు జరగాల్సిన మొదటి రాత్రిని మాత్రం మూహుర్తాలు బాగోలేదని నెల రోజులు గడిపేశారు.

చివరకు పవిత్ర ఇంట్లో వాళ్లే ముహుర్తం చూసి కార్యక్రమం జరపడానికి ఏర్పాట్లు చేశారు. కానీ రఘు ఇష్టపడలేదు. కొత్త కదా కంగారు పడుతున్నాడని కాస్త సమయం ఇద్దామనుకున్నారు. ఈలోపు పవిత్రకు వీసా రెడీ అయ్యింది. ఇద్దరూ కలిసి అమెరికా వెళ్ళిపోయారు. అక్కడ కూడా రఘు, పవిత్రను దూరం పెట్టేవాడు. దాంతో పవిత్రకు అనుమానం వచ్చింది. 'మీరు నన్నెందుకు దూరం పెడుతున్నారు. నేనంటే ఇష్టం లేకపోతే చెప్పొచ్చు కదా! లేదా ఇంకేదైనా సమస్య ఉన్నా చెప్పండి, డాక్టర్ సలహా తీసుకుందాం' అని ప్రేమగా అడిగింది.

దానికి అతను 'నువ్వంటే నాకు చాలా ఇష్టం. కానీ ఎందుకో చాలా భయంగా ఉంది. అందుకే ఏడాది నుండి మందులు వాడుతున్నాను' అన్నాడు. 'మనం వేరే డాక్టర్ దగ్గరకు వెళదాం. మీకు ఏదైనా సమస్య ఉంటే డాక్టర్ మందులతో పాటు కౌన్సెలింగ్ కూడా ఇస్తారు' అని చెప్పి రఘును డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాలనుకుంది. కానీ అతను రాలేదు. ఇద్దరూ అక్కడ ఉన్న తమ స్నేహితుల ఇండ్లకు వెళ్లేవారు. పవిత్ర ఫ్రెండ్ ఒకరు ఇద్దరూ దూరంగా ఉండటం గమనించి అనుమానంగా అడిగింది. పవిత్ర ఆమెకు విషయం చెప్పింది. ఆమె కూడా తనకు తెలిసిన డాక్టర్ గురించి చెప్పి వెళ్ళి కలవమని సలహా ఇచ్చింది. కానీ పవిత్ర ఈ విషయం గురించి రఘుతో మాట్లాడలేదు. కానీ ఇంటికి తిరిగి వచ్చినప్పటి నుండి రఘు ప్రవర్తనలో మార్పు వచ్చింది.

ప్రతి చిన్న విషయానికి విసుక్కోవడం, గొడవ చేయడం మొదలుపెట్టాడు. కొన్ని రోజులకు పవిత్రపై చేయిచేసుకునే వరకు వెళ్లాడు. ఇండియా నుండి రఘు కుటుంబ సభ్యులు ఫోన్ చేసి పవిత్రను తిట్టేవారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో ఆమెకు అర్థం కాలేదు. జాబ్‌పైన కూడా సరిగ్గా దృష్టి పెట్టలేకపోయింది.

తిరిగి ఇండియా వచ్చేద్దామంటే పెండ్లి తర్వాత ఇలా భర్త నుండి విడిపోవడం ఎందుకని ఆలోచించింది. చివరకు రెండు కుటుంబాల మధ్య కూడా గొడవలు మొదలయ్యాయి. దాంతో పవిత్రను ఆమె తల్లిదండ్రులు అమెరికాలో ఉండే వాళ్ల బంధువుల ఇంటికి పంపించారు. చివరకు అసలు సమస్య ఏంటని తెలుసుకుంటే రఘు సంసార జీవితానికి పనికి రాడని తెలిసింది. డాక్టర్‌కు చూపించినా ఉపయోగం లేదు. పెండ్లికి ఏడాది ముందు నుండే అతను మందులు వాడుతున్నాడు. తనలోని సమస్యలను దాచడం కోసం పవిత్రను హింసించడం మొదలుపెట్టాడు.

ఈ విషయాలన్నీ పవిత్రకు తెలియడంతో 'నేను పెండ్లి చేసుకోనంటే మా ఇంట్లో వాళ్ళు బలవంతంగా చేశారు. ఈ విషయం బయట ఎవరికైనా చెబితే చంపేస్తాను' అని పవిత్రను బెదిరించాడు. ఇక విషయం తెలుసుకున్న పవిత్ర బంధువులు ఆమెను ఇండియా పంపించేశారు. ఆమె ఇండియాకు వచ్చి రెండు నెలలైనా రఘు నుండి కానీ, వారి కుటుంబం నుండి కానీ ఆమెకు ఎవ్వరూ ఫోన్ చేయలేదు. వీళ్ళ వెళ్లినా రానీయడం లేదు. 'అమెరికాలో మా కొడుకును బాగా ఇబ్బంది పెట్టావు. ఏ మోహం పెట్టుకొని మా ఇంటికి వచ్చావు' అని గొడవ చేశారు. రఘుకు ఫోన్ చేసినా తియ్యడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో అర్థం కాక ఆమె ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.

ప్రతి చిన్న విషయానికి విసుక్కోవడం, గొడవ చేయడం మొదలుపెట్టాడు. కొన్ని రోజులకు పవిత్రపై చేయిచేసుకునే వరకు వెళ్లాడు. ఇండియా నుండి రఘు కుటుంబ సభ్యులు ఫోన్ చేసి పవిత్రను తిట్టేవారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో ఆమెకు అర్థం కాలేదు. జాబ్‌పైన కూడా సరిగ్గా దృష్టి పెట్టలేకపోయింది.

మేము రఘు కుటుంబ సభ్యులకు లెటర్ పంపించినా రాలేదు. పైగా అడ్వకేట్‌తో మాకు సమాధానం పంపించారు. ఫోన్ చేస్తే 'మా అబ్బాయి తప్పేం లేదు. పవిత్రకే ఏ పనీ చేయడం రాదు. వాళ్ల అమ్మానాన్న ఆమెకు ఏమీ నేర్పలేదు. ఎప్పుడూ ఆమెను బయట తిప్పాలంటది. మేము మా అబ్బాయితో మాట్లాడినా ఒప్పుకోదు. గొడవ పెట్టుకుంటది. భరించలేకే రఘు ఆమెను ఇండియా పంపించేశాడు. ఇక ఆమెతో మాకు ఎలాంటి సబంధం లేదు. ఐదు లక్షలు ఇస్తాము. రఘును వదిలి వెళ్లిపొమ్మనండి' అంది వాళ్ల అమ్మ.

దానికి మేము 'పెండ్లి జరిగి ఆరు నెలలే అవుతుంది. అప్పుడే విడాకులేంటి. ముందు ఆఫీసుకు రండి కూర్చొని మాట్లాడుకుందాం' అన్నాం. దానికి ఆమె 'మేము రాము. ఐదు లక్షలు ఇస్తామంటున్నాము కదా తీసుకొని వెళ్లమనండి' అంది. దాంతో మేము రఘుకు ఫోన్ చేస్తే తప్పంతా పవిత్రదే అన్నట్టు చెప్పాడు. అతనిలో ఉన్న లోపం గురించి మాట్లాడితే 'అందుకే కదా ఐదు లక్షలు ఇస్తామంటున్నాము' అని తల్లిలాగే కొడుకూ మాట్లాడాడు.

కానీ పవిత్రకు రఘును వదులుకోవడం ఇష్టం లేదు. 'పెండ్లిలో రఘుకు 25 లక్షల కట్నం, బంగారం, వెండి ఇచ్చాం. ఇందులో పది తులాల బంగారం, రెండు కిలోల వెండి వారి దగ్గరే ఉంది. పెండ్లి ఖర్చు దాదాపు 11 లక్షలు అయ్యింది. మాతో ఇంత ఖర్చు పెట్టించారు. ఇప్పుడు ఐదు లక్షలు ఇచ్చి పొమ్మంటున్నారు. అతన్ని ఇండియాకు పిలిపించి డాక్టర్‌తో ట్రీట్‌మెంట్ చేయిస్తే బాగుంటుంది. అంతే కానీ నేను విడాకులు ఇవ్వను' అంది.

'ఎన్ని మందులు వాడినా అతను సంసారానికి పనికి రాడని డాక్టర్లు చెప్పారు. పైగా అతనేమైనా నిజాయితీ పరుడా అంటే అదీ లేదు. తన తప్పు కప్పిపుచ్చుకోడానికి నిన్ను హింసించాడు. అలాంటి వ్యక్తితో జీవితాంతం నువ్వు ఎలా ఉంటావు' అని అడిగాము. దానికి ఆమె ఇప్పుడు నన్నేం చేయమంటారో మీరే చెప్పండి' అంది.

'రఘు అమెరికాలో డాక్టర్ల దగ్గర చూపించుకొని చికిత్స తీసుకుంటున్నట్టు ఏమైనా ఆధారాలు ఉన్నాయా' అని అడిగాము. ఆమె దగ్గర ఉన్న ఆధారాలు చూపించింది. వాటితో రఘుపైన, వారి కుటుంబ సభ్యులపై కేసు పెట్టించాము. ఇప్పుడు వాళ్ల కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. లాయర్ సహాయంతో కోర్టు ద్వారా పవిత్రకు రావల్సిన కట్నం డబ్బు, బంగారం, వెండితో పాటు నష్టపరిహారం కూడా ఇప్పించే ప్రయత్నం చేస్తున్నాం. పవిత్రకు మళ్లీ కొత్త జీవితం మొదలపెట్టమని కౌన్సిలింగ్ ఇస్తున్నాము.

- వై వరలక్ష్మి
9948794051

'దేవాదుల'కు 60 టీఎంసీల కేటాయింపు

2026 మార్చి నాటికి ప్రాజెక్టు పూర్తి
సోనియా చేతుల మీదుగా ప్రారంభోత్సవం

- కాలువల మెయింటెనెన్స్‌కు రూ.1,100 కోట్ల నిధులు : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- తుపాకులగూడెం వద్ద మంత్రులు పొంగులేటి, సీతక్కతో కలిసి పనుల పరిశీలన





నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

దేవాదుల ప్రాజెక్టుకు 60టీఎంసీల నీటి కేటాయింపులకు కృషి చేస్తామని, 300 రోజులపాటు ఎత్తిపోతలు నడిచేలా చర్యలు తీసుకోనున్నట్టు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్దనున్న దేవాదుల ఎత్తిపోతల పథకం పంప్‌హౌజ్‌ను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాదుల ప్రాజెక్టు పనులను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టును 2026 మార్చిలోపు పూర్తి చేసి సోనియాగాంధీ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు చెప్పారు. పదేండ్లుగా మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు నీటిపారుదల శాఖను నాశనం చేశారన్నారు. కమిషన్‌లకు కక్కుర్తి పడి ప్రాజెక్టులను నిర్మించి, దోపిడికి పాల్పడ్డారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలను తాకట్టుపెట్టి జేబులు నింపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష కోట్లు ఖర్చుపెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు.. ప్రాజెక్టు కూలిపోయిందని, ఇంతకంటే సిగ్గు చేటు మరొకటి లేదన్నారు. దేవాదుల ప్రాజెక్టు నుండి తొలుత 170 రోజులపాటు ఎత్తిపోతలు చేసి 39 టీఎంసీల నీటిని వినియోగించుకోవాలని నిర్ణయించినట్టు తెలిపారు. సమ్మక్క బ్యారేజీ నిర్మాణం నేపథ్యంలో గోదావరి జలాలు అందుబాటులో ఉంటున్నాయని, 300 రోజులపాటు ఎత్తిపోతలు చేసి 60 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చని, ఇందుకు ప్రయత్నాలు చేయడం ప్రారంభించామని, పొరుగు రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్టు చెప్పారు. నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా ఆ పనిపై ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లారన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి ఎన్‌ఓసీ తీసుకొని దేవాదుల ప్రాజెక్టుకు 60 టీఎంసీల నీటిని కేటాయిస్తామని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామన్నారు. ఈ ప్రాజెక్టులో పనులు చేసిన కాంట్రాక్టర్ల బిల్లులను వారం రోజుల్లో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను ఆదేశించారు. నీటిపారుదల శాఖలో 700 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను నియమిస్తున్నామని, త్వరలోనే వారందరూ విధుల్లో చేరుతారని చెప్పారు. 1,800 మంది లస్కర్లను నీటిపారుదలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడానికి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తున్నట్టు తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాలువల్లో పూడిక చేరి, చెట్లు మొలిచి సాగునీరు చివరి ఆయకట్టుకు పోయే పరిస్థితి లేకుండాపోయిందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించి కాలువల మెయింటెనెన్స్‌కు రూ.1,100 కోట్లు కేటాయించనున్నట్టు తెలిపారు. భూ సేకరణతో తీవ్ర జాప్యం జరుగుతున్నందున ఆ సమస్యల పరిష్కారానికి ఒక ఐఏఎస్ అధికారిని నియమిస్తున్నట్టు చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులున్నా 'దేవాదుల'కు ప్రాధాన్యత : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఆర్థిక ఇబ్బందులున్నా రాష్ట్ర ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నదని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సమ్మక్క బ్యారేజీ నిర్మాణం తర్వాత మరో 5-6 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడేనాటికి రూ.14,000 కోట్ల పెండింగ్ బిల్లులున్నాయని, ఇప్పటికే రూ.6-7 వేల కోట్ల బకాయిలకు చెల్లింపులు చేసినట్టు చెప్పారు. దేవాదుల మూడో దశలోని టన్నెల్ నిర్మాణపు పనులను నవంబర్ 15లోపు పూర్తి చేయాలన్నారు.

రామప్ప-లక్నవరం లింకు కాలువను సత్వరమే పూర్తి చేయాలి : మంత్రి సీతక్క

దేవాదుల ప్రాజెక్టులో భాగంగా రామప్ప-లక్నవరం లింకు కాలువకు సంబంధించి భూ సేకరణను వెంటనే పూర్తి చేసి కాలువల పనులు పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కోరారు. రామప్ప నుంచి ఇంచెర్ల, జాకారం చెరువులను నీళ్ల నింపాలన్నారు. ఏటూర్‌నాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల్లో లిఫ్టులు ఏర్పాటు చేయాలన్నారు. తుపాకులగూడెం దేవాదుల ప్రాజెక్టు కింద కన్నాయిగూడెం, తుపాకుల గూడెం రైతులు భూములు కోల్పోయారని, వారిని నష్టపరిహారం చెల్లించాలని తెలిపారు. సమ్మక్క బ్యారేజీ నుంచి ఈ మూడు మండలాలకు కాలువల ద్వారా సాగునీరందించేలా ప్రణాళిక రూపొందించి రైతులకు ప్రయోజనం కలిగించాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో శాసనమండలి వైస్‌ఛైర్మెన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, యశస్వినీరెడ్డి, కెఆర్ నాగరాజు, డాక్టర్ మురళీనాయక్, నీటిపారుదల శాఖ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇఎన్సీ అనిల్‌కుమార్, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్, నీటిపారుదల శాఖ ములుగు, వరంగల్ సీఈలు విజయభాస్కర్, అశోక్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో 'హైడ్రా' కూల్చివేతలు

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని రాంనగర్ డివిజన్ మణెమ్మ గల్లీలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలకు ఉపక్రమించింది. పోలీసు బందోబస్తు మధ్య శుక్రవారం జీహెచ్ఎంసీ అధికారులు నిర్మాణాలను కూల్చేశారు. రోడ్లను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారని స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ రెండ్రోజుల కిందట రాంనగర్ మణెమ్మ గల్లీలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. దీనిపై నివేదిక సమర్పించాలని జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాలు అని నిర్ధారించి నివేదిక సమర్పించారు. 24 గంటల వ్యవధిలోనే జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ శుక్రవారం అక్రమ కట్టడాలను జేసీబీల సహాయంతో కూల్చేశారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో నాలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నియోజకవర్గ వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉమ్మడి నల్లగొండ సస్యశ్యామలమే నా ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

చమత్కరించారు. గతంలోనే సీఎం పదవి ఒక్కసారి మిస్సయిందన్నారు. భవిష్యత్‌లో సీఎం కావడం ఖాయమన్నారు. తన నాలుకపై మచ్చలున్నాయని.. తాను అన్నది నిజమవుతుందని, ఉత్తమ్ సీఎం కావడం ఖాయమన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలలో ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా పనిచేశారని, ఉత్తమ్ ఇరిగేషన్ శాఖ మంత్రి ఉండటం ఈ ప్రాంత అదృష్టమన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. గజ్వేల్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.హరిరామ్, హైదరాబాద్ ఇంజినీరింగ్ చీఫ్ మురళీధర్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనుల వివరాలను వివరించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేల్, మల్‌రెడ్డి రంగారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, డీసీసీబీ చైర్మెన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఇంజినీర్లు, గజ్వేల్, సూర్యాపేట, నల్లగొండ, భువనగిరి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థపై అత్యంత విశ్వాసం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భారత న్యాయ వ్యవస్థపై తనకు అత్యంత విశ్వాసముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మంజూరైన బెయిల్‌కు సంబంధించి ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన రేవంత్. 'నా వ్యాఖ్యలు న్యాయవ్యవస్థను ప్రశ్నిస్తున్నట్టుగా కొంత మంది విలేకర్లు వక్రీకరించారు. నేను అనని మాటలను అన్నట్టుగా రిపోర్టు చేశారు. పత్రికల్లో వచ్చిన వార్తలపై బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నా. న్యాయ వ్యవస్థ, దాని స్వతంత్రత పట్ల తనకు అపార గౌరవం, విశ్వాసం ఉన్నాయి. రాజ్యాంగం, దాని విలువలను విశ్వసించే నేను.. ఎన్నటికీ న్యాయవ్యవస్థను అత్యున్నతమైనదిగా భావిస్తూనే ఉంటా' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆధారాలు చూశాకే కూల్చివేత చర్యలు

హైదరాబాద్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొర్రాముల (వెంకటాపూర్)లోని నాదం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, అనురాగ్ యూనివర్సిటీలకు చెందిన నిర్మాణాల కూల్చివేత చర్యలు చట్ట నిబంధనలకు లోబడే ఉండాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని వివరాల ఆధారాలను పిటిషనర్లకు అందజేయాలని, ఆపై వాళ్ల నుంచి వివరణ తీసుకోవాలని, ఆ తర్వాతే చర్యలు చట్ట ప్రకారం ఉండాలని ఆదేశించింది. తమ విద్యా సంస్థల కూల్చివేయకుండా ఆదేశాలివ్వాలంటూ దాఖలైన పిటిషన్లను శుక్రవారం జస్టిస్ వినోద్‌కుమార్ విచారించి పైవిధంగా హైడ్రా, ప్రభుత్వాలను ఆదేశించారు. చర్యలు చట్ట ప్రకారమే ఉంటాయన్న ప్రభుత్వ హామీకి అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేశారు. చట్టప్రకారం చర్యలు చేపడతామన్న ప్రభుత్వ హామీని రికార్డు చేసి పిటిషన్‌పై విచారణను మూసేశారు.

సింగరేణిలో 2364 మంది బదిలీ వర్కర్ల క్రమబద్ధీకరణ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న 2,364 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తున్నట్లు ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ బలరామ్ తెలిపారు. వీరిలో 243 మంది మహిళలు కూడా ఉన్నారు. సంస్థలో చేరినప్పటి నుంచి క్యాలెండర్ ఏడాదిలో భూగర్భ గనుల్లో 190 రోజులు, ఉపరితల గనులు, విభాగాల్లో 240 రోజులు విధులు నిర్వహించిన వారి సర్వీసును క్రమబద్ధీకరిస్తున్నట్టు తెలిపారు. దీనిపై త్వరలో ఉత్తర్వులు జారీ చేయాలని శుక్రవారం డైరెక్టర్(పర్సనల్)కు ఆదేశాలు జారీ చేశారు. 2024 సెప్టెంబరు ఒకటి నుంచి వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తించబోతున్నామని చెప్పారు. సింగరేణిలో కారుణ్య, డిపెండెంట్ ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా సంస్థలో చేరిన వారిని తొలుత బదిలీ వర్కర్లుగా నియమిస్తారు. ఏడాది కాలం పనిచేసిన తర్వాత కనీస మస్టర్లు పూర్తి చేస్తే, జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరించి, శాశ్వత ఉద్యోగులుగా గురిస్తారు. ఉన్నత విద్యార్హతలు కలిగిన వారు కంపెనీలో ఇంటర్నల్ ఉద్యోగాల ద్వారా పదోన్నతులు పొందడానికి అర్హత లభిస్తుంది. అలాగే క్వార్టర్ల కేటాయింపులో ప్రాధాన్యత ఉంటుంది. కొత్తగా రెగ్యులర్ అయిన ఉద్యోగులు క్రమశిక్షణతో పనిచేయాలని సీఎమ్‌డీ బలరామ్ కోరారు. డ్యూటీలకు గైర్హాజరు కావొద్దని, సమయ పాలన పాటిస్తూ విధులు నిర్వర్తించాలని చెప్పారు. ఈ ఏడాదిలో వెయ్యికి పైగా ఇంటర్నల్ ఉద్యోగాలను భర్తీ చేయబోతున్నామనీ, అర్హులైన వారు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి అన్ని అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు.

అసమానతలు లేని రాజ్యం కోసం పోరాడాలి

(మొదటిపేజీ తరువాయి)



పిలాయిపల్లి గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు కళ్లెం వీరారెడ్డి స్మారక భవనం సీపీఐ(ఎం) కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో తమ్మినేని ప్రసంగిస్తూ.. అధికారంలో ఉన్నా లేకున్నా పేదల కోసం నిరంతరం పోరాటం చేసేదే కమ్యూనిస్టులని స్పష్టం చేశారు. వీరారెడ్డి ఆనాడు పీడితవర్గ ప్రజల కోసం నిరంతరం పోరాడారని చెప్పారు. పాలకులు ప్రజలకు విద్య, వైద్యం సరిగా అందివ్వకపోవడంతో అనేక మంది పేదలు కార్పొరేట్ విద్య, వైద్యం పొందలేకపోతున్నారని అన్నారు. అటు విద్యకు దూరమవుతూ.. ఇటు వైద్యం అందక ప్రాణం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రజెండా నీడన పరిపాలన జరుగుతున్న దేశాల్లో విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యాన్ని ప్రజలకు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేట్‌పరం చేస్తూ.. లాభాలు వచ్చే రంగాలను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా అప్పజెప్తూ నిరుద్యోగుల పొట్టలు కొడుతోందని అన్నారు. ప్రజల బతుకుల్లో కులం, మతం పేరుతో చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. గత ప్రభుత్వం పేదలకు, దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేస్తామని చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆక్రమణకు గురైన భూములను హైడ్రా పేరుతో తిరిగి తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇక్కడితోనే ఆగకుండా ఎక్కడ ప్రభుత్వ భూములు ఉన్నా వాటిని సంరక్షించి భూమిలేని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అనుసరించే విధానాల్లో లోపాలుంటే ఎత్తిచూపుతామన్నారు.

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. కళ్లెం వీరారెడ్డి స్ఫూర్తిని ఈనాటి యువతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. గ్రామంలో భూమిలేని పేదలందరికీ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆనాడు 250 ఎకరాలకు పైగా భూములను పంపిణీ చేశారని గుర్తు చేశారు. పార్టీ యాదాద్రిభువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు గూడూరు బుచ్చిరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు జంగారెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి పాండు, మేక అశోక్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, గడ్డం వెంకటేష్, బొడ్డుపల్లి వెంకటేష్, వనం ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



శిఖం..ఖతం

రాష్ట్రవ్యాప్తంగా 31వేల ఎకరాల చెరువు శిఖాలు కబ్జా





నీటి పారుదలశాఖ సేకరించిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో చెరువుల భూములు పెద్ద ఎత్తున కబ్జాకు గురవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 31వేల ఎకరాల పట్టా భూమి.. చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని ప్రాథమిక అంచనా. రెవిన్యూ, నీటిపారుదల శాఖలు సంయుక్త సర్వేలు నిర్వహిస్తే ఇంకా పెద్ద ఎత్తున ఆక్రమణలు బయటకు వచ్చే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో 'హైడ్రా' ఆపరేషన్ మొదలయ్యాక చెరువు శిఖాలు, ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లపై పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. కబ్జా చెర నుంచి చెరువులు బయటపడాలంటే హైడ్రా తరహా కార్యాచరణ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాలనే డిమాండ్ పెద్ద ఎత్తున వినిపిస్తోంది.

ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సంయుక్త సర్వేతో ఫలితాలు

విచ్చలవిడి ఆక్రమణలు..అడ్డగోలు ఎన్‌వోసీలు

ఆక్రమణలపై నీటిపారుదలశాఖ రిపోర్టుల్లో కొరవడిన స్పష్టత

ఖమ్మంలోని కొన్ని చెరువుల్లో కబ్జాలున్నా.. లేనట్లు రిపోర్టు

సర్వే చేయాల్సిన రెవెన్యూ అధికారుల్లో నిర్లిప్తత

ధరణి నిషేధిత జాబితాలో కానరాని ఆక్రమిత భూములు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

హైదరాబాద్‌లో హైడ్రా కదలికలు తీవ్రరూపం దాల్చిన నాటి నుంచి జిల్లాల్లో.. ముఖ్యంగా జిల్లా కేంద్రాల్లో చెరువుల ఆక్రమణలపై చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ కూడా ఎప్పటికప్పుడు నివేదికలను పై అధికారులకు పంపుతోంది. కానీ ఆ నివేదికల్లో ఆక్రమణలు అంతంతమాత్రంగానే పేర్కొంటోంది. ఏ చెరువుకు ఏ సర్వే నంబర్లలో ఎంతెంత భూమి ఉంది.. వాటి వాస్తవ విస్తీర్ణం ఎంత? అనే అంశాన్ని ఇరిగేషన్ అధికారులు వెల్లడిస్తున్నా..అవి ఎంతమేరకు ఆక్రమణలకు గురయ్యాయని ప్రశ్నిస్తే సరైన సమాధానం ఉండటం లేదు. దాన్ని నిర్ధారణ చేయాల్సింది రెవెన్యూ అధికారులని దాటవేస్తున్నారు. ఉదాహరణకు ఖమ్మం ఇరిగేషన్ డివిజన్ నంబర్ -2 పరిధిలో 14 చెరువులు ఉండగా వీటిలో మూడు చెరువుల్లోనే ఆక్రమణలున్నాయని పేర్కొనడం ఆశ్చర్యం గొల్పుతోంది. వీటిలో లకారం చెరువును ప్రభుత్వమే ట్యాంక్‌బండ్ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసిందని నివేదికలో ఉంది. మొత్తం 326.66 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువు ఆయకట్టు 126 ఎకరాలని పేర్కొంది. పట్టణీకరణ ప్రభావంతో దీని ఆయకట్టు ఇండ్లు, ఇండ్లస్థలాలుగా మార్పిడి చెందిందని పేర్కొంది. కానీ బడాబాబులు ఈ చెరువు భూములను వందల ఎకరాల్లో ఆక్రమించిన విషయాన్ని మాత్రం స్పష్టం చేయలేదు. ఖానాపురం ఊరచెరువు సర్వేనంబర్ 13కు ఆనుకొని ప్రయివేటు పట్టా భూములున్నాయి. బల్లేపల్లి రెవెన్యూ సర్వే నెం.202 ఊరచెరువులోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న భూమికి నీటి పారుదల శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కన్వర్షన్, భవన నిర్మాణ అనుమతులు జారీ అయ్యాయి. వెలుగుమట్ల రెవెన్యూలోని పెద్దచెరువు సర్వే నెం.565లో ఓ రెండు ఎకరాల భూమిని ఓ జర్నలిస్టు ఆక్రమించారు. ఆ స్థలంలో బోరు కూడా వేశారు. వెలుగుమట్ల రెవెన్యూలో భద్రాచలానికి చెందిన ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మరో ఐదుగురు ఆక్రమించిన విషయాన్ని రిపోర్టులో చూపారు. కానీ బల్లేపల్లి రాయని చెరువు, ధంసలాపు రం పెద్దచెరువు, మల్లెమడుగు ఊర చెరువులో ఆక్రమణలు లేనట్టు పేర్కొనటం ఆశ్చర్యం గొల్పుతోం ది. కొన్ని చెరువుల ఆక్రమణ విషయంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగం సహకారం తీసుకోవడం, పోలీసుల సహాయంతో కబ్జాలపై విచారణ సాగుతున్నా కొన్నింటి విషయంలో రిపోర్టులో స్పష్టత కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి.

విచ్చలవిడి ఆక్రమణలు.. అడ్డగోలు ఎన్‌వోసీలు

చెరువు శిఖాలు విచ్చలవిడి ఆక్రమణలకు గురవుతున్నా చర్యలు లేకపోగా.. డబ్బులు తీసుకొని ఇరిగేషన్ డిపార్టుమెంట్ నుంచి నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్లు (ఎన్‌వోసీ) ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డీటీసీపీ లేఅవుట్లు వచ్చాక అడ్డగోలు ఎన్‌వోసీలు కొంత మేర తగ్గినా.. ఇప్పటికీ కొందరు నీటిపారుదలశాఖ అధికారులకు ఇదో ప్రధాన ఆదాయ వనరుగా ఉందనే చర్చ సాగుతోంది. కొందరు నీటిపారుదలశాఖ ఇంజనీర్లు నిజాయితీగా వ్యవహరిస్తున్నా రాజకీయ, ఇతరత్రా ఒత్తిడులకు తలొగ్గి కబ్జా భూములకు సైతం ఎన్‌వోసీ ఇవ్వాల్సి వస్తోంది. కొన్నిచోట్ల ఇరిగేషన్ ఇంజనీర్ల సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ ఎన్‌వోసీలు సృష్టిస్తున్న ఉదంతాలు ఉన్నాయి.

ఆక్రమిత భూములకూ పాస్‌పుస్తకాలు..

ఆక్రమిత భూములకూ పాస్‌పుస్తకాలు వస్తున్నాయి. దీనికి ఏక్ ఫసల్ పట్టా దోహదపడుతోంది. దీన్ని ఆధారం చేసుకొని పలుచోట్ల శిఖాలను ఖతం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. రాష్ట్రంలో వివిధ రకాల నీటి వనరులు 46వేల వరకు ఉండగా వాటిలో 43,412 చెరువులు, కుంటల కింద 21 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. రైతులకు రుణసౌకర్యం కల్పించేందుకు ఏక్ ఫసల్ పట్టాలను రెవెన్యూశాఖ జారీ చేసింది. కొన్నిచోట్ల వీటిని కొందరు శాశ్వత పట్టాలుగా మలుచుకున్నారు. ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో ఏక్ ఫసల్ పట్టాలు కాస్త శాశ్వత పట్టాగా మారాయి.

హైదరాబాద్‌లో 25 చెరువుల దత్తత

హైదరాబాద్‌లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద 25 చెరువులను అభివృద్ధి చేసే క్రమంలో బడా కంపెనీలకు గత ప్రభుత్వం దత్తత ఇచ్చింది. దానివల్ల చెరువుల అభివృ ద్ధి జరగలేదని తెలుస్తోంది. జీహెచ్ఎంసీకీ ఆదాయం లేదు. ఆ కంపెనీలు మాత్రం కోట్లకు పడగనెత్తాయని ప్రభుత్వం దృష్టికి వచ్చినట్టు తెలుస్తోంది.

ధరణి నిషేధిత జాబితాతోనే పరిష్కారం..

శిఖం భూమికి పట్టా జారీ అయ్యాక ధరణి పోర్టల్‌లోనూ నమోదు చేస్తున్నారు. దీనివల్ల ఆ భూముల క్రయవిక్రయాలకు అవకాశం ఏర్పడుతోంది. చెరువులకు సంబంధించిన సర్వే నంబర్లు, ఉప సర్వే నంబర్లు నిషేధిత జాబితా (22ఏ)లో చేర్చడమే దీనికి పరిష్కారమని నిపుణులు సూచిస్తున్నారు. ఇరిగేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ద్వారా ఆదేశాలు రావడంతో శిఖం భూముల వివరాలను తేల్చే పనిలో ఆ శాఖ ఇంజనీర్లు తలమునకలయ్యారు. కానీ రెవెన్యూశాఖ సహాయం ఉంటేనే కార్యాచరణ పూర్తవుతుందనే అభిప్రాయం వెలువడుతోంది.















పారాలో పతక మోత

నవతెలంగాణ-పారిస్ : పారా అథ్లెట్లు ప్రపంచ క్రీడా వేదికపై భారత్‌కు గోల్డెన్ స్టాండర్డ్స్ నెలకొల్పారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగం (ఎస్‌హెచ్1) విభాగంలో భారత్ ఏకంగా రెండు పతకాలు సాధించింది. గతంలో భారత్ ఎన్నడూ మెడల్ పోడియంపై ఇలా రెండు పతకాలు ఒకే విభాగంలో సాధించలేదు. పారిస్ పారాలింపిక్స్‌లో అవని లేఖర, మోన అగర్వాల్ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించారు. టోక్యో పారాలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్ అవని లేఖర పారిస్‌లో పసిడి నిలబెట్టుకోగా.. తొలి ప్రయత్నంలోనే మోన అగర్వాల్ ప్రతిష్టాత్మక పారా విశ్వ క్రీడల్లో పతకం సాధించింది. పారాలింపిక్స్ 2024 రెండో రోజు పోటీల్లో భారత్ మరో రెండు పతకాలు సహా నాలుగు మెడల్స్ ఖాతాలో వేసుకుంది.


డబుల్ ధమాకా : మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ (ఎస్‌హెచ్1) విభాగంలో భారత్ డబుల్ ధమాకా చూపించింది. డిఫెండింగ్ చాంపియన్ , 22 ఏండ్ల అవని లేఖర పసిడి పతకం నిలుపుకోగా.. కొత్త కెరటం మోన అగర్వాల్ సైతం పతక వేటలో మెప్పించింది. ఫైనల్లో అనుభవాన్ని అంతా ఉపయోగించిన అవని లేఖర సూపర్ గురితో 249.7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. పసిడి పతకం సొంతం చేసుకుంది. 36 ఏండ్ల మోన అగర్వాల్ తొలి ప్రయత్నంలోనే పతకం సాధించింది. ఆరంభంలో నెమ్మదించినా ఆఖరు రౌండ్ల సిరీస్‌లలో మోన మెప్పించింది. 228.7 పాయింట్లతో కాంస్య పతకం అందుకుంది. దక్షిణ కొరియా షుటర్ లీ 246.8 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ అందుకుంది. ఫైనల్ సిరీస్‌లో అవని లేఖర 9.9తో ఒత్తిడిలో పడగా.. అదే సిరీస్‌లో దక్షిణ కొరియా షుటర్ 6.8 పాయింట్లే సాధించింది. దీంతో అవని లేఖర సులువుగా బంగారు పతకం ఎగరేసుకుపోయింది. అవని లేఖర, మోన అగర్వాల్ పారిస్ పారాలింపిక్స్‌లో మరో మెడల్‌పై సైతం కన్నేశారు. మహిళల 50 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ఈ పతక జోడీ బరిలోకి దిగనుంది.

మనీశ్ నర్వాల్‌కు సిల్వర్ : షుటింగ్‌లో టీమ్ ఇండియాకు మరో మెడల్ లభించింది. టోక్యో పారాలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్ మనీశ్ నర్వాల్ పారిస్‌లోనూ పతకం సాధించాడు. పురుషుల 20 మీటర్ల ఎయిర్ పిస్టల్ (ఎస్‌హెచ్1) విభాగంలో మనీశ్ నర్వాల్ సిల్వర్ మెడల్ సాధించాడు. 22 ఏండ్ల మనీశ్ నర్వాల్ ఆరంభంలో ఆశించిన స్కోరు చేయలేదు. ఆ తర్వాత నెమ్మదిగా బిగ్ స్కోర్లు సాధించిన మనీశ్ 234.9 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. పారాలింపిక్స్‌లో వరుసగా పతకాలు సాధించాడు. దక్షిణ కొరియా షుటర్ 237.4 పాయింట్లతో పసిడి నెగ్గగా.. చైనా షుటర్ కాంస్య పతకం సాధించాడు.

ప్రీతి పాల్ రికార్డు పరుగు : ప్రీతి పాల్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో చరిత్ర సృష్టించింది. పారాలింపిక్స్ అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెంలో భారత్‌కు తొలి పతకం సాధించిన పారా స్ప్రింటర్‌గా ప్రీతి పాల్ రికార్డు నెలకొల్పింది. మహిళల 100 మీటర్ల పరుగు (టీ 35) విభాగంలో ప్రీతి పాల్ 14.21 సెకండ్ల టైమింగ్‌తో కాంస్య పతకం సాధించింది.





















Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886